Email:prajamantalu@gmail.com
www.prajamantalu.com

# ప్రజా మంటలు

సంపుటి : 4 సంచిక : 167
పేజీలు - 8 వెల - రూ 5:00
ఎడిటర్ : సిహెచ్.వి. ప్రభాకర్ రావు

శుక్రవారం 09, ఫిబ్రవరి-2024

Published From Jagithyal, Circulated to Jagtial, Jangaon,Jayashankar Bhoopalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahabubnagar, Mancherial, Medak,Medchal, Nagarkurnool, Nalgonda, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla,Rangareddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal (Rural), Warangal (Urban), Yadadri Bhuvanagiri

## మోడీ బిసి కాదు..ఓసికి చెందిన వ్యక్తి



3లో..

# ఆరుగ్యారెంటీల అమలుకు కట్టుబడి ఉన్నాం

- తెలంగాణలో ప్రజాప్రభుత్వం ఏర్పాటు
- ప్రజాభవన్ కంచె తొలగింపుతో ప్రజలకు స్వేచ్ఛ
- ఇచ్చిన హామీ మేరకు 2లక్షల ఉద్యోగాల భర్తీ
- మూసీ అభివృద్ధి,రంగారెడ్డి పాలమూరు పూర్తి చేస్తాం
- ఆర్థికంగా చిన్నాభిన్నం అయిన రాష్ట్రాన్ని గాడిలో పెట్టే పని
- ఉభయసభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగం


హైదరాబాద్,ఫిబ్రవరి8 : తెలంగాణ ప్రజలు ప్రజాస్వామ్యం కోసం పోరాడారని.. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజాభవన్ ముందున్న ఇనుప కంచెను తొలగించడం ద్వారా ప్రజలకు స్వేచ్ఛ కలిగించామని గవర్నర్ తమిళిసై సౌందర్ రాజన్ అన్నారు. ప్రజల కోసం ఏర్పడ్డ ప్రభుత్వం ఇదని అన్నారు.టీఎస్‌పీఎస్సీ ద్వారా 2 లక్షల ఉద్యోగాల భర్తీకి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ వెల్లడించారు. పెద్దఎత్తున మూసీ రివర్ ఫ్రంట్ అభివృద్ధి పనులు చేపడతామని.. ఆ నది మరోసారి హైదరాబాద్ జీవనాడిగా మారుతుందని చెప్పారు. చిన్నాభిన్నమైన ఆర్థిక వ్యవస్థను చక్కదిద్దే పనిలో ఉన్నామని అన్నారు. గురువారం తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభ మయ్యాయి. ఈ సందర్భంగా గవర్నర్ తమిళిసై ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగించారు. తెలంగాణ ప్రముఖ కవి కాళోజీ నారాయణ కవితతో గవర్నర్ తన ప్రసంగాన్ని ప్రారంభించారు. సామాన్య ప్రజల కోసం ప్రజాభవన్‌ను తెరిచామని చెప్పారు. ఆరు గార్యంటీలల్లో రెండింటిని అమలు చేశామని.. త్వరలో మరో రెండు గ్యారంటీలను అమలు చేయనున్నట్లు తెలిపారు. అర్హులకు రూ.500లకే గ్యాస్ సిలిండర్‌ను ఇస్తామన్నారు. గత ప్రభత్వం రాష్ట్రాన్ని అప్పుల మయం చేసి.. మాకు అప్పగించారని..ధనిక రాష్ట్రంలో ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేశారని చెప్పారు.



ప్రజలపై భారం వేయకుండా ఆర్థిక వ్యవస్థను గాడిన పెడతామని.. తెలంగాణ రాష్ట్రాన్ని పునర్ నిర్మాణం చేసేందుకు ప్రయత్నిస్తున్నామని చెప్పారు. రైతులు, మహిళలు, యువతకు ఇచ్చిన హామీల అమలుకు కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. కాలానుగుణంగా హామీలను అమలు చేస్తామని.. ఆరు గ్యారంటీలను ఖచ్చితంగా అమలు చేసి తీరుతామని తెలిపారు. ప్రజాపాలన కార్యక్రమంలో 1.8 కోట్ల దరఖాస్తులు వచ్చాయని చెప్పారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజాభవన్ కంచెను తొలగించారన్నారు. మిగతా 3లో..

# ఆర్‌బిఐ కీలక వడ్డీరేట్లు యధాతథం

- రెపోరేటును 6.5 శాతం వద్దే కొనసాగింపు
- ఆహార ధరల్లో అనిశ్చితి కారణంగా ద్రవ్యోల్బణం
- మోనిటరీ పాలసీ కమిటీ నిర్ణయాలను వెల్లడించిన శక్తికాంత్ దాస్



ముంబై,ఫిబ్రవరి8 : కీలక వడ్డీరేట్లను ఆర్‌బీఐ యథాతథంగా ఉంచింది. అంతా ఊహించినట్లుగానే రెపోరేటును 6.5 శాతం వద్దే కొనసాగించాలని నిర్ణయించింది. మంగళవారం ప్రారంభమైన ఆర్‌బీఐ ద్వైమాసిక ద్రవ్యపరపతి విధాన సమీక్ష నిర్ణయాలను గవర్నర్ శక్తికాంత దాస్ గురువారం వెల్లడించారు. భారత వృద్ధిరేటు చాలా మంది విశ్లేషకుల అంచనాలను మించి నమోదవుతోందని దాస్ తెలిపారు. దేశీయంగా ఆర్థిక కార్యకలాపాలు బలంగా ఉన్నాయన్నారు. ఆహార ధరల్లో అనిశ్చితి ప్రధాన ద్రవ్యోల్బణం పై ప్రభావం చూపుతోందని వివరించారు. రిటైల్ ద్రవ్యోల్బణాన్ని లక్ష్మిత పరిధి అయిన నాలుగు శాతం లోపునకు తీసుకువచ్చే విషయంలో ఎలాంటి మార్పులేదన్నారు. 2024లో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ వృద్ధి స్థిరంగా ఉంటుందని అంచనా వేశారు. వరుసగా 6వ సారి కీలకమైన రెపో రేటుని యథాతథంగా 6.50 శాతంగా కొనసాగించనున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ నేతృత్వంలోని ద్వైమాసిక ద్రవ్య విధాన సమీక్షలో 'మోనిటరీ పాలసీ కమిటీ' నిర్ణయం తీసుకుంది. దీంతో గతేడాది ఏడాది ఏప్రిల్ నుంచి ఇదే రేటుని ఆర్బీఐ కొనసాగిస్తోంది. వృద్ధికి ఊతమివ్వడం, ద్రవ్యోల్బణం ఆర్బీఐ పరిధి దాటకుండా చేయడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నామని ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత్ దాస్ చెప్పారు. రెపోరేటు విషయంలో సర్దుబాటు వైఖరిని పాటించాలని ఆరుగురు ఎంపీసీ సభ్యుల్లో ఐదుగురు అభిప్రాయ పడ్డారని చెప్పారు. ధరల పెరుగుదలను నిరంతరం పరిశీలించనున్నట్లు శక్తికాంత్ దాస్ చెప్పారు. కాగా 2024-25 మధ్యంతర బడ్జెట్‌ను మిగతా 3లో..

# హైదరాబాద్‌లో ఎన్ఐఏ సోదాలు

- వీక్షణం ఎడిటర్ వేణుగోపాల్ ఇంట్లో తనిఖీలు
- ఫోన్ తదితర వస్తువుల స్వాధీనం



హైదరాబాద్,ఫిబ్రవరి8 : హైదరాబాద్ నగరంలోని పలు ప్రాంతాల్లో గురువారం తెల్లవారుజాము నుంచి జాతీయ దర్యాప్తు సంస్థ అధికారులు సోదాలు చేపట్టారు. హిమాయత్ నగర్ లోని వరవరరావు అల్లుడు, సీనియర్ జర్నలిస్ట్ 'వీక్షణం' పత్రిక ఎడిటర్‌గా ఉన్న ఎన్.వేణుగోపాల్ పాటు ఎల్బీనగర్ లోని రవిశర్మ, అనురాధ దంపతుల నివాసాల్లో సోదాలు నిర్వహించారు. వేణు ఇంట్లో దాదాపు 5 గంటల పాటు తనిఖీలు చేశారు. మావోయిస్టులతో సంబంధాలు ఉన్నాయనే ఆరోపణలతో ఈ తనిఖీలు చేపట్టినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో రవిశర్మ సెల్ ఫోన్, పాత పుస్తకాలు, పాత కరపత్రాలు సీజ్ చేశారు. ఈ నెల 10న విచారణకు రావాలని ఆదేశించారు. కాగా, ఇటీవల మిగతా 3లో..

# ఉభయసభలు నేటికి వాయిదా

- కాళోజీ కవితతో చెంపదెబ్బ
- నేడు గవర్నర్ ప్రసంగంపై చర్చ
- తొలిరోజు సభకు కెసిఆర్ డుమ్మా

హైదరాబాద్,ఫిబ్రవరి8 : ఉభయసభలను ఉద్దేశించి గవర్నర్ తమిళిసై ప్రసంగించారు. గవర్నర్ ప్రసంగంలో కాళోజీ కవితను ప్రస్తావించిన అంశం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ప్రజాకవి, పద్మవిభూషణ్ కాళోజీ నారాయణరావు కవితతో గవర్నర్ తెలుగులో ప్రసంగాన్ని మొదలుపెట్టారు. అయితే ఆ కవితలో గత ప్రభుత్వం తీరును ఎండగడుతూ గవర్నర్ వ్యాఖ్యలు చేశారు.' అధికారమున్నదని హద్దు పద్దు లేక.అన్యాయమార్గాల నార్జింపబూనిన .అచ్చి వచ్చే రోజులంతమైనాయి .అచ్చి వచ్చే రోజులంతమైనాయి!' అంటూ గవర్నర్ ప్రసంగాన్ని ప్రారంభించారు. గత ప్రభుత్వాన్ని ఉద్దేశించి గవర్నర్ చేసిన ఈ వ్యాఖ్యలు హాట్‌టాపిక్‌గా మారాయి. కాగా... గణతంత్ర దినోత్సవం రోజున గవర్నర్ స్పీచ్‌లో గత బీఆర్ఎస్ పాలనపై ఘాటైన విమర్శలు గుప్పించిన విషయం తెలిసిందే. మరోవైపు అసెంబ్లీ సమావేశాలకు బీఆర్ఎస్ చీఫ్, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ డుమ్మా కొట్టారు. శుక్రవారం ధన్యవాద తీర్మానం చేయడానికి ఆయన హాజరయ్యే అవకాశమున్నట్లు సమాచారం. శస్త్ర చికిత్స చేయించుకున్న కారణంగా గత అసెంబ్లీ సమావేశాలకు



కేసీఆర్ హాజరుకాలేదు.గవర్నర్ ప్రసంగం అనంతరం ఉభయసభలు వాయిదా పడ్డాయి. శుక్రవారం గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై చర్చ మిగతా 3లో..

# శివబాలకృష్ణ అక్రమాస్తులపై ఇడి దృష్టి




## రంగంలోకి ఐటి అధికారులు

హైదరాబాద్,ఫిబ్రవరి8 : హెచ్ఎండీఏ మాజీ డైరెక్టర్ శివబాలకృష్ణ అక్రమాస్తులపై కేంద్ర దర్యాప్తు సంస్థలు దృష్టి సారించాయి. ఈడీతోపాటు ఐటీ అధికారులు రంగంలోకి దిగనున్నారు. శివబాలకృష్ణ ఎఫ్ఐర్, రిమాండ్ రిపోర్టులను తమకు ఇవ్వాలని ఏసీబీకి ఈడీ లేఖ రాసింది. మనీలాండరింగ్ కోణంలో ఆయనను విచారించనుంది. మరోవైపు శివబాలకృష్ణ బినామీ ఆస్తులపై కూడా ఐటీ అధికారులు విచారణ చేపట్ట నున్నట్లు తెలుస్తున్నది. అధికారాన్ని ఉపయోగించుకుని భారీగా అక్రమాస్తులను కూడబెట్టిన శివబాలకృష్ణను ఏసీబీ అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో ఏసీబీ కస్టడీ బుధవారంతో ముగిసింది. 8 రోజుల కస్టడీలో చేపట్టిన విచారణలో రూ.250 కోట్ల అక్రమాస్తులను గుర్తించారు. శివబాలకృష్ణ బంధువుల పేరిట 214 ఎకరరాల వ్యవసాయ భూములు రిజిస్టర్ అయినట్టు తేలిందని అధికారులు తెలిపారు. జనగామ జిల్లాలో 102, యాదాద్రి భువనగిరి జిల్లాలో 66, నాగర్ కర్నూల్ జిల్లాలో 38, సిద్దిపేటలో 7 ఎకరాలు రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్టు వెల్లడించారు. తెలంగాణలో 29, ఆంధ్రప్రదేశ్‌లోని విజయనగరం, విశాఖపట్నంలో 3 ఓపెన్ ఎ లాట్లతోపాటు రూ.30.3 కోట్ల విలువైన 7 ఎలాట్లు, 3 విల్లాలను గుర్తించినట్టు తెలిపారు. బ్యాంకు లాకర్‌లో ఉన్న 18 తులాల బంగారం, ఓ పాస్‌బుక్‌ను జప్తు చేశామన్నారు. శివబాలకృష్ణ సోదరుడు శివనవీన్‌కుమార్ అరెస్టు తో మరో నలుగురు బినామీలను గుర్తించినట్టు చెప్పారు. శివనవీన్‌కుమార్ భార్య పేరిట ఉన్న ఆస్తులపై కూడా దర్యాప్తు జరుపుతున్నట్టు తెలిపారు. శివబాలకృష్ణ అక్రమాల వెనుక హెచ్ఎమ్‌డీఏ, మెట్రోరైల్‌అధికారుల పాత్రపై సమగ్ర దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

# చంద్రబాబు సలహా మేరకు రేవంత్ నిర్ణయాలు


- టీఎస్పీఎస్సీ చైర్మన్ మహేందర్ రెడ్డిని తప్పించాలి
- విద్యుత్ సంస్థలో ఆంధ్రా వారి నియామకాలు
- సింగరేణి ఉద్యోగాలపై తప్పడు ప్రకటనలు
- తెలంగాణ తల్లి విగ్రహంపైనా తప్పడు ఆరోపణలు
- మీడియా సమావేశంలో కవిత విమర్శలు

హైదరాబాద్,ఫిబ్రవరి8 : గురువు చంద్రబాబు బాటలో శిష్యుడు సీఎం రేవంత్ రెడ్డి నడుస్తు న్నాడని.. ఆయనలో పచ్చ రక్తం ప్రహిస్తోందంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత వ్యాఖ్యలు చేశారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ.. టీఎస్పీఎస్సీ చైర్మన్‌గా మహేందర్‌రెడ్డిని నియమించడంపై ఎమ్మెల్సీ తీవ్ర అభ్యంతరం తెలిపారు. టీఎస్పీఎస్సీ చైర్మన్ మహేందర్ రెడ్డిని తప్పించాలని డిమాండ్ చేశారు. మహేందర్ రెడ్డిపై ఆరోపణల నేపథ్యంలో జ్యుడిషియల్ విచారణ జరిపించాలన్నారు. బీఆర్ఎస్ హయాంలో డీజీపీగా ఉన్న మహేందర్ రెడ్డిని అప్పుడు రేవంత్ రెడ్డి దూషించారన్నారు. టీఎస్‌పీఎస్సీ చైర్మన్ మహేందర్ రెడ్డి తక్షణమే తొలగించాలని



కవిత డిమాండ్ చేశారు. ఆయనపై అవినీతి ఆరోపణలు ఉన్నాయని చెప్పారు. ఈ విషయమై త్వరలో గవర్నర్‌ను కలుస్తామని తెలిపారు. మాజీ డీజీపీపై జ్యుడిషియల్ విచారణ జరపాలన్నారు. మహేందర్ రెడ్డిపై రేవంత్ రెడ్డి గతంలో మిగతా 3లో..

## ప్రజానాడి



## కెసిఆర్ కుటుంబాన్ని జైలుకు పంపాల్సిందే

- అందుకు తాను హోంమంత్రిని కావాల్సిందే
- కాంగ్రెస్ ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి వ్యాఖ్య

# మహేందర్ రెడ్డి మీలాగా లిక్కర్ స్కామ్‌లో ఉన్నారా?

వివరాలు 2లో..




- లేకపోతే మీలాగా కమిషన్ పేపర్లు లీక్ చేశారా ?
- అవినీతిపరుడైతే డిజిపిగా ఎలా నియమించారు
- నీళ్లు,నిధులు, నియామకాల పేరుతో రాష్ట్రాన్ని కొల్లగొట్టారు
- సింగరేణి నిధులను బాహాటంగా తరలించుకు పోయారు
- కవిత విమర్శలకు ఘాటు సమాధానం ఇచ్చిన మంత్రి కొండా సురేఖ

# కెసిఆర్ కుటుంబాన్ని జైలుకు పంపాల్సిందే

### అందుకు తాను హోంమంత్రిని కావాల్సిందే

### కాంగ్రెస్ ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి వ్యాఖ్య



హైదరాబాద్,ఫిబ్రవరి8 : అసెంబ్లీ సమావేశాల తర్వాత మంత్రివర్గ విస్తరణ ఉంటుందని కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. తాను హోంమంత్రిని కావాలని కోరుకుంటున్నానని అన్నారు. శాసనసభ ప్రాంగణంలో మీడియా ప్రతినిధులతో ఆయన ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. తనకు అధిష్ఠానం హామీ ఇచ్చిందని.. హోంశాఖ ఇవ్వాలని కోరుతున్నానని చెప్పారు. కేసీఆర్‌ను గద్దె దించేందుకే కాంగ్రెస్‌లోకి వచ్చా. నేను హోంమంత్రి అయితేనే భారాస నేతలు కంట్రోల్‌లో ఉంటారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు, కవిత, సంతోష్‌రావు, జగదీశ్‌రెడ్డి జైలుకు వెళ్లడం ఖాయం. భువనగిరి, నల్గొండ లోక్‌సభ స్థానాల్లో మా కుటుంబ సభ్యులెవరూ పోటీ చేయకూడదనేది మా ఆలోచన. పార్టీ ఆదేశిస్తే పోటీ చేస్తాం. ఎవరికి టికెట్ ఇచ్చినా గెలిపిస్తాం అని రాజగోపాల్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఇదిలావుంటే తెలంగాణ అసెంబ్లీ అవరణలో మాజీ మంత్రి కేటీఆర్, కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మధ్య ఆసక్తికర చర్చ జరిగింది. రాజగోపాల్ రెడ్డిని చూసిన కేటీఆర్ మీకు మంత్రి పదవి ఎప్పుడు వస్తుందని ప్రశ్నించారు. మీ లానే మాకు ఫ్యామిలీ ఎఫెక్ట్ పడుతుందని రాజగోపాల్ రెడ్డి పేర్కొన్నారు. ఫ్యామిలీ పాలన కాదు.. మంచిగా పని చేస్తే కీర్తి ప్రతిష్టలు వస్తాయని కేటీఆర్ అన్నారు. ఎంపీగా మీ కూతురు కీర్తి పోటీ చేస్తుందా.. సంకీర్త్ పోటీ చేస్తున్నారా? అని కేటీఆర్ అడిగారు. దయచేసి తనను కాంట్రవర్సీలోకి లాగవద్దంటూ రాజగోపాల్ రెడ్డి అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఇక అనంతరం అసెంబ్లీ లాబీలో రాజగోపాల్ రెడ్డి మీడియాతో కాసేపు చిట్ చాట్ చేశారు. కేసీఆరే దగ్గరుండి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను బీజేపీలోకి పంపుతారన్నారు. వాళ్ళను వాళ్ళు కాపాడుకోడానికి బీజేపీలో బీఆర్ఎస్ వాళ్లు చేరుతారన్నారు. తనకు హోం మంత్రి కావాలని ఉందని.. బీఆర్ఎస్ వాళ్లను జైలుకు పంపాలని కోరికగా ఉందన్నారు.

# ఖానాపూర్‌లో పట్టపగలే దారుణ హత్య

### యువతిని హత్య చేసిన యువకుడు

నిర్మల్,ఫిబ్రవరి8 : నిర్మల్ జిల్లాలో దారుణం చోటుచేసుకుంది. నడిరోడ్డుపై యువతిని కత్తితో నరికి ఓ యువకుడు దారుణంగా హత్య చేశాడు. జిల్లాలోని ఖానాపూర్ పరిధి శివాజీనగర్‌లో గురువారం మధ్యాహ్నం ఈ ఘటన జరిగింది. అలేఖ్య అనే యువతిని ఆమె ప్రియుడు శ్రీకాంత్.. నరికి చంపాడు. యువతి టైలరింగ్‌కు వెళ్లి వస్తుండగా.. నిందితుడు దాడి చేసినట్లు తెలుస్తోంది. ఈ ఘటనలో మృతురాలి సోదరి జయ, రియాన్స్ అనే బాలుడికీ తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు.. సంఘటన స్థలానికి చేరుకున్నారు. గాయపడ్డ వారిని స్థానికులు ఆస్పత్రికి తరలించారు. యువతి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ప్రేమ వ్యవహారమే ఈ హత్యకు కారణమని అనుమానిస్తున్నారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. కాగా, ఈ ఘటనతో స్థానికంగా తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఖానాపూర్ పట్టణంలోని అంబేద్కర్ నగర్ కాలనీకి చెందిన సీహెచ్ సోనీ అలియాస్ స్వీటీ (20).. టైలరింగ్ షాపు నుంచి ఇంటికి వెళ్తుండగా యువకుడు కత్తితో దాడి చేశాడు. అడ్డుకోబోయిన ఆమె వదిన, పక్కనే ఉన్న రెండేళ్ల చిన్నారిపైనా దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటనలో యువతి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. బాలుడి తలకు గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే క్షతగాత్రులను స్థానిక ఆస్పత్రికి తరలించారు. సంఘటనా స్థలాన్ని సీఐ మోహన్, ఎస్ఐ లింబాద్రి పరిశీలించారు. యువతిపై దాడికి ప్రేమ వ్యవహారమే కారణమని పోలీసులు అనుమానిస్తున్నారు. హత్య చేసిన తర్వాత పరారైన నిందితుడి కోసం పోలీసులు గాలిస్తున్నారు.

# జయజయహే గీతం కెసిఆర్ ప్రోత్సాహమే

### అందెశ్రీతో రాయించిన ఘనత కెసిఆర్‌ది

### మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

కరీంనగర్,ఫిబ్రవరి8 : జయ జయహే తెలంగాణ రాష్ట్ర గీతం విషయంలో జరుగుతున్న వివాదంపై మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ స్పందించారు. ఈ అంశాన్ని కాంగ్రెస్ పార్టీ లోక్‌సభ ఎన్నికలకు ముందు పొలిటికల్ మైలేజ్ కోసం వాడుకుంటోందని ఆరోపించారు. అసలు జయ జయహే తెలంగాణ పాటకు కర్త కర్మ క్రియ? బీఆర్ఎస్ పార్టీనే అని అన్నారు. 2003 –2004 లో అందెశ్రీ ఈ పాటను రాసారని, కేసీఆర్ ప్రోత్సాహంతో ఆ పాటను రికార్డ్ చేశామన్నారు రసమయి. అయితే అందెశ్రీ రాసిన ఒరిజినల్ పాటలో 12 చరణాలు ఉండటంతో వాటిని 4 చరణాలకు తగ్గించాలనే ప్రతిపాదనకు అందెశ్రీ ససేమిరా ఒప్పుకోలేదన్నారు. తన పాటను యథాతథంగా 12 చరణాలతో వాడాలని చెప్పడంతోనే ఆ గీతాన్ని రాష్ట్ర గీతంగా వాడలేకపోయాం తప్ప, వేరు దురుద్దేశం మాజీ సీఎం కేసీఆర్‌కు లేదన్నారు రసమయి బాలకిషన్. జయ జయహే తెలంగాణ అనే పాటని రాష్ట్ర గీతంగా అప్పుడు ప్రకటించాలని కేసీఆర్ అనుకున్నా? కేవలం అందెశ్రీ ఒప్పుకోకపోవడం వల్లే ఆగిపోయిందన్నారు రసమయి. కేసీఆర్ కర్త కర్మ క్రియగా ఉండి రికార్డు చేసిన పాటను? రేవంత్ కేవలం పొలిటికల్ మైలేజ్ కోసమే ఇప్పుడు తెరపైకి తీసుకువచ్చి లబ్ది పొందాలని చూస్తున్నారని ఆరోపిస్తున్నారు. మొత్తానికి? ఒక పాట.. రెండు స్వరాలు.. తెలంగాణ రాజకీయాల్లో రచ్చ రేపుతున్నాయి.

# యాదాద్రి మెడికల్ కాలేజీని కొండల్‌కు తరలిస్తారా

### సిఎం రేంవత్ తీరుపై మాజీ ఎమ్మెల్యే సునీత ఆగ్రహం



యాదాద్రి భువనగిరి,ఫిబ్రవరి8 : ప్రపంచ ప్రఖ్యాతి పొందే విధంగా తెలంగాణను కేసీఆర్ అభివృద్ధి చేశారని ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత అన్నారు. రూ.1250 కోట్లతో యాదగిరిగుట్ట ఆలయాన్ని పునర్నిర్మించారు. గ్రీన్ ఆపిల్ సంస్థ కూడా యాదగిరిగుట్ట టెంపుల్‌కు అవార్డు ఇచ్చిందని ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునితామహేందర్ రెడ్డి అన్నారు. గురువారం ఆమె ఆలేరులో మీడియా సమావేశంలో మాట్లాడారు. సీఎం రేవంత్ మాట తీరు అందరికి ఆదర్శంగా ఉండాలి. రేవంత్ భాష పట్ల అందరూ అసహ్యించుకుంటున్నారని పేర్కొన్నారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం యాదగిరిగుట్టకు మెడికల్ కాలేజీని మంజూరు చేసింది. ఎయిమ్స్ కారణంగా మొదట మెడికల్ కాలేజ్ ఇవ్వలేదని మొదట కేసీఆర్ చెప్పిండు. కొట్లాడి యాదగిరిగుట్టకు మెడికల్ కాలేజీ మంజూరు చేపించామన్నారు. ఎన్నికల నోటిఫికేషన్‌తో హాస్పిటల్ శంకుస్థాపన చేయలేదన్నారు. అయితే యాదగిరిగుట్ట మెడికల్ కాలేజీని సీఎం రేవంత్ రెడ్డి కొండంగల్ కు తరలించుకు తరలించుకుపోవడం సరైందా.? అని ప్రశ్నించారు. ఈ నెలాఖరు వరకు మెడికల్ కాలేజీ పై స్పష్టత ఇవ్వాలన్నారు. లేదంటే తదుపరి కార్యాచరణ తీసుకుంటాం. అవసరమైతే రిలే దీక్షలకు దిగుతామని హెచ్చరించారు.

# సమస్యలపై చర్చించేందుకు ప్రభుత్వం సిద్దంగా లేదు

### అసెంబ్లీ సమావేశాలు 12 రోజులైనా నిర్వహించాలి: కడియం

హైదరాబాద్,ఫిబ్రవరి8 : బడ్జెట్ ఆమోదించుకునే తొందరలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజా సమస్యలపై చర్చించాలన్న శ్రద్ధ లేదని బీఏసీ సమావేశం ముగిసిన అనంతరం బీఆర్ఎస్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఈ సభలో ఓట్ ఆన్ అకౌంట్ బ్జడెట్ పెడుతున్నట్లు ప్రభుత్వం చెప్పిందని తెలిపారు. నాలుగు రోజులే సభ నిర్వహిస్తామన్నారు. కనీసం 12 రోజులైనా సభ నిర్వహించాలని కోరినట్లు పేర్కొన్నారు. అవసరమైతే 13న మరోసారి బీఏసీ నిర్వహిస్తామని ప్రభుత్వం చెప్పినట్లు తెలిపారు. త్వరగా బ్జడెట్ ఆమోదించాలని ప్రభుత్వం భావిస్తోంది. ప్రజా సమస్యలు ప్రస్తావించే అవకాశం లేకుండా పోతుందని కడియం శ్రీహరి పేర్కొన్నారు. ఆయా నియోజకవర్గాల్లో ఓడిపోయిన కాంగ్రెస్ అభ్యర్థులు ఎమ్మెల్యేలుగా రెచ్చిపోతున్నారని కడియం శ్రీహరి మండిపడ్డారు. కనీసం ప్రోటోకాల్ పాటించకుండా ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ పార్టీ అభయహస్తం పేరుతో ఇచ్చిన 420 హామీలను బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రశ్నిస్తుందనే భయంతో సమావేశాలను త్వరగా ముగిస్తున్నారని కడియం పేర్కొన్నారు.

# మహేందర్ రెడ్డి మీలాగా లిక్కర్ స్కామ్‌లో ఉన్నారా?

- కవిత విమర్శలకు ఘాటు సమాధానం ఇచ్చిన మంత్రి కొండా సురేఖ



హైదరాబాద్,ఫిబ్రవరి8 : మాజీ డిజిపి మహేందర్ రెడ్డి అవినీతి పరుడని, ఆయనను తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌కు చైర్మన్‌గా ఎలా నియమిస్తారంటూ ఎమ్మెల్సీ కవిత చేసిన వ్యాఖ్యలపై మంత్రి కొండా సురేఖ భగ్గుమన్నారు. అవినీతిపరుడైతే డిజిపిగా ఎందుకు నియమించారో చెప్పాలని అన్నారు. కాంగ్రెస్ పాలనపై భారాస ఎమ్మెల్సీ కవిత చేసిన విమర్శలపై మంత్రి కొండా సురేఖ కౌంటర్ ఇచ్చారు. ఆమె మాటలు దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉన్నాయన్నారు. కేసీఆర్ ప్రభుత్వం రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిందని, ఆర్థికంగా దివాలా తీయించిందని విమర్శించారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మంత్రి మాట్లాడారు. భారాస పాలనలో తెలంగాణ యువతకు న్యాయం చేయలేదు. వారి భవిష్యత్‌ను ప్రశ్నార్థకం చేశారు. నీళ్లు, నిధులు, నియామకాల విషయంలో పూర్తిగా నిర్లక్ష్యం వహించారు. మా ప్రభుత్వం వచ్చి రెండు నెలలు కూడా పూర్తి కాలేదు. రాష్ట్రాన్ని పదేళ్లు పాలించిన వాళ్లు ఇప్పుడు మాపై ఆరోపణలు చేయడం హాస్యాస్పదంగా ఉంది. టీఎస్‌పీఎస్సీ ఛైర్మన్‌గా మహేందర్‌రెడ్డి నియామకం జరిగి రెండు వారాలే అయింది. 36 ఏళ్లుగా ఆయన వివిధ హోదాల్లో పనిచేశారు. ఆయన ఏమైనా లిక్కర్ స్కాం చేశారా? పేపర్లు లీక్ చేశారా? అవినీతి మరకే ఉంటే మీ ప్రభుత్వంలో డీజీపీగా ఎందుకు కూర్చోబెట్టారు? సింగరేణి నిధులను సిరిసిల్ల, గజ్వేల్‌కు తరలించుకుపోయిందెవరు? నిరుద్యోగుల నమ్మకాన్ని వమ్ముచేయకుండా ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చే బాధ్యతను మేం తీసుకుంటాం. మాట నిలబెట్టుకుంటామనే మాపై అక్కసుతో విమర్శలు చేస్తున్నారని కొండా సురేఖ అన్నారు. కవిత టీఎస్పీఎస్సీ పై మాట్లాడ్డం చూస్తుంటే దయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందని మంత్రి కొండా సురేఖ అన్నారు. పదేండ్లు పాలన చేసిన వాళ్లు రెండు నెలల పాలనపై విమర్శలు చేయడం సిగ్గుచేటని అన్నారు. బీఆర్ఎస్ హయాంలో వాళ్ళు ఏం చేశారని మంత్రి ప్రశ్నించారు. ఆంధ్ర వాళ్ళకు కాంట్రక్టులు ఇచ్చి పెంచి పోషించిందే కేసీఆర్ అని చెప్పారు. మహేందర్ రెడ్డి అవినీతి అధికారి అయితే బీఆర్ఎస్ ప్రభుత్వంలో డీజీపీగా ఎందుకు నియమించారని ప్రశ్నించారు. 'మహేందర్ రెడ్డి మీలాగా లిక్కర్ స్కామ్, పేపర్ లీక్ చేశారా' అని మంత్రి సురేఖ అన్నారు. సింగరేణిలో ఉద్యోగాలు ఇస్తే తప్పుపడుతు న్నారని బీఆర్ఎస్ దళారులు సింగరేణిలో ఉద్యోగాలు పొందారని ఆరోపించారు. బీఆర్ఎస్ హయాంలో ఉద్యోగాలు ఎందుకు ఇవ్వలేదని నిలదీశారు. తాము ఇస్తుంటే అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. సింగరేణి నిధులు, ఉద్యోగాలు ఎవరు తన్నుకుపోయారో అందరికి తెలుసని అన్నారు. నిరుద్యోగులకు ఏడాదిలో రెండు లక్షల ఉద్యోగాలు ఇచ్చే బాధ్యత తమదని మంత్రి సురేఖ అన్నారు. సింగరేణిలో డిప్యూటేషన్, బదిలీలకు లెటర్లు ఇచ్చి ఎంత దండుకున్నా రనేది లెక్కలు తీయాలా అని విమర్శించారు. పార్లమెంట్ ఎన్నికల కోసమే ఈ డ్రామాలని కవిత మాట్లాడే ముందు వెనకా ముందు చూసుకుని మాట్లాడనాలని సూచించారు. బీఆర్ఎస్ పార్టీ పార్లమెంట్ ఎన్నికల్లో ఒక్క సీటు కూడా గెలవదని జోస్యం చెప్పారు. మరో రెండు గ్యారంటీలు అమలు చేస్తామని కొండా సురేఖ తెలిపారు. ఇదిలావుంటే గవర్నర్ ప్రసంగం వినడానికి రాని కేసీఆర్ ప్రజలకు అవసరమా అని అధికార కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ప్రశ్నించారు. గవర్నర్ ప్రసంగం వినడానికి కేసీఆర్ అసెంబ్లీకి రావాలి కదా అని ఆయన అన్నారు. ఆస్తులను కూడబెట్టుకోవడం తప్ప కేసీఆర్ ప్రజలకు చేసిందేమి లేదని ఆయన ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ నేతలు అవాక్కులు చెవాకులు చేస్తున్నారని అన్నారు. రెండుసార్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ నేతలు మాట్లాడేది ఇదేనా అని రంగారెడ్డి ప్రశ్నించారు. తాము చెప్పిన ఆరు పథకాలను అమలు చేసి తీరుతామన్న రంగారెడ్డి బీఆర్ఎస్ పార్టీకి పుట్టగతులు ఉండవని హెచ్చరించారు. ప్రజలు మీకు బుద్ధి చెప్పిన మారడం లేదని, సీఎంపై విమర్శలు చేసే ముందు ఆలోచించాలని మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు.

# 13 వరకు అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు

- నేడు గవర్నర్ ప్రసంగంపై చర్చ
- 10న బడ్జెట్ ప్రవేశ పెట్టనున్న భట్టి
- బిఎసి సమావేశంలో నిర్ణయం
- సమావేశానికి హరీష్ రాకపై శ్రీదర్ బాబు అభ్యంతరం



హైదరాబాద్,ఫిబ్రవరి8 : తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ఫిబ్రవరి 13 వరకు నిర్వహించాలని బీఏసీ సమావేశం నిర్ణయి ంచింది. ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగించగా.. శుక్రవారం గవర్నర్ ప్రసంగంపై ధన్యవాద తీర్మానం ఉంటుంది. ఫిబ్ర వరి 10వ తేదీన రాష్ట్ర వార్షిక బడ్జెట్‌ను ఆర్థకమంత్రి హోదాలో డిప్యూటి సిఎం మల్లు భట్టి విక్రమార్క ప్రవేశపెడుతారు. కాంగ్రెస్ ప్రభు త్వం అధికారంలోకి వచ్చాక ఇవే తొలి బడ్జెట్ సమావేశాలు కాగా... పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ఇప్పుడు ప్రతిపక్ష స్థానంలో ఉండి సమావేశాల్లో పాల్గొంటోంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టడానికే మొగ్గు చూపుతున్నట్టు సమాచారం. అనంతరం బ్జడెట్‌పై సాధారణ చర్చ జరగనుంది. ఈ అసెంబ్లీ సమావేశాలు ఆసక్తిని సంతరించుకున్నాయి. పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపటానికి ప్రభుత్వం సిద్ధమవుతుండగా.. వాటిని సమర్థవంతంగా తిప్పికొట్టేందుకు బీఆర్ఎస్ సన్నద్ధమవుతోంది. అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగానికి దూరంగా ఉన్న కేసీఆర్.. ఫిబ్రవరి 10వ తేదీన అసెంబ్లీకి రానున్నారు. ఇదిలావుంటే బీఏసీలో మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్‌రావుకు చేదు అనుభవం ఎదురయ్యింది. స్పీకర్ గడ్డం ప్రసాద్ అధ్యక్షతన జరుగుతున్న బీఏసీ మీటింగ్‌కు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు బదులుగా హరీష్‌రావు హాజరయ్యారు. దీనిపై మంత్రి శ్రీధర్ బాబు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. బీఏసీలో మెంబర్ కాకుండా హరీష్ హాజరుకావడంపై అభ్యంతరం తెలిపారు. స్పీకర్ అనుమతితో కేసీఆర్ స్థానంలో హాజరైనట్లు హరీష్‌రావు చెప్పారు. అయినప్పటికీ అలా కుదరదని మంత్రి శ్రీధర్ బాబు తేల్చిచెప్పేశారు. దీంతో చేసేదేమీ లేక బీఏసీ సమావేశం మధ్యలో నుంచి హరీష్‌రావు బయటకు వచ్చేశారు. అయితే బిఆర్ఎస్ నుంచి అప్పటికే కడియం శ్రీహరి హాజరయ్యారు. కాగా.. స్పీకర్ గడ్డం ప్రసాద్ అధ్యక్షతన జరిగిన బీఏసీ సమావేశానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, శ్రీధర్ బాబు హాజరయ్యారు. అలాగే బీఆర్ఎస్ నుంచి కడియం శ్రీహరి, బీజేపీ నుంచి మహేశ్వర్ రెడ్డి, ఎంఐఎం నుంచి బలాల, సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివ రావు హాజరయ్యారు. అసెంబ్లీ పనిదినాలు, ఎజెండాపై బీఏసీలో చర్చించి నిర్ణయం తీసుకున్నారు.

# కాంగ్రెస్ ప్రచారంలా గవర్నర్ ప్రసంగం: మధుసూధనాచారి

హైదరాబాద్,ఫిబ్రవరి8 : ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ తమిళిసై ప్రసంగం కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారం లాగా ఉందని మాజీ అసెంబ్లీ స్పీకర్ సిరికొండ మధుసుదనాచారి ఆరోపించారు. గవర్నర్ ప్రసంగంలోతెలంగాణ రాష్ట్ర ఉద్యమం ప్రస్తావనే లేదన్నారు. కేఈఆర్ఎంబీ విషయంలో దక్షిణ తెలంగాణ ప్రజలు ఆందోళనలో ఉన్నారని పేర్కొన్నారు. కేఈఆర్ఎంబీ ప్రస్తావన గవర్నర్ ప్రసంగంలో లేకపోవడం విచారకరమన్నారు. అప్పులు తెచ్చి రాష్ట్రాన్ని అభివృద్ధిలోనే దేశంలో ఉన్నత స్థాయిలో కేసీఆర్ నిలిపారని పేర్కొన్నారు. అప్పులు తేకుండా మీరు అభివృద్ధి చేయగలరా? కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు అమలు జరిగే విధంగా రాజీ లేని పోరాటం చేస్తామని ఆయన స్పష్టం చేశారు.

# ఆటోలో అసెంబ్లీకి వచ్చిన పాడి కౌశిక్ రెడ్డి

హైదరాబాద్,ఫిబ్రవరి8 : తెలంగాణ అసెంబ్లీకి ఆటోలో వచ్చి ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి నిరసన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఆటో కార్మికుల సమస్యలను పరిష్కరించలేదని ఆరోపణలు చేశారు. ఆటో కార్మికులు ఆత్మహత్య చేసుకొని, ఆటోలు కాలబెట్టుకోవాల్సిన పరిస్థితి ఈ ప్రభుత్వం తీసుకొచ్చిందని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం ఆటో కార్మికులకు ఇస్తానన్న 12 వేల రూపాయల ఆర్థిక సాయం వెంటనే విడుదల చేయాలి డిమాండ్ చేశారు. వీధిన పడ్డ ఆటో కార్మికులను ఆదుకోవాలన్నారు.

# బస్సులో అసెంబ్లీకి వచ్చిన బల్మూరి వెంకట్

హైదరాబాద్,ఫిబ్రవరి8 : తెలంగాణ అసెంబ్లీ సమావేశాలకు ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ బస్సులో వచ్చారు.ఒక్కొక్కరుగా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలుఅసెంబ్లీకి చేరుకున్నారు. అయితే ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ మాత్రం వెరైటీకి అసెంబ్లీకి వచ్చారు. మొదటి రోజు అసెంబ్లీకి ఆర్టీసీ బస్‌లో ఎమ్మెల్సీ అసెంబ్లీకి వచ్చారు. గురువారం ఉదయం నాంపల్లిలో బస్ ఎక్కి అసెంబ్లీకి చేరుకున్నారు. బస్సు ప్రయాణంలో ఉచిత బస్‌కు సంబంధించి మహిళలతో ఎమ్మె ల్సీ బల్మూరి వెంకట్ మాట్లాడి.. వారి అభిప్రా యాలను తెలుసుకున్నారు. మహాలక్ష్మి పథకం తో మేలు జరిగిందని పలువురు మహిళలు తెలిపారు.

# కేఆర్ఎంబీకి ప్రాజెక్ట్‌లను అప్పగించింది కెసిఆరే

- సాగర్‌ను జగన్ ఆక్రమిస్తే మిన్నకున్నదీ ఆయనే
- విజయసాయి రెడ్డి వ్యాఖ్యలను సీరియస్‌గా తీసుకోం
- మీడియా చిట్‌చాట్‌లో సిఎం రేవంత్ రెడ్డి



హైదరాబాద్,ఫిబ్రవరి8 : కేఆర్ఎంబీకి ప్రాజెక్ట్‌లను అప్పగించింది గత బిఆర్ఎస్ ప్రభుత్వమేనని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. సాగర్‌ను జగన్ పోలీసులతో ఆక్రమించారని... అప్పుడు కేసీఆర్ ఎందుకు పట్టించుకోలేదని ప్రశ్నించారు. ప్రతిరోజు 12 టీఎంసీలను ఏపీ తీసుకుని వెళుతుంటే.. కేసీఆర్ ఎందుకు అడ్డుకోలేదన్నారు. ఇద్దరి మధ్యా ఏదో అవగాహన లేకుంటే ఇలా ఎందుకు జరుగుతుందని అన్నారు. అయితే ఇదే సందర్భంలో బీఆర్ఎస్ చీఫ్ కేసీఆర్‌ను కలుస్తానంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పడం తెలంగాణ రాజకీయాల్లో చర్చకు దారి తీసింది. గురువారం మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో ముఖ్యమంత్రి మాట్లాడుతూ... సీఎంగా నేను కేసీఆర్‌ను కూడా కలుస్తా అని అన్నారు. బేసిన్‌లు లేవు భేషజాలు లేవని కేసీఆర్.. ఆయన కమిట్‌మెంట్ చేసుకున్నారని ఆరోపించారు. కృష్ణా బేసిన్‌లో బీఆర్ఎస్‌ను ప్రజలు తిరస్కరించారని సీఎం అన్నారు. మరో మూడు నెలలో తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం కూలిపోతుందంటూ రాజ్యసభలో ఏపీ ఎంపీ విజయసాయిరెడ్డి చేసిన వ్యాఖ్యలకు సీఎం స్ట్రాం÷-రగ్ కౌంటర్ ఇచ్చారు. విజయ సాయి రెడ్డి .. నాన్ సీరియస్ పొలిటిషన్... అలాంటి వాళ్ళను పట్టించుకోవాల్సిన అవసరం లేదని అంటూ ముఖ్యమంత్రి కామెంట్స్ చేశారు. బీఆర్ఎస్ ఎల్పీ కార్యాలయం మార్పుపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించారు. ఎల్‌వోపీ మార్పు స్పీకర్ నిర్ణయం అని తెలిపారు. సభలో కులగణన తీర్మానం ఉంటుందన్నారు. అంశాలు చర్చించాల్సిన అవసరం అనుకుంటే సభను పొడిగించవచ్చని స్పీకర్ గడ్డం ప్రసాద్ చెప్పారని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు.

# ప్రతిపక్షనేతకు ఇచ్చే గౌరవం ఇదేనా

- ఇంత చిన్న గది ఎలా కేటాయిస్తారు
- స్పీకర్‌కు బిఆర్ఎస్ ఎమ్మెల్యేల ఫిర్యాదు
- ప్రభుత్వ తీరుపై మండిపడ్డ మాజీమంత్రి వేముల



హైదరాబాద్,ఫిబ్రవరి8 : అసెంబ్లీలో ఎల్‌వోపీ కార్యాలయం మార్పుపై బీఆర్ఎస్ నేతలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. అసెంబ్లీలో లీడర్ ఆఫ్ అపోజిషన్‌కు చిన్న ఛాంబర్ ఇవ్వడం ఏంటని ఆగ్రహం వ్యక్తం చేసారు. ఈ అంశంపై మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ.. ఈరోజు బీఆర్ఎస్ పార్టీకి చెందిన 39 ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కలిసి స్పీకర్‌ను కలిశామని.. అసెంబ్లీలో లీడర్ ఆఫ్ అపోజిషన్‌కు చిన్న ఛాంబర్ ఇవ్వడం అవమానించడమే అని అన్నారు. స్పీకర్ కావాలని అడగడంతో ఎల్‌వోపీ ఇచ్చాం. స్పీకర్ మీద గౌరవంతో ఇవ్వడం జరిగింది. మా ఎల్‌వోపీకి అంతే పెద్ద ఛాంబర్ ఇస్తామని హామీ ఇచ్చారు. కానీ చిన్న గదిని కేటాయించారు అది కరెక్ట్ కాదు. ఇప్పటి వరకు వాడుతున్న ఎల్‌వోపీ రూమ్‌ను మీ సౌకర్యం కోసం ఇవ్వడానికి ఒప్పుకున్నారు కేసీఆర్. కాంగ్రెస్ పార్టీ సభ్యులు ఐదుగురు ఉన్నప్పుడు కూడా మేము ఎల్‌వోపీ రూమ్ ఇచ్చాం. పెద్ద ఛాంబర్ కేటాయించాలని స్పీకర్‌ను కోరామని తెలిపారు. ఇకపోతే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు గెలిచిన దగ్గర ప్రోటోకాల్ ఉల్లంఘనలు జరుగుతున్నాయన్నారు. సంగారెడ్డి లో చింతా ప్రభాకర్ ఎమ్మెల్యే అనే విషయం మర్చిపోతున్నారన్నారు. సంగారెడ్డిలో ఓడిపోయిన ఎమ్మెల్యే భార్యకు ప్రోటోకాల్ ఇస్తున్నారని మండిపడ్డారు. స్థానిక ఆర్డీవో కూడా అలానే చేస్తున్నారన్నారు. దీంతో ఆర్డీవోపై పిర్యాదు చేశామని చెప్పారు. ఓడిపోయిన కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలకు పోలీస్ ఎస్కార్ట్ వెహికల్ ఇస్తున్నారన్నారు. దీనిపై డీజీపీ ఆలోచించాలని కోరారు. ప్రభుత్వాలు వస్తాయి పోతాయి, ముఖ్యమంత్రులు, వస్తారు పోతారని మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి వ్యాఖ్యలు చేశారు. సంగారెడ్డిలో ఎమ్మెల్యేగా గెలవని జగ్గారెడ్డి.. మా ఎమ్మెల్యేలనే తీసుకెళ్తారా? అని ప్రశ్నించారు. మా ఎమ్మెల్యేలను తీసుకెళ్లేంత మొగోళ్లు కాంగ్రెస్‌లో లేరు అని పేర్కొన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేయాలని అడిగితే ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చడానికి తమకేం అవసరం ఉందన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే అంతర్యుద్ధం తప్పదని హెచ్చరించారు. అలవిగానీ హామీలు ఇచ్చి తమపై నెపం నెడుతున్నారని ప్రశాంత్ రెడ్డి ధ్వజమెత్తారు.

# 75వేల మంది మహిళా డెవలపర్లకు నైపుణ్య శిక్షణ

### మైక్రోసాఫ్ట్ సిఇవో సత్య నాదెళ్ల ప్రకటన

బెంగళూరు,ఫిబ్రవరి8 : ఈ ఏడాది చివరికి భారత్‌లో 75వేల మంది మహిళా డెవలపర్లకు నైపుణ్యాల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు మైక్రోసాఫ్ట్ సిఇవో సత్య నాదెళ్ల ప్రకటించారు. భారత పర్యటనలో ఉన్న ఆయన గురువారం బెంగళూరులోని 'మైక్రోసాఫ్ట్ ఏఐ టూర్' నిర్వహించిన డెవలపర్ల సమావేశంలో పాల్గొన్నారు. కృత్రిమ మేధ ఆవిష్కరణను మరింత వేగవంతం చేయడంలో భారత డెవలపర్ల పాత్ర కీలకమని ఆయన తెలిపారు. ఈసందర్భంగా మైక్రోసాఫ్ట్ నిర్వహిస్తున్న 'కోడ్ విత్‌అవుట్ బ్యారియర్స్' ప్రోగ్రామ్ గురించి నాదెళ్ల కీలక ప్రకటన చేశారు. ఈ ప్రోగ్రామ్‌ను భారత్‌లోనూ చేపట్టాలని నిర్ణయించాం. దీనిద్వారా 2024 చివరికి 75వేల మంది మహిళా డెవలపర్లకు నైపుణ్యాల శిక్షణ ఇవ్వనున్నాం. ఈనెల నుంచే దీన్ని ఆరంభించనున్నాం. దీంతో మహిళా డెవలపర్లు, కోడర్లు, టెక్నికల్ రోల్స్‌లో పనిచేసే యువతులకు మరిన్ని నెట్‌వర్కింగ్ అవకాశాలు లభిస్తాయని ఆయన వెల్లడించారు.

## (మొదటిపేజీ తరువాయి)

# హైదరాబాద్‌లో ఎన్ఐఎ సోదాలు

మావోయిస్టు సెంట్రల్ కమిటీ సభ్యుడు దీపక్‌ను కూకట్‌పలల్లిలో పోలీసులు అరెస్ట్ చేశారు. అతని వద్ద దొరికిన సమాచారం ఆధారంగా వేణు నివాసంలో సోదాలు చేసినట్లు సమాచారం. గతంలోనూ వీరి ఇళ్లల్లో ఎన్ఐఏ అధికారులు దాడులు నిర్వహించారు. పత్రికా ప్రకటన ద్వారా పూర్తి వివరాలు వెల్లడిస్తామని ఎన్ఐఏ అధికారులు తెలిపారు. మరోవైపు, గురువారం ఉదయం 5 గంటలకు ఎన్ఐఏ అధికారులు తమ ఇంటికి వచ్చారని జర్నలిస్ట్ వేణు తెలిపారు. సెర్చ్ వారెంట్‌తో వచ్చామని వారు చెప్పినట్లు వివరించారు. 2013లో నయీమ్ బెదిరింపుల లేఖ పుస్తకాలు రాశానని.. ఆ పుస్తకాలను తీసుకెళ్లారని చెప్పారు. తన మొబైల్ సీజ్ చేశారని అన్నారు. ఎన్ఐఏ గతంలో అరెస్ట్ చేసిన మావోయిస్టు సెంట్రల్ కమిటీ సభ్యుడు దీప్ కు, తనకు సంబంధం ఉందని కూకట్‌పల్లి పోలీసులు కేసు నమోదు చేశారని తెలిపారు. ఈ కేసుపై గత ప్రభుత్వంలోని సీఎంకు లేఖ రాశానని పేర్కొన్నారు. తాను రాసిన ఉత్తరం పత్రికల్లో ప్రచారం అయ్యిందని వెల్లడించారు. దేశంలో ఎన్ఐఏ ఉపా చట్టం ద్వారా పెట్టిన కేసులను ఎత్తివేయాలని కోరామని, జనవరి 3న తనపై పెట్టిన కేసును ఎన్ఐఏ టేకప్ చేసుకుందని వివరించారు. ఈ కేసులో తన పేరును ఏ - 22గా చేర్చారని.. తాను ఓ మాస పత్రికను నడుపుతున్నానని చెప్పారు. తాను 'విరసం'లో ప్రస్తుతం లేనని స్పష్టం చేశారు.

# ఉభయసభలు నేటికి వాయిదా

జరుగుతుంది. శాసనసభ కార్యకలాపాల సలహాకమిటీ బీఏసీ సమావేశమై సభను ఎన్ని రోజులు నడపాలనే దానిపై నిర్ణయం తీసుకుంటుంది.. ఆర్థిక శాఖను నిర్వహించే ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఫిబ్రవరి 10న బడ్జెట్‌ను ప్రవేశపెడతారు. అనంతరం బడ్జెట్‌పై సాధారణ చర్చ జరగనుంది. సమావేశాలు సుమారు 7-10 రోజుల వరకు నిర్వహించాలని ప్రభుత్వం యోచిస్తున్నట్లు తెలిసింది. బడ్జెట్‌కు ఆమోదం తరవాత వాయిదా పడుతుంది. ఇకపోతే ఆనవాయితీ ప్రకారం కాంగ్రెస్ సభ్యులు సిఎం రేవంత్ సహా అంతా కండువాలు కప్పుకుని వచ్చారు. బిఆర్ఎస్ సభ్యులు గులాబీ కండువాలతో వచ్చారు.

# చంద్రబాబు సలహా మేరకు రేవంత్ నిర్ణయాలు

దుర్భాషలాడారని గుర్తుచేశారు. టీఎస్‌పీఎస్సీలో ఆంధ్రా వ్యక్తిని సభ్యుడిగా నియమించారని ఆరోపించారు. రాజకీయ నేపథ్యం ఉన్న పాల్వాయి రజనిని మెంబర్‌గా ఎలా నియమిస్తారన్నారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్ సభ్యుడిగా ఆంధ్రా వ్యక్తిని ఎలా నియమించారని ప్రశ్నించారు. వాళ్లు తెలంగాణ యువతకు ఏం న్యాయం చేస్తారని అడిగారు. రాజకీయాలకు సంబంధమున్న వారిని కమిషన్ సభ్యులుగా నియమించ బోమని సీఎం అన్నారన్నారు. విద్యుత్తు సంస్థలో ఆంధ్రా అధికారుల పెత్తనమేంటని అంటూ..ముగ్గురు ఆంధ్రా అధికారులను డైరెక్టర్లుగా నియమించారని, వారు తెలంగాణ ప్రయోజనాలు ఎందుకు కాపాడుతారని ప్రశ్నల వర్షం కురిపించారు. ఓటుకు నోటు కేసును వాదించిన న్యాయవాదులను సీఎం అందలమెక్కించారన్నారు. సింగరేణి ఉద్యోగాల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం అబద్ధాలు చెబుతోందని మండిపడ్డారు. డిసెంబరు లోగా 2 లక్షల ఉద్యోగాలిస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం 60 ఉద్యోగాలనే నోటిఫై చేసిందని కవిత పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా కాంగ్రెస్ అబద్ధాలను వదలడం లేదని ఎమ్మెల్సీ కవిత విమర్శించారు. రాష్ట్ర గీతం గురించి సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని అన్నారు. సీఎం రేవంత్ ఒక్కసారి కూడా చెయ్యెత్తి జై తెలంగాణ అనలేదని విమర్శించారు. సింగరేణి ఉద్యోగ మేళా సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వ్యాఖ్యల నేపథ్యంలో హైదరాబాద్‌లోని తన నివాసంలో ఎమ్మెల్సీ కవిత మీడియాతో మాట్లాడారు. తెలంగాణ తల్లి విగ్రహం తనలా ఉందని సీఎం అంటున్నారని, తానూ తెలంగాణ ఆడబిడ్డనే కదా అని ప్రశ్నించారు. అయినా తెలంగాణ తల్లి విగ్రహం గురించి ముఖ్యమంత్రి మాట్లాడటం ఏంటన్నారు. రాష్ట్రంలో కరెంటు కోతలు మొదలయ్యాయని చెప్పారు. చంద్రబాబు డైరక్షన్‌లో తెలంగాణ ప్రభుత్వం నడుస్తున్నట్లుందని ఆరోపించారు. అర్హత లేని వ్యక్తులను సలహాదారులుగా నియమించారని చెప్పారు. తెలంగాణ అసెంబ్లీకి ఏపీ అడ్వైజర్ ఎందుకని ప్రశ్నించారు. సింగరేణిలో డిపెండెంట్ ఉద్యోగాలు పోగొట్టిందే కాంగ్రెస్ అని ఆరోపించారు. బీఆర్ఎస్ హయాంలో 20 వేల డిపెండెంట్ ఉద్యోగాలిచ్చామని చెప్పారు. జీఎం స్థాయిలో చేయాల్సిన పనిని సీఎం చేస్తున్నారని విమర్శించారు. కొత్తగా 400 ఉద్యోగాలు ఇచ్చినట్లు అబద్ధాలు చెబుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. కేసీఆర్ హయాంలో ఇచ్చిన ఉద్యోగాలను తాము ఇచ్చినట్లు చెప్పుకుంటున్నారని వెల్లడించారు.

# మోడీ బిసి కాదు..ఓసికి చెందిన వ్యక్తి

**అందుకే కులగణను వ్యతిరేకిస్తున్నారు**

**కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపణ**

**తిప్పికొట్టిన కేంద్ర ప్రభుత్వం**



న్యూఢిల్లీ,ఫిబ్రవరి8: ప్రధాని మోదీ ఓబిసికి చెందిన వ్యక్తి కాదని మోడీని ఉద్దేశించి కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ వ్యాఖ్యానిం చారు. అయితే రాహుల్ చేసిన వ్యాఖ్యల ను కేందప్రభుత్వం తోసిపుచ్చింది. 'రాహు ల్ ప్రకటనపై వాస్తవాలు' అంటూ మోదీ జన్మించిన కులం గురించి స్పష్టత ఇచ్చింది. ప్రధాని మోదీ ఘాంచీ కులానికి చెందిన కుటుంబంలో జన్మించారని, 2000 సంవత్సరంలో గుజరాత్‌లో అధికారంలో ఉన్న భాజపా ఆ కులాన్ని ఓబీసీ విభాగంలో చేర్చిందని వివరించారు. గుజరాత్‌లో ఒక సర్వే అనంతరం మండల్ కమిషన్ కింద ఓబీసీ జాబితాను తయారుచేసింది. అందులో ఘాంచీ కులం పేరు కూడా ఉంది. దీనిని ఓబీసీ జాబితాలో చేర్చేందుకు జులై 25, 1994లో నోటిఫికేషన్ ఇచ్చారు. అప్పుడు మోదీ స్వరాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంది. ఆ తర్వాత ఏప్రిల్ 4, 2000లో కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్ ఆధారంగా దానిని ఓబీసీ జాబితాలోకి చేర్చారు. ఈ రెండు ప్రకటనలు ఇచ్చిన సమయంలో మోదీ అధికారంలో లేరు' అని కేంద్రం వెల్లడించింది. ఎన్నికల సమయంలో మాత్రమే మోదీకి తాను ఓబీసీననే విషయం గుర్తుకువస్తుందని కొద్దిరోజుల క్రితం రాహుల్ విమర్శించిన సంగతి తెలిసిందే. లేకపోతే కులగణన కోరిన ప్రతిసారీ దేశంలో ఉన్నది ధనిక, పేద అనే రెండు కులాలు మాత్రమే అని చెప్తారన్నారు. రాహుల్ వ్యాఖ్యలను ఉద్దేశించి బుధవారం పార్లమెంట్‌లో మోదీ స్పందించారు. 'దళితులు, ఆదివాసీలు, వెనకబడిన వర్గాల వారికి కాంగ్రెస్ వ్యతిరేకంగా పనిచేసింది. మాజీ ప్రధాని నెహ్రూను వారు గుడ్డిగా అనుసరిస్తున్నారు. రిజర్వేషన్లను ఆయన గట్టిగా వ్యతిరేకించారు. మా హయాంలో ఎస్సీ, ఎస్టీలకు అన్ని పదవుల్లో విశేష ప్రాధాన్యం ఇచ్చాం' అని వెల్లడించారు. అయితే మోడీ తన కులం విషయంలో ప్రజలను తప్పుదోవ పట్టించారని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. ఒడిశాలోని ఝూర్సుగూడలో భారత్ జోడో న్యాయ్ యాత్రలో ఆయన మాట్లాడుతూ.. మోదీ ఓబీసీ కులానికి చెందిన వ్యక్తి కాదని.. జనరల్ కేటగిరీకి చెందిన వారని ఆరోపించారు. ఆయన తన కులం గురించి అబద్ధాలు చెబుతూ ప్రజలను తప్పుదోవ పట్టించారని విమర్శించారు. 'మోదీ ఓబీసీ కాదు. గుజరాత్‌లోని తెలీ కులంలో జన్మించారు. 2000 సంవత్సరంలో ఆయన కులాన్ని ఓబీసీల్లోకి మార్చారు. అగ్రవర్ణ కులాల్లో జన్మించినందుకే ఆయన కులగణనకు వెనకాడుతున్నారు' అని రాహుల్ అన్నారు. ఆయన చేపట్టిన న్యాయ్ యాత్ర గురువారం ఒడిశా నుంచి ఛత్తీస్‌గఢ్‌లోకి ప్రవేశించనుంది. కాంగ్రెస్ పార్టీ నవంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఛత్తీస్ గఢ్‌లో అధికారం కోల్పోయింది. ఆ తరువాత రాష్ట్రంలో రాహుల్ తొలిసారి పర్యటిస్తున్నారు. జనవరి 14న మణిపుర్ నుంచి ప్రారంభమైన ఈ యాత్ర ఫిబ్రవరి 11న రాయ్‌గఢ్, శక్తి, కోర్బా జిల్లాల మీదుగా సాగనుంది. ఫిబ్రవరి 14న బలరాంపూర్ నుంచి జార్ఖండ్‌లో రాహుల్ అడుగుపెట్టనున్నారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ఆయన ఈ యాత్ర చేపట్టారు.

# వీధికుక్కల దాడిలో వృద్ధురాలు మృతి

కామారెడ్డి,ఫిబ్రవరి8 : వీధి కుక్కలు దాడి చేయడంతో తీవ్రంగా గాయపడిన ఓ వృద్ధురాలు దుర్మరణం చెందింది. ఈ విషాదకర సంఘటన కామారెడ్డి జిల్లా మాచారెడ్డి మండలం లచ్చపేట గ్రామంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన ముస్తాబాద్ రామవ్వ (75) బుధవారం రాత్రి తన ఇంటి ముందు కూర్చుని ఉంది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేరు. అయితే ఒక్కసారిగా ఆమెపైకి దూసుకొచ్చిన వీధికుక్కల గుంపు దాడి చేసింది. గమనించిన స్థానికులు కుక్కలను తరిమికొట్టారు. తీవ్రంగా గాయపడిన రామవ్వను తొలుత కామారెడ్డి ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మెరుగైన చికిత్స కోసం నిజామాబాద్‌కు తీసుకెళ్తుండగా పరిస్థితి విషమించి ఆమె మార్గమధ్యలోనే మృతి చెందారు.

# హామీల అమలుపై ప్రస్తావన ఏదీ

- స్పష్టత లేకుండా గవర్నర్ ప్రసంగం
- పంటలకు బోనస్,రుణమాఫీపై దాటవేత
- మీడియా పాయింట్ వద్ద హరీష్ రావు



హైదరాబాద్,ఫిబ్రవరి8 : హామీల అమలుకోసం ఎదురు చూస్తున్న ప్రజలకు గవర్నర్ ప్రసంగం నిరాశ మిగిల్చిందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. ఎన్నికల హామీల అమలుపై స్పష్టత లేదని విమర్శించారు. గవర్నర్ ప్రసంగం రాష్ట్ర ప్రజలకు భవిష్యత్తుపై విశ్వాసం కల్పించలేకపోయిందన్నారు. ఎమ్మెల్యేలు కౌశిక్ రెడ్డి, కొత్త ప్రభాకర్ రెడ్డి, సునీతా లక్ష్మారెడ్డితో కలిసి అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మాట్లాడారు. మహాలక్ష్మి పథకం కింద మహిళలకు రూ.2500 ఎప్పటి నుంచి ఇస్తారో గవర్నర్ ప్రసంగంలో చెప్పలేదన్నారు. రైతులకు బోనస్ ఇచ్చే విషయమై ఒక్క మాటా లేదన్నారు. గ్రామాలు, పట్టణాల అభివృద్ధిపై ఒక్క మాట కూడా చెప్పలేదన్నారు. నిరుద్యోగులకు రూ.4 వేలు ఇచ్చే విషయాన్నీ ప్రస్తావించ లేదన్నారు. గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల విద్యుత్ గురించి మాత్రమే చెప్పారు. మేనిఫెస్టో అంశాల గురించి ఎక్కడా చెప్పలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీ, గవర్నర్ ప్రతిష్ఠ దిగజార్చిందన్నారు.ప్రజావాణి తుస్సుమన్నదని విమర్శించారు. ప్రజావాణిలో రోజూ సీఎం స్వయంగా ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తా మన్నారు. మొదటి రోజు తరువాత సీఎం మొహం చాటేశారని విమర్శించారు. ప్రజావాణికి రోజుకొక మంత్రి వెళ్తార న్నారు.. అదీ లేకుండా పోయిందన్నారు. ఇప్పుడు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు దరఖాస్తులు తీసుకుంటున్నారని చెప్పారు. బీఆర్ఎస్ పాలనలో కలెక్టర్లు దరఖాస్తులు తీసుకునేవారని వెల్లడించారు. ప్రజావాణి గురించి గర్నవర్‌తో అర్ధసత్యాలు చెప్పించారన్నారు. ఆరు గ్యారంటీల్లో 13 హామీలున్నాయని చెప్పారు. మహాలక్ష్మి పథకంలో మూడు చెప్పి ఒక గ్యారంటీ అమలు చేశామని చెబుతారా అని ప్రశ్నించారు. ఆరోగ్య శ్రీ అమలు లోపభూయిష్టంగా ఉన్నందునే గవర్నర్ ప్రసంగంలో చెప్పించలేదన్నారు. నిర్దిష్ట సమయంలో ఆరు గ్యారంటీలు అమలు చేస్తామన్నారు. రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేసిందన్నారు. రైతులకు ఇచ్చిన నాలుగు హామీలు అమలు చేయడం లేదని చెప్పారు. డిసెంబర్ 9న అధికారంలోకి వస్తాం, రూ.2 లక్షలు రుణమాఫీ చేస్తామన్నారు. అయితే ప్రమా ణ స్వీకారాన్ని ముందుకు జరిపి.. హామీల అమలును వాయిదా వేశారని విమర్శించారు. ఇచ్చిన హామీలను ఎందుకు నిలబెట్టుకోవడం లేదని ప్రశ్నించారు. వంద రోజుల్లో 60 రోజులు పూర్తయ్యాయి, ఇంకా 40 రోజులే ఉన్నాయని గుర్తుచేశారు. మరో పది రోజుల్లో ఎన్నికల కోడ్ వస్తుంది.. అప్పటివరకు సాగదీసి హామీల అమలు వాయిదా వేయాలని ప్రభుత్వం చూస్తున్నదని విమర్శించారు. ఎన్నికల కోడ్ వస్తే హామీలు ఎలా అమలు చేస్తారని నిలదీశారు. చిత్తశుద్ధి ఉంటే హామీల అమలు గురించి గవర్నర్ ప్రసంగంలో ఉండేదన్నారు. రూ.500కే గ్యాస్, 200 యూనిట్ల వరకు కరెంట్ గురించి మాత్రమే ప్రస్తావించారని, మిగతా హామీలు వచ్చే ఏడాదిలో చేయలేమని అని చెప్పకనే చెప్పారని వెల్లడించారు. వంద రోజుల్లో అమలు చేయలేమని చేతులెత్తేశారని విమర్శించారు. రూ.15 వేల రైతుభరోసా ఇస్తామన్నారు, 10 వేల రైతుబంధు కూడా ఇవ్వలేదని చెప్పారు. రాష్ట్రంలో రైతులు కరెంట్ కోతలు ఎదుర్కొంటున్నారని చెప్పారు. వచ్చే యాసంగి పంటకు అయినా బోనస్ ఇస్తామని చెబుతారని ఎదురు చూశాం.. కానీ నిరాశ ఎదురైందన్నారు. రూ. 40 వేల కోట్ల పెట్టుబడిపై వైట్ పేపర్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. యాదాద్రి పవర్ ఎలాంట్ ఊసేలేదని విమర్శించారు. మూసీ నది ప్రక్షాళన బీఆర్ఎస్ ప్రభుత్వమే ప్రారంభించిందని చెప్పారు. ఉద్యోగులకు ఒకటో తేదీన జీతం ఇస్తారన్నారు.. కానీ 7వ తేదీ వచ్చినా జీతాలు పడలేదన్నారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల పరిస్థితి దారుణం. రెండు, మూడు నెలల నుంచి వారికి జీతాలు లేవన్నారు.

# ఆరుగ్యారెంటీల అమలుకు కట్టుబడి ఉన్నాం

(మొదటిపేజీ తరువాయి)

దీంతో ప్రజలు తమ సమస్యలు చెప్పుకునే అవకాశం వచ్చిందన్నారు. ప్రస్తుతం తెలంగాణలో ప్రజల కొరకు ప్రజల చేత ఎన్నికైన ప్రభుత్వం ఉందని గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ తెలిపారు. తెలంగాణ ప్రజలు ప్రజాస్వామ్యం కోసం పోరాటం చేశారని ప్రశంసించారు. యువకుల బలిదానాలతోనే తెలంగాణ ఏర్పాటైందని గుర్తు చేశారు. ప్రజాకాంక్షలు నెరవేరేలా ఈ ప్రభుత్వం పాలన సాగిస్తుందన్నారు. ప్రజాభవన్‌లో ఫిర్యాదులు స్వీకరించేందుకు ప్రజలకు అనుమతి లభించిందని, తెలంగాణ ఏర్పాటులో కలిసి వచ్చిన పార్టీలు, వ్యక్తులకు తెలంగాణ ప్రభుత్వం కృతజ్ఞతలు తెలుపుతోందని గవర్నర్ పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను సకాలంలో అమలు చేస్తామని, ఇప్పటికే రెండు గ్యారంటీలను ప్రభుత్వం అమలు చేసిందని తెలిపారు. ఉచిత ప్రయాణం ద్వారా ఇప్పటివరకు 15 కోట్ల మంది మహిళలు ప్రయాణించారన్నారు. పాలమూరు రంగారెడ్డి వంటి సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేస్తామని, టిఎస్‌పిఎస్‌సి ద్వారా రెండు లక్షల ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. రేవంత్ ప్రభుత్వం కొత్త ఎంఎస్ఎంఇ విధానం ప్రకటించిందని, దావోస్ సమావేశంలో రూ.40 వేల పెట్టుబడులకు ఒప్పందాలు జరిగాయని వెల్లడించారు. తెలంగాణ ఇచ్చిన అప్పటి మన్మోహన్ సింగ్ సర్కారుకు ప్రభుత్వం కృతజ్ఞతలు తెలుపుతోందని, ప్రత్యేకించి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో కాంగ్రెస్ అగ్రనేత, యుపిఎ వైఎస్ చైర్మన్ సోనియాగాంధీ పోషించిన చారిత్రక పాత్రను ప్రభుత్వం స్మరించుకుంటోందన్నారు. ప్రజాపాలనలో 1.2 కోట్ల దరఖాస్తులు ప్రజల నుంచి స్వీకరించామని తమిళి సై వివరించారు. మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించామన్నారు. అర్హులైన వారికి రూ.500 లకే గ్యాస్ సిలిండర్ అందజేయనున్నట్లు తెలిపారు. కచ్చితంగా ఆరు గ్యారెంటీలను అమలు చేసి తీరతామని స్పష్టం చేశారు. ధనిక రాష్ట్రంలో ఆర్థిక వ్యవస్థ అస్తవ్యస్థమైందని... దాన్ని చక్కదిద్దే ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు పూర్తిచేస్తామన్నారు. యువతకు 2 లక్షల ఉద్యోగుల కల్పనపై దృష్టిపెట్టామన్నారు. ప్రజావాణిలో 1.8కోట్ల దరఖాస్తులు వచ్చాయన్నారు. రైతులు, యువత, మహిళలకు ఇచ్చిన హామీలు అమలు చేస్తామని చెప్పుకొచ్చారు. మౌలిక వసతులరంగాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. ప్రజలపై పన్నుల భారం పడకుండా చూస్తామన్నారు. గత సమావేశాల్లో ఆర్థిక పరిస్థితులపై శ్వేతపత్రం విడుదల చేశామన్నారు. ప్రతి ఇంటికి ఇంటర్నెట్ అందిస్తామని గవర్నర్ తమిళిసై వెల్లడించారు. వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా కొత్త పారిశ్రామిక విధానం, మౌలిక వసతుల రంగాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. అలాగే చిన్న పరిశ్రమల అభివృద్ధి కోసం కొత్త విధానాన్ని కూడా అమలులోకి తీసుకొస్తామన్నారు. ధరణి కమిటీ ద్వారా భూ సమస్యలు పరిష్కరిస్తాం. మా ప్రభుత్వం ఆర్థిక క్రమశిక్షణ, పారదర్శకతను పాటిస్తుంది. గత ప్రభుత్వం నిర్వాకాలను శ్వేతపత్రం ద్వారా ప్రజలకు తెలియజేశాం. రాష్ట్రంలో ప్రత్యేక నైపుణ్య వర్సిటీలు ఏర్పాటు చేస్తాం. విద్యతో పాటు ఉద్యోగమూ సాధించేలా యువతలో నైపుణ్యాలు పెంపునకు కృషి చేస్తాం. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళ, వికలాంగ పారిశ్రామిక వేత్తలకు తోడ్పాటు అందిస్తాం. 10 నుంచి 12 ఫార్మా విలేజ్ క్లస్టర్ల ఏర్పాటుకు ప్రభుత్వం ప్రతిపాదిస్తోంది. సమగ్ర డిజిటల్ అక్షరాస్యత కార్యక్రమాన్ని ప్రభుత్వం అమలు చేస్తుంది. హైదరాబాద్‌ను దేశంలోనే కృత్రిమ మేధ (ఏఐ) ప్రధాన కేంద్రంగా అభివృద్ధి చేస్తాం. 50 నుంచి 100 ఎకరాల్లో ఏఐ సిటీ ఏర్పాటు చేస్తాం. రూ.2 వేల కోట్లతో ప్రభుత్వ ఐటీఐలను ఆధునిక టెక్నాలజీ సెంటర్లుగా మారుస్తాం. క్రీడారంగంలో రాష్ట్రాన్ని అగ్రగామిగా చేయడమే మా లక్ష్యం. కులగణన చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. బడ్జెట్ కేవలం ఆర్థిక పత్రం కాదు.. భవిష్యత్‌కు నమూనా అని చెప్పారు.గవర్నర్ ప్రసంగం అనంతరం శాసన సభ, శాసన మండలి సమావేశాలు నేటికి వాయిదా పడ్డాయి. అంతకుముందు గవర్నర్ తమిళసై అసెంబ్లీకి రాగానే సిఎం రేవంత్ రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాదరావు, మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసనసభా వ్యవహారాల మంత్రి శ్రీధర్ బాబులు వెళ్ళి స్వాగతం పలికి తోడ్కొని వచ్చారు.

# ఆర్‌బిఐ కీలక వడ్డీరేట్లు యథాతథం

సమర్పించిన తర్వాత ఆర్బీఐ నిర్వహించిన తొలి ద్వైమాసిక విధాన సమావేశం ఇదే కావడం గమనార్హం. డిసెంబరులో వినియోగదారుల ధరల సూచీ ద్రవ్యోల్బణం లేదా రిటైల్ ద్రవ్యోల్బణం 4 నెలల గరిష్ఠ స్థాయి 5.69 శాతంగా నమోదయ్యింది. పప్పులు, సుగంధ ద్రవ్యాలు, పండ్లు, కూరగాయలతో సహా వివిధ ఆహార పదార్థాల ధరలు పెరుగుదల ఇందుకు ప్రధాన కారణమయ్యింది.

బ్యాంక్ నుంచి గృహరుణం సహా వివిధ రకాల లోన్‌లు తీసుకుని నెలనెలా ఇఎంఐ కడుతున్న రుణగ్రస్తులకు, కొత్తగా లోన్‌లు తీసుకోవాలని భావిస్తున్న వారి ఆశలపై ఆర్‌బీఐ నీళ్లు చల్లింది. గరిష్ఠ స్థాయిలో ఉన్న వడ్డీ రేట్లు దిగి వస్తాయోమే, ఇఎంఐ మొత్తం తగ్గుతుందేమోనని ఆశగా ఎదురు చూసిన ప్రజానీకానికి ఈసారి కూడా నిరాశ తప్పలేదు. అంతర్జాతీయంగా చూస్తే, వివిధ దేశాల సెంట్రల్ బ్యాంక్‌లు కూడా వడ్డీ రేట్లలో ఎలాంటి మార్పులు చేయకుండా, పాత రేట్లనే కొనసాగిస్తున్నాయి. అమెరికా సెంట్రల్ బ్యాంక్ యూఎస్ ఫెడ్, యూరోపియన్ సెంట్రల్ బ్యాంక్ వంటి కీలక బ్యాంక్‌లు కీలక రేట్ల మీద 'స్టేటస్ కో' కొనసాగిస్తు న్నాయి. ఆ ప్రభావం ఆర్‌బీఐ మీద కనిపించింది. ఈ నెల 6న ప్రారంభమైన ఆరుగురు సభ్యుల మానిటరీ పాలసీ కమిటీ మీటింగ్, ఈ రోజు ముగిసింది. పారిశ్రామిక రంగానికి సంబంధించి గ్రామీణ డిమాండ్‌లో మెరుగుపడుతోందని, పట్టణాల్లో బలంగా ఉందని దాస్ చెప్పారు. తయారీ రంగంలో మంచి గణాంకాలు కనిపిస్తున్నాయని వివరించారు. దేశంలో ఆర్థిక కార్యకలాపాలు బలంగా కొనసాగున్నాయని, వృద్ధి రేటు అంచనాలను మించి నమోదవుతోందని శక్తికాంత దాస్ చెప్పారు. ఇదే ఒరవడి 2024-25 ఆర్థిక సంవత్సరంలోనూ కొనసాగుతుందని అన్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరం 2024-25లో వృద్ధిరేటు 7 శాతంగా ఉండొచ్చని ఆర్‌బీఐ గవర్నర్ అంచనా వేశారు. ద్రవ్యోల్బణం గురించి కూడా ఆర్‌బీఐ గవర్నర్ మాట్లాడారు. దేశంలో ఆహార పదార్థాల ధరల్లో తీవ్రమైన మార్పులు ఉన్నాయని చెప్పిన దాస్, ధరల్లో ఒడుదొడుకులు కోర్ ఇన్‌ఫ్లేషన్ మీద ప్రభావం చూపుతున్నాయని వివరించారు. దేశంలో చిల్లర ద్రవ్యోల్బణాన్ని 4 శాతం లోపునకు తీసుకురావాలన్న లక్ష్యానికి ఆర్‌బీఐ కట్టుబడి ఉన్నట్లు స్పష్టం చేశారు. దీనిని ఈ ఏడాది మరింత తగ్గించడంపై దృష్టి సారిస్తామన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2023-24లో, రిటైల్ ద్రవ్యోల్బణం రేటును 5.4 శాతంగా ఆర్‌బీఐ అంచనా వేసింది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి ఇది 4.5 శాతానికి తగ్గుతుందని కేంద్ర బ్యాంక్ లెక్కగట్టింది. దేశంలో జరుగుతున్న మొత్తం చెల్లింపుల్లో డిజిటల్ చెల్లింపుల వాటా క్రమంగా పెరుగుతోంది. ఈ నేపథ్యంలో, డిజిటల్ చెల్లింపుల భద్రతను మరింత పెంచడానికి ఒక ఫ్రేమ్‌వర్క్‌ను తీసుకురావాలని యోచిస్తున్నట్లు దాస్ చెప్పారు. రిటైల్ సెంట్రల్ బ్యాంక్ డిజిటల్ కరెన్సీ ఆఫ్‌లైన్‌లోనూ పని చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఆహార ధరలపై ఒత్తిళ్లను ద్రవ్య పరపతి విధాన కమిటీ ఎప్పటికప్పుడు క్షుణ్ణంగా పర్యవేక్షిస్తుందని చెప్పారు. దేశ ఆర్థిక కార్యకలాపాల్లోని జోరు 2024-25 ఆర్థిక సంవత్సరంలోనూ కొనసాగుతుంది.పట్టణాల్లో వినిమయం బలంగా ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో గిరాకీ పుంజుకుంటోంది. 2024-25కు జీడీపీ వృద్ధిరేటు 7 శాతంగా అంచనా. భారత విదేశీ మారక నిల్వలు 622.5 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. ఇకపై అన్ని రిటైల్, ఎంఎస్ఎంఈ రుణాలకు 'కీ ఫ్యాక్ట్ స్టేట్‌మెంట్' తప్పనిసరి. దీన్ని అమలు చేసేందుకు బ్యాంకులకు కొంత గడువు ఇవ్వనున్నారు. డిజిటల్ చెల్లింపుల భద్రతను మరింత పెంపొందించడానికి, అటువంటి లావాదేవీల ప్రామాణీకరణ కోసం ఒక ఫ్రేమ్‌వర్క్‌ను తీసుకురావాలని ప్రతిపాదన ఉంది. ఆఫ్‌లైన్‌లోనూ రిటైల్ సెంట్రల్ బ్యాంక్ డిజిటల్ కరెన్సీ పనిచేసేలా చర్యలు తీసుకోనున్నారు.

# మయన్మార్‌తో రాకపోకలపై ఆంక్షలు

- స్వేచ్ఛయుత రాకపోకల నిషేధం
- దేశ భద్రత దృష్ట్యా కేంద్రం కీలక నిర్ణయం

న్యూఢిల్లీ,ఫిబ్రవరి8 : పొరుగుదేశం మయన్మార్‌తో ఇక స్వేచ్ఛగా రాకపోకలు సాగబోవని కేంద్రహోంమంత్రి అమిత్ షా ప్రకటించారు. దేశ భద్రత, ఈశాన్య రాష్ట్రాల్లో జనాభా అంశం తదితర కారణాల దృష్ట్యా భారత్, మయన్మార్ మధ్య 'స్వేచ్ఛాయుత రాకపోకల విధానాన్ని' రద్దు చేయాలని హోంశాఖ నిర్ణయించింది. ఈ దిశగా చర్యలు మొదలు పెట్టాం. అందువల్ల తక్షణమే ఈ ఎఫ్ఎంఆర్‌ను నిలిపివేస్తున్నామని అమిత్ షా స్పష్టం చేశారు.మయన్మార్‌లో కల్లోల పరిస్థితులు నెలకొనడంతో అక్కడి నుంచి కొందరు సైనికులు సరిహద్దులను దాటి భారత్‌లోకి ప్రవేశించడం ఇటీవల కలకలం సృష్టించింది. దీంతో అప్రమత్తమైన కేంద్రం సరిహద్దు వెంబడి కంచె నిర్మాణం చేపట్టింది. ఈ క్రమంలోనే తాజాగా మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఇరు దేశాల మధ్య యథేచ్ఛగా జరుగుతున్న రాకపోకలను నిలిపివేసింది. ఈ మేరకు కేంద్ర హోం మంత్రి అమిత్ షాగురువారం 'ఎక్స్ (ట్విటర్)' వేదికగా ప్రకటన చేశారు. సరిహద్దులను మరింత బలోపేతం చేయడానికి ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం కట్టుబడి ఉంది. ఈశాన్య రాష్ట్రాలైన మిజోరం, మణిపుర్, నాగాలాండ్, అరుణాచల్ ప్రదేశ్‌లు మయన్మార్‌తో సరిహద్దును పంచుకుంటున్నాయి. ఇప్పటి వరకు సరిహద్దు నుంచి ఇరువైపులా 16 కిలోమీటర్ల వరకు ఎలాంటి వీసా లేకుండా ప్రజలు స్వేచ్ఛగా తిరిగే వెసులుబాటు ఉంది. అయితే, ఇటీవల ఆ దేశం నుంచి భారత్‌లోకి అక్రమ చొరబాట్లు పెరిగాయి. దీంతో వీటిని అరకట్టేందుకు సరిహద్దులో 1,643 కిలోమీటర్ల పొడవునా కంచెను నిర్మించనున్నట్లు అమిత్ షా ఇటీవల వెల్లడించారు. ఇప్పటికే మణిపుర్‌లోని మోరేలో 10 కిలోమీటర్ల మేర పనులు పూర్తి చేసినట్లు తెలిపారు. హైబ్రిడ్ నిఘా వ్యవస్థద్వారా మణిపుర్, అరుణాచల్ ప్రదేశ్‌లలో కిలోమీటరు చొప్పున ఫెన్సింగ్ ఏర్పాటుకు పైలట్ ప్రాజెక్టులు కొనసాగుతున్నాయి.

# వందేభారత్‌లో మంచినీటి ఆదా

చెన్నై,ఫిబ్రవరి8 : వందే భారత్ రైళ్లలో ప్రయాణికులకు ఇకపై 500 మి.లీ వాటర్ బాటిళ్లు అందించనున్నట్లు రైల్వే బోర్డు అధికారులు తెలిపారు. ఈ రైలు ప్రయాణికులకు లీటరు రైల్ నీర్ బాటిల్‌ను ఉచితంగా అందిస్తుండగా, కొందరు ప్రయాణికులు సగం తాగిన బాటిళ్లను చెత్తకుండీలో పడేస్తున్నారు. నీరు వృథా కావడాన్ని అడ్డుకొనేలా ఇకపై అర లీటర్ బాటిళ్లు అందజేయాలని అన్ని మండల మేనేజర్లకు రైల్వే బోర్డు సర్క్యులర్ పంపింది.

# మన్మోహన్ సేవలు నిరుపమానం

**ఆయన నిబద్ధత ఎంపిలకు ఆదర్శరం**

**రాజ్యసభలో ప్రధాని మోడీ వెల్లడి**

న్యూఢిల్లీ,ఫిబ్రవరి8 : మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌ను ప్రధాని నరేంద్ర మోదీ ప్రశంసించారు. రాజ్యసభలో పదవీ విరమణ చేస్తున్న సభ్యుల వీడ్కోలు సందర్భంగా ప్రధాని సభలో ప్రసంగించారు. మోదీ మాట్లాడుతూ.. మన్మోహన్ సింగ్ తన ఆరోగ్యం బాలేనప్పుడు కూడా వీల్ చైర్‌లో పనిచేశారని గుర్తు చేశారు. ఒకానొక సమయంలో ఓటింగ్ సందర్భంగా మన్మోహన్ వీల్ చైర్‌లో వచ్చి ఓటు వేశారని ఆ ఘటన వృత్తిపట్ల తనకున్న నిబద్ధతకు తార్కాణంగా నిలిచిందని పేర్కొన్నారు. పదవీ విరమణ చేయనున్న రాజ్యసభ సభ్యులకు ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ ఢిల్లీలోని తన నివాసంలో గురువారం వీడ్కోలు ఇవ్వనున్నారు. ఈమేరకు ఉదయం 10 గంటలకు రాష్ట్రపతి భవన్‌లో రాజ్యసభ సభ్యులు గ్రూప్ ఫొటోలు దిగారు.రాజ్యసభలో 56 మంది ఎంపీలు త్వరలో పదవీ విరమణ చేయనున్నారు. ఈ నేపథ్యంలోనే గురువారం వారికి సభలో వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్రమోదీమాట్లాడుతూ మాజీ ప్రధాని, కాంగ్రెస్ నేత మన్మోహన్ సింగ్‌పై ప్రశంసల జల్లు కురిపించారు. ఆయన ఎంపీలందరికీ ఆదర్శమని కొనియాడారు. ఈ దేశానికి మన్మోహన్‌జీ చేసిన సేవ అపారం. సుదీర్ఘకాలం పాటు రాజ్యసభకు ఆయన అందించిన సహకారం, దేశాన్ని నడిపించిన తీరు ఎప్పటికీ గుర్తుంటుంది. రాజ్యసభలో ఇటీవల ఓ బిల్లుపై జరిగిన ఓటింగ్‌లో ట్రెజరీ బెంచ్ గెలుస్తుందని తెలిసినప్పటికీ ఆయన వీల్‌ఛైర్‌లో వచ్చి ఓటు వేశారు. ఓ సభ్యుడిగా తన విధుల విషయంలో ఎంత బాధ్యతగా ఉన్నారనడానికి ఇదొక ఉదాహరణ. ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసేందుకు ఆయన చక్రాల కుర్చీలో ఉన్నా పనిచేశారు. ఎంపీలందరికీ ఆయన ఆదర్శం అని మోదీ ప్రశంసించారు. ఈ సందర్భంగా కేంద్రానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ విడుదల చేసిన 'బ్లాక్ పేపర్' గురించి మోదీ ప్రస్తావించారు. ఆ పత్రం మా ప్రభుత్వానికి దిష్టి చుక్క లాంటిదే. మాపై చెడు చూపు పడకుండా చేస్తుంది. ప్రతిపక్షాల చర్యను మేం స్వాగతిస్తున్నాం అని అన్నారు. తన పదేళ్ల పాలనపై కేంద్రంలోని అధికార భాజపా 'వైట్‌పేపర్'ను పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనున్న విషయం తెలిసిందే.

# ధరల నియంత్రణలో ప్రభుత్వాల విఫలం !

దేశంలో ఆహారధాన్యాల సేకరణ,వ్యవసాయ విధానంలో మార్పులు రానంత వరకు ..వాటి ధరలు అనూహ్యంగా పెరుగుతూనే ఉంటాయి. తాజాగా దేశంలో బియ్యం ధరలు చుక్కలనంటాయి. కర్నూలు సోనా బియ్యం కిలో 70కి చేరువలో ఉన్నాయి. ధరల నియంత్రణలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయి. ఎక్కడా కఠిన చర్యలు కానరావడం లేదు. భారత్ బియ్యం కిలో 29కే అందిస్తామని ప్రకటించినా ధరల్లో మార్పు కానరావడం లేదు. ఇబ్బడిముబ్బడిగా వరిధాన్యం పడుతున్నా..బియ్యం ధరలు ఎందుకు పెరుగుతున్నాయో ఆలోచన చేయడం లేదు. ఒక్క బియ్యం ధరలే కాదు..ఉప్పులూ..పప్పుల ధరలు కూడా విపరీతంగా పెరిగి పోతున్నాయి. ధరల నియంత్రణ తమ పనికాదన్న రీతిలో ప్రభుత్వాలు ఉన్నాయి. ఇంతకన్నా దౌర్భాగ్యం మరోటి లేదు. ఇదేనా వికసిత భారత్ అని ఆలోచించాలి. అందమైన ప్రకటనలతో ఎంతోకాలం ప్రజలను మోసపుచ్చలేం. వ్యవసాయ, అనుబంధ రంగాలను బలోపేతం చేయడంతో పాటు, ఆహారధాన్యాల దిగుమతులను పూర్తిగా తగ్గించుకోవాల్సిన అవసరాన్ని ప్రభుత్వాలు గుర్తించడం లేదు. అందుకే ఎంతగా శ్రమించినా రైతులకు మాత్రం గిట్టుబాటు ధరలు దక్కడం లేదు. ప్రజలకు తక్కువ ధరలకు బియ్యం లభ్యం కావడం లేదు. కార్పోరేట్ దిగ్గజాలకు ఇస్తున్న ప్రాధాన్యం మన దేశంలో రైతులకు ఇవ్వకపోవడం కారణంగా వ్యవసాయం అనుకున్న రీతిలో ముందుకు సాగడం లేదు. ఆదానీ, అంబానీలకు మద్దతు ఉన్నంత మాత్రాన దేశం అభివృద్ది చెందదు. సామాన్య రైతులను ఆధారం చేసుకుని మన విధానాలు మార్చుకోవాలి. దేశానికి అన్నం పెడుతున్న రైతన్నలు ఎప్పుడూ మోసోపోతూనే ఉన్నారు. ఈ పరిస్థితి మారాల్సి ఉంది. సాగు చట్టాలను రద్దు చేసినా...రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదు. నిర్మలాసీతారామన్ ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో వ్యవసాయ రంగం, అనుబంధ రంగాలను పైకి తీసుకుని వచ్చే ప్రయత్నాలు చేయలేదు. నిజానికి ఈ రెండు రంగాలను బలోపేతం చేస్తే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం కాగలదు. అలాగే దేశీయంగా వ్యవసాయ ఉత్పత్తులకు ప్రాధాన్యం పెరగాలి. వ్యవసాయ దిగుమతులను తగ్గించుకుంటే తప్ప ఇది సాధ్యం కాదు. గోదాముల్లో పేరుకు పోతున్న ధాన్యం ప్రజలకు అందడం లేదు. దేశంలో నేటికీ పేదప్రజలు ఆకలితో అలమటిస్తున్న దుర్భర పరిస్థితులు దాపురించాయి. వాళ్ళ దగ్గర కొనుగోలుశక్తి లేకపోవడమే దీనికి కారణం. వీరంతా తమ ఆరోగ్య సంరక్షణకి, గృహ వసతికి, బిడ్డల చదువులకు నిరంతరం పోరాడుతూనే ఉన్నారు. అంటే ఈ రంగాలను కూడా పేదలకు చేరువ చేయాల్సిన అవసరం ఉంది. ఆర్థిక వ్యవస్థలో వినిమయాన్ని పెంపొందించడం జరగాలంటే ప్రజా సంక్షేమ రంగాల్లో కేటాయింపులను పెంచాలి. దేశంలో ఎఫ్‌సిఐ వద్ద ఆహార ధాన్యాల నిల్వలు అలాగే పడివున్నాయి. కానీ ప్రజల కొనుగోలుశక్తి లేకపోవడంతో అధిక ధరలు దాడి చేస్తున్నాయి. నిజానికి సంక్షేమానికి కేటాయింపులు పెంచాలి. కాని బడ్జెట్‌లో సంక్షేమ రంగాలకు గతంలో ఉన్న కేటాయింపులకు సైతం కోతలు పెట్టింది. తలసరి వాస్తవ వినిమయంలో పెరుగుదల 5శాతం కన్నా తక్కువగానే ఉంది. ఇది జిడిపి వృద్ధి రేటు కన్నా తక్కువ. ఉపాధి హామీ పథకానికి కేటాయింపుల సంగతి అలావుంచితే దానిని ప్రాధాన్య రంగాలకు వినియోగించివుంటే బాగుండేది. వ్యవసాయరంగానికి అనుసంధానం చేయాలన్న డిమాండ్లను పట్టించుకోవడం లేదు. దేశంలో 81 కోట్లమందికి నెలకు 5 కిలోల చొప్పున ఆహారధాన్యాలను ఉచితంగా అందిస్తున్నట్లు ప్రభుత్వం చాలా గొప్పగా ప్రచారం చేసుకుంటోంది. అంటే ఇంకా ప్రజల కొనుగోలు శక్తి పెరగలేదని ఈ పథకం వల్ల అర్థం చేసుకోవచ్చు. విద్య, వైద్యం రంగాలకు కేటాయింపుల్లో నామమాత్రపు పెరుగుదల చూపించారు. కాని పెరుగుతున్న ద్రవ్యోల్బణం

ఫలితంగా ఈ రంగాలు వాస్తవం గా గతం కన్నా తక్కువ కేటాయింపులనే పొందనున్నాయి. ఉత్పత్తి సామర్థ్యాన్ని పూర్తిగా ఉపయోగించు కోవడం కాని, మౌలిక వసతులను సంపూర్ణంగా ఉపయోగించుకో గలగడం కాని జరగడం లేదు. ఫలితంగా ఆర్థిక వ్యవస్థ కోలుకోవడం లేదు. పైగా దేశ ఆర్థిక వ్యవస్థ మనుగడ కూడా ప్రమాదంలో పడిపోతుంది. సామాన్య ప్రజల జీవన ప్రమాణాలు మెరుగు పడనంత కాలం ఆర్థిక వ్యవస్త చితికిపోతూనే ఉంటుంది. ప్రజల కొనుగోలుశక్తి పెరగనంత కాలం ఈ పరిస్థితి తప్పదు. అప్పుడు ఈ ఆర్థికవృద్ధి లక్ష్యానికే అర్థం లేకుండా పోతుంది. ప్రజా సంక్షేమ కార్యక్రమాలకు కేటాయింపుల్లో కోత పడిందో, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ప్రజాసంక్షేమం విషయంలో వెనకాడతాయి. ఆర్థిక వసరులను ఈ విధంగా కావాలనే కేంద్రం చేతుల్లో మరింత ఎక్కువగా ఉంచుకోవడం ద్వారా ఫెడరల్ వ్యవస్థను కేంద్రం మరింత బలహీనపరుస్తోంది. ప్రజా సంక్షేమానికి ఖర్చు చేయడం వలన నేరుగా శ్రామిక ప్రజలు లబ్ది పొందుతారు. ప్రజా సంక్షేమానికి చేసే ఖర్చు ఆర్థిక వ్యవస్థ మీద చేసిన ఖర్చుకి మించి కొన్ని రెట్లు ఎక్కువ ప్రభావాన్ని చూపిస్తుంది. అదే పెట్టుబడి వ్యయం మీద ఖర్చు చేస్తే ఆ విధమైన ప్రభావం ఉండదు. అంటే పెట్టుబడి వ్యయం మీద ఖర్చు పెంచడం కన్నా సంక్షేమం మీద ఖర్చు పెంచితే ప్రత్యక్షంగా కాని, పరోక్షంగా కాని ఎక్కువ ఉపాధి కల్పన జరుగుతుంది. పెట్టుబడి వ్యయాన్ని పెంచినంత మాత్రాన దేశంలో ఉపాధి కల్పన జరిగిపోతుందని అనుకోరాదు. దేశీయంగా ఆ పెట్టుబడి వ్యయాన్ని వినియోగించగలిగిన పరిస్థితి ఉంటే మనదేశంలో ఉపాధి కల్పన పెరుగుతుంది. అంతేకాని విదేశీ దిగుమతులకోసం పెట్టుబడి వ్యయాన్ని ఎక్కువ కేటాయిస్తే ఉపాధి అదనంగా పెరిగేది చాలా స్వల్పమే. ప్రజల కొనుగోలు శక్తిని పెంచేలా కార్యాచరణ జరగాలి. గ్రామాల్లో ఆర్థిక కార్యకాలపాలకు ప్రాధాన్యం పెరగాలి. అలా జరగాలంటే వ్యవసాయం, అనుబంధ రంగాలను ఆదుకోవాలి. అందుకు ప్రోత్సాహకాలు పెరగాలి. దేశీయంగా పండించే పంటలను ప్రోత్సహించి, అందుకు అనుగుణంగా దిగుమతులపై ఆంక్షలు విధించుకోవాల్సిందే.

# చౌకబియ్యంపై అజమాయిషీ ఏదీ

- సరిహద్దులు దాటుతున్న పట్టని అధికారులు



నిజామాబాద్,ఫిబ్రవరి8 : ప్రభుత్వం ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా పేదలకు పంపిణీ చేస్తున్న బియ్యం పక్కదారి పట్టకుండా ఎన్ని చర్యలు చేపట్టినా ఆగడం లేదు. రూపాయికే కిలో బియ్యం రావడం, బహిరంగ మార్కెట్లో ధరలు పెరగడంతో ఈ బియ్యాన్ని అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. రూపాయి బియ్యం తినడానికి ఎవరూ ముందుకు రావడంలేదు. ఇదే అదనుగా కొందరు ఈ బియ్యాన్ని సేకరించి దందా చేపట్టారు. చాలామంది తమకు వచ్చిన బియ్యాన్ని షాపుల వద్దే పదిరూపాయలకు చొప్పున అమ్మేసు కుంటున్నారు. రేషన్ డీలర్లు సైతం కార్డుదారుల నుంచి బియ్యాన్ని కొనుగోలు చేసి అంతకంటే ఎక్కువ ధరకు వ్యాపారులకు అమ్ముతున్నారు. జిల్లా నుంచి రేషన్ బియ్యం మహారాష్ట్ర ఇతర ప్రాంతాలకు అక్రమంగా రవాణా అవుతోంది. గిరిజన ప్రాంతాల్లో దుకాణదారులు బియ్యాన్ని తీసుకొని బదులుగా ఇతర నిత్యావసర వస్తువులను ఇస్తున్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలకు లారీల ద్వారా రేషన్ బియ్యం, ఇతర వస్తువులు సరఫరా చేస్తారు. ఈ బియ్యాన్ని పెద్ద ఎత్తున తరలించి కొందరు సొమ్ము చేసుకుంటున్నారు. బియ్యం పక్కదారి పడుతుండడంతో ప్రభుత్వం కఠిన చర్యలు ప్రారంభించినా ఎలాంటి ఫలితం కానరావడం

లేదు. ఇటీవల చౌకధరల దుకాణాలను తనిఖీ చేస్తూ సరుకుల పంపిణీని, స్టాక్ నిల్వలను, రేషన్ బియ్యం

రీసైక్లింగ్ కాకుండా, మిల్లర్లు రైతుల నుంచి కొనుగోలు చేసిన పంటలు వివరాలను సేకరిస్తున్నారు. పంటల

అక్రమ నిల్వలను సైతం పరిశీలిస్తారు. అక్రమ రవాణా కాకుండా చర్యలు తీసుకుంటారు. దీంతో ప్రజా పంపిణీ దుకాణాల ద్వారా పంపిణీ చేసే సరకులు పక్కదారి పట్టే అవకాశాలు ఉండవు. ఎంఎల్ఎస్ పాయింట్లలో కంట్రోల్ రూంను ఏర్పాటు చేసి బియ్యం సరఫరా చేసే వాహనాల్లో జీపీఎస్ పరికరాలను అమర్చారు. ఫలితంగా రేషన్ వస్తువులు సక్రమంగా దుకాణాలకు చేరే అవకాశాలున్నాయి. ఇకపోతే చౌక బియ్యం తీసుకుంటున్న కొంతమంది వినియోగిస్తుండగా, మరికొందరు అధిక ధరలకు అమ్ము కుంటున్నారు. పౌరసరఫరాల శాఖ ఆ ధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక బృందాలు సైతం రేషన్ దుకాణాలతో పాటు వివిధ ప్రాంతాల్లోని కిరాణ దుకాణా ల్లో తనిఖీలు నిర్వహిస్తున్నాయి. రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసిన దుకాణాదారులపై కేసులు నమోదు చేస్తున్నాయి. బియ్యం అక్రమ రవాణా కాకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. రేషన్ దుకాణంలో పంపిణీ చేసిన బియ్యం రీసైక్లింగ్ అయి సన్నబియ్యం రూపంలో అమ్మకాలు సాగిస్తున్నారు. పౌరసరఫరాలశాఖకు మిల్లర్లు సన్నబియ్యాన్ని సరఫరా చేస్తుండగా, వారు రైతుల వద్ద కొనుగోలు చేసిన బియ్యం వివరాలను సైతం ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం సేకరిస్తుంది. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా పేదలకు పంపిణీ చేసే ఇతర వస్తువులు దుకాణాలకు చేరకుండా నిఘా ఉంచుతారు. పంటల అక్రమ నిల్వలపై సైతం వీరు గుర్తిస్తారు. వీరు ప్రతి నెలా ఇందుకు సంబంధిం చిన నివేదికను ఉన్నతాధికారులకు అందజేసి అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకుంటారు. అయితే ఎవరెన్ని చర్యలు తీసుకున్నా స్మగ్లర్లు దందా వీడడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి.

# పులుల హత్య తరవాత అధికారుల అప్రమత్తం




- సమీప గ్రామాల్లో ప్రజల్లో చైతన్యం
- అడవుల జోలిక ఇరాకుండా సూచలను

ఆదిలాబాద్,ఫిబ్రవరి8 : అడవుల సంరక్షణపై అధికారులు రంగంలోకి దిగి సమీప గ్రామస్థులను చైతన్యం చేస్తున్నారు. వారే రక్షకులుగా ఉండాలని సూచిస్తున్నారు. ఇటీవల పులలపై విషప్రయోగం జరిగిన నేపథ్యంలో అలాంటి చర్యలకు పాల్పడకుండా హెచ్చరిస్తున్నారు. అడవిలో పోడు వ్యవసాయం, కలప స్మగ్లింగ్ కోసం విలువైన చెట్లను నరికివేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అడవులను నరికివేస్తూ పోతే రాజస్థాన్ రాష్ట్రంలా చివరకి ఎడారులే మిగులుతాయన్నారు. అడవులను కాపాడు కోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని చెప్పారు. అడవుల్లో సంచరించే జంతువులను వేట పేరుతో చంపుతున్నారని, జంతువులు కూడా స్నేహభావంతో మెదులుకుంటాయని, ఈ విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలని సూచిస్తున్నాచారు. అడవులను, అడవి జంతువులను సంరక్షిస్తేనే మానవాళికి మనుగడ ఉంటుందని అన్నారు. అడవుల పరిస్థితి, ప్రభుత్వం చేపడతున్న చర్యలు, కలప స్మగ్లింగ్‌పై కొత్తగా వచ్చిన చట్టాలను గురించి డీఎఫ్‌వో వివరించారు. కలప స్మగ్లింగ్‌ను అరికట్టి అడవులను కాపాడుకునేందుకు కృషి చేస్తామన్నారు. ఇదే క్రమంలో జిల్లాలో కలప అక్రమ రవాణాను అరికట్టేందుకు అధికారులు పకడ్బందీ చర్యలు తీసుకున్నారు. జిల్లాలోని అటవీ ప్రాంతాల్లో ఆరు కొత్త చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి సాయుధ పోలీసుల సహకారంతో అటవీశాఖ అధికారులు తనిఖీలు నిర్వహిస్తున్నారు. దీంతో కొన్ని రోజులుగా కలప రవాణాకు అడ్డుకట్ట పడినట్లయింది. కొన్ని సంవత్సరాలుగా చెట్లను నరికివేస్తూ కలపస్మగ్లింగ్‌కు పాల్పడుతున్నారు. కొందరు సామిల్ వ్యాపారులకు స్థానికులు లారీలు, వ్యాన్‌లలో కలపను తరలిస్తున్నారు. దట్టమైన అడవులు ఉండగా.. వీటిలో విలువైన టేకు చెట్లు ఉన్నాయి. ఈ గ్రామాలకు చెందిన పలువురు కలప నరికివేత ప్రధాన వృత్తిగా ఎంచుకున్నారు. వీరిలో అక్షరాస్యత శాతం తక్కువగా ఉంది. చదువుకోకపోడవడంతో పాటు వారి పిల్లలను సైతం చదివించడానికి ఇష్టపడడం లేదు. దీంతో పిల్లలు పెద్దయిన తర్వాత తమ కుటుంబ సభ్యులతో పాటు చెట్ల నరికివేతకు పాల్పడుతున్నారు. ఫలితంగా దట్టమైన అడవులు అంతరించి పోతున్నాయి. అడవులు అంతరించి పోకుండా అధికారులు అవసరమైన అన్ని చర్యలూ తీ సుకుంటున్నారు. ఇందులో భాగంగా అడవులకు సమీప ప్రాంతాల్లో నివసించే ప్రజలు కలపను నరికివేయకుండా హెచ్చరికలు చేస్తున్నారు. ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. వ్యవసాయ, అటవీ, మైనార్టీ, విద్యాశాఖల ఆధ్వర్యంలో వివిధ కార్యాక్రమాలు నిర్వహించనున్నారు. యువకులకు వృత్తి పరమైన శిక్షణ తాపీమేస్త్రీ, ఎలక్ట్రీషియన్, ప్లంబింగ్, వెల్డింగ్, కుట్టుశిక్షణ లాంటి వాటిల్లో శిక్షణ ఇస్తారు. వైద్య ఆరోగ్యశాఖ వారితో పలు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తారు. వారికి వ్యవసాయపరంగా అవసరమైన సహాయ, సహకారాలు అందించనున్నారు. ఈ అవకాశాలన్ని వినియోగించు

కోవాలని సూచిస్తున్నారు.

# అడవుల రక్షణకు కఠిన చర్యలు



- ద్విముఖ వ్యూహంతో అటవీశాఖ కృషి
- పోలీసుల సహకారంతో స్మగ్లర్లకు చెక్

భద్రాద్రికొత్తగూడెం,ఫిబ్రవరి8 : జిల్లాలో అటవీ భూములను ఆక్రమించే వారిని, అటవీ జంతువులను వేటాడే వారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసారు. అటవీ అధికారులు ఇందుకోసం ప్రాణాలకు తెగించి పోరాడుతున్నారు. ఓవైపు అడవుల రక్షణ మరోవైపు హరితహారంలో మొక్కలు నాటడం ద్వారా ప్రత్యేక చర్యలు తీసుకోబోతున్నారు. ఇప్పటికే అడవులకు రక్షణ కంచెలు ఏర్పాటు చేయగా సత్ఫలితాలు ఇస్తున్నాయి. అటవీ సంపదను దోచుకునే వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోబోతున్నారు. ఏజెన్సీ గ్రామాల్లో అటవీ సంపదను దోచుకునే వారిపై ఇకనుంచి సమాచారాన్ని సేకరించి వారిపై కఠిన చర్యలు తీసుకునే విధంగా చర్యలు చేపడతామని అన్నారు.అటవీ భూముల ఆక్రమణ దారులపై చట్టపరంగా చర్యలు తీసుకునే విధంగా పోలీస్ శాఖ, అటవీ శాఖ సమన్వయంతో పనిచేసే విధంగా ప్రణాళికను రూపొంది స్తున్నారు. ఇందు కోసం పోలీస్, అటవీశాఖలు సంయుక్తంతో పనిచేసి అటవీ సంపదను కాపాడాలన్న లక్ష్యంతో కార్యాచరణ సిద్ధం చేశారు. అటవీ, పోలీస్ శాఖలు సమ న్వయంతో జిల్లాలో అటవీ సంపదను కాపాడుకోవాలని అటవీ అధికారులు అన్నారు. అటవీ సంపద ఎక్కువగా ఉన్న జిల్లాల్లో ఒక్కటైన భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో అటవీ సంపద అక్రమార్కుల పాలు కాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. అటవీ సంపదను కాపాడుకునేందుకు సమగ్ర కార్యాచరణ ప్రణాళికలు తయారు చేయాలని సూచించారు. ప్రస్తుతం ఉన్న 20 చెక్‌పోస్టులతో పాటు అదనంగా ఆరు చెక్‌పోస్టుల ఏర్పాటునకు ప్రభుత్వానికి నివేదిక పంపినట్లు తెలిపారు. కలప అక్రమ రవాణా చేసే వారిపై ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలని సూచించారు. అడవుల రక్షణలో భాగంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని అటవీ ప్రాంతాల్లో భారీగా మొక్కలను నాటడమే లక్ష్యంగా నిర్ణయించారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా పనులు చేపట్టారు. జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో ప్రతి గ్రామ పంచాయతీకి ఒక నర్సరీ ఉంటే మొక్కలను సులువుగా ఆయా గ్రామాల్లో మొక్కలు నాటడంతో పాటు ప్రజలను అత్యధికంగా భాగస్వాములను చేయనున్నారు.నర్సరీలోనే ఆ పంచాయతీల్లో, మండలాల్లో మొక్కలు నాటేలా అధికారులు ప్రణాళికా రూపకల్పన చేశారు. ఇతర మండలాల నుంచి మొక్కలను తీసుకువచ్చి మొక్కలు నాటేలా కాకుండా ప్రతి గ్రామ పంచాయతీ ఖచ్చితంగా ఒక నర్సరీని ఏర్పాటు చేసి మొక్కలను పెంచే బాధ్యతను అప్పగించారు. జిల్లాకు నిర్ధేశించిన మొక్కల లక్ష్యాన్ని నాటేందుకు కృషి చేస్తున్నామని జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖాధికారి పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి గ్రామ పంచాయతీకి ఒక నర్సరీని ఏర్పాటు చేయడంతో విత్తనాల పంపిణీకి చర్యలు చేపడుతున్నారు. టేకు వృక్ష జాతి అంతరించిపోయే దశలో ఉండడం, గృహ, ఫర్నీచర్ అవసరాలతో పాటు, ఎక్కువ విలువ కలగడంతో టేకు మొక్కలు నాటేలా ప్రభుత్వం నిర్దేశించింది. ఎలాంటి వాతావరణంలోనైనా టేకు మొక్కలు పెరిగే అవకాశం ఎక్కువగా ఉన్నందునే టేకు మొక్కలను పెంచనుంది. టేకు మొక్కలు మినహాయిస్తే మిగతా పూలమొక్కలు, పండ్ల మొక్కలను పాఠశాలలు, ఆసుపత్రులు, ప్రధాన రోడ్ల వెంట నాటనున్నారు. టేకుతో పాటు వెదురు, దానిమ్మ, నిమ్మ, జామ, సీతాఫలం, బొప్పాయి, కర్జూరం, నిద్ర గన్నేరు, మల్బర్ వేప, గానుగ, వేప, కదంబ, గుల్‌మొహర్, మారేడు, స్పాంథోడియా, కరివేపాకు, గోరింట, ఉసిరి, చింత, రేగు, ఈత, నేరేడు తదితర మొక్కలు ఈ నర్సరీలో పెంచనున్నారు.

# విద్యార్థులకు ఆత్మవిశ్వాసం ముఖ్యం ! (ఆధ్యాత్మిక చింతన )

తిరుమల,ఫిబ్రవరి8 : ధృఢ సంకల్పం, పట్టుదల మనిషిని విజయ తీరాలకు చేరుస్తుంది. అనుకున్న పనిని నెరవేర్చేలా చేస్తుంది.విజయవంతమైన జీవితానికి అవసరమైనదంతా మనిషి మనసులో కలిగే కుతూహలం మీదనే ఆధారపడి ఉంటుంది. కుతూహలం వల్లనే ప్రశ్నించే మంచి లక్షణం విద్యార్థిలో కనిపి స్తుంది. దానివల్లనే జ్ఞాన తేజస్సు ఆవిర్భవిస్తుంది. మనం ఎదుర్కొనే ప్రతి సమస్య వెనకా ఓ అవకాశం దాగి ఉంటుంది. అది తెలుసు కోవాలన్న కుతూహలం ఉంటే చాలు. ఉన్నదాంతో సంతృప్తి చెందడం మంచిదే కాని- జ్ఞానప్రాప్తి విషయంలో మా త్రం తపన ఎంతైనా అవసరం. ఇష్టంగా చేసే పనికి సమయం లేకపోవడమంటూ ఉండదు. కావలసింది దృఢసంకల్పం. ఏకా గ్రత, ఆలోచనల వల్ల ఆ నైపుణ్యం సిద్ధిస్తుంది. ఒకదారి మూ సుకు పోయినప్పుడు జీవితంలో మరోదారి తెరచుకొంటుంది. ఉత్సుకతతో దాన్ని గుర్తించగలగడమే విజయ సూచకం. విజయసాధనకు మూలమైన ఆత్మ విశ్వాసం, కృషి కుతూహలం వల్లనే లభ్యమవుతాయి. ఈ ప్రవృత్తి ప్రతి మనిషికీ అవసరం. అందుకే స్వశక్తిని విడిచి పరాధీనులమై దీనంగా జీవించడం అవమానకరం. మనిషి ఎప్పుడూ ధైర్యంగా నిశ్చయ భావంతో అడుగులు ముందుకు వేసి బతకాలని కోరుకుంటాడు. ఆత్మ విశ్వాసం, స్థిరత్వం- విజయాలకు, సంతోషకరమైన జీవితాలకు మార్గాలు. ఎవరో వచ్చి మన కష్టాలను తీరుస్తారని ఆశించడ మంత అజ్ఞానం మరొకటి లేదు. తన శక్తియుక్తులపై మనిషికి న మ్మకం ఉండాలి. మనలోని ప్రాజ్ఞత, వనరులు, సాధన సామ గ్రిని కూడగట్టుకొని పరులపై ఆధారపడకుండా అందుకొన్న విజయాలు ఎనలేని ఆత్మవిశ్వాసాన్ని కలిగిస్తాయి. అప్పుడు మ నకు మనమే యజమానులం. అలాంటి వ్యక్తిత్వం కలిగినవారు నిశ్శబ్దంగా నిస్సందేహంగా నిబ్బరంగా కలత చెందకుండా లక్ష్యా లను సాధిస్తారు. ఎలాంటి సవాళ్లనైనా ఎవరిపై ఆధారపడక ఎదుర్కొనేవాడే ధీరుడని శ్రీకృష్ణ పరమాత్మ బోధించాడు. మనలోని స్థిరసంకల్పమే నిజమైన బలం. ఆ శక్తిని ఆధారం చేసుకొని వనరులను సమకూర్చుకొని సాధించిన కార్యాలు సంతృప్తితో పాటు ఆత్మ బలాన్నిస్తాయి.

# ఇండియా కూటయికి ఆప్ దెబ్బ

## అసోంలో సొంతంగా అభ్యర్థుల ప్రకటన



న్యూఢిల్లీ,ఫిబ్రవరి8 : లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలోనే ఇండియా కూటమి వరుస షాక్‌లతో ఉక్కిరి బిక్కిరి అవుతోంది. తాజాగా అరవింద్ కేజ్రీవాల్ సారథ్యంలోని ఆమ్ ఆద్మీ పార్టీ.. అస్సాం లోక్‌సభ ఎన్నికల్లో పోటీకి ముగ్గురు అభ్యర్థులను ప్రకటించింది. కూటమిలోని పార్టీల మధ్య సీట్ల పంపకం విషయంలో జాప్యం పేరిట తన అభ్యర్థులను ఏకపక్షంగా ప్రకటించేసింది. దిబ్రూగఢ్ స్థానం నుంచి మనోజ్ ధనోవర్, గువాహటి నుంచి భాబెన్ చౌదరి, తేజ్‌పూర్ స్థానం నుంచి రిషి రాజ్ కౌటిన్యను బరిలోకి దింపుతున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు ఆప్ ఎంపీ, పార్టీ నేషనల్ జనరల్ సెక్రెటరీ సందీప్ పాఠక్ కీలక ప్రకటన చేశారు. ఈ చర్చలతో మేం అలిసిపోయాం. ఎన్నికల్లో నిలబడి గెలవాలనేదే మా లక్ష్యం. ఇక టైం లేదు. మేం ఇండియా కూటమి భాగస్వాములం. అయితే, ఈ సీట్లను కూటమి మాకే కేటాయిస్తుందని ఆశిస్తున్నాం అని సందీప్ పాఠక్ పేర్కొన్నారు. ఎన్నికల్లో విజయానికి టైమింగ్, వ్యూహమే కీలకమని సందీప్ పాఠక్ మీడియా సమావేశంలో చెప్పారు. ఇంకెంతకాలం చర్చిస్తారు. మనం ముందు పనిచేయాలి. మేము ఇండియా కూటమితోనే ఉన్నాం కానీ ప్రస్తుతం మాకు ఎన్నికల్లో గెలుపే కీలకం. ఎంత వేగంగా స్పందిస్తే విజయావకాశాలు అంతగా పెరుగుతాయి అని ఆయన అన్నారు. మిగతా కూటమి సభ్యులతో పోలిస్తే కాంగ్రెస్, ఆప్ మధ్య ఏకాభిప్రాయమే ఉందని ఇరు పార్టీల నేతలు చెబుతున్నారు. అనేక రాష్ట్రాల్లో ఇండియా కూటమి పార్టీలు ప్రత్యర్థులుగా ఉన్న విషయాన్ని గుర్తు చేస్తున్నారు. అస్సాంలో మొత్తం 14 లోక్‌సభ స్థానాలు ఉన్నాయి. ఇక ఆప్ తన అభ్యర్థులను ప్రకటించిన మూడు స్థానాలకు ప్రస్తుతం బీజేపీ ఎంపీలు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. 2019 నాటి ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ 9 సీట్లు గెలవగా కాంగ్రెస్ మూడింటిలో విజయం సాధించింది.

prajamantalau daily pages (09-02-24)_times of varha main (13-2).qxd 2/8/2024 10:21 PM Page 4



# బీసీల సంక్షేమం కోసం 25 వేల కోట్లు కేటాయించాలి

జగిత్యాల ఫిబ్రవరి 08 (ప్రజామంటలు):

ప్రభుత్వం ప్రవేశపెట్టే బడ్జెట్ లో రాష్ట్రంలోని బి.సిల సంక్షేమం కొరకు 2024-25 రాష్ట్ర బడ్జెట్ లో 25 వేల కోట్లు కేటాయించాలని బిసి సంక్షేమ సంఘం డిమాండ్. రాష్ట్ర అసెంబ్లీ సమావేశాల్లో ప్రవేశపెడుతున్న బడ్జెట్ లో రాష్ట్రంలోని బి.సిల సంక్షేమం కొరకు 2024-25 రాష్ట్ర బడ్జెట్ లో 25 వేల కోట్లు కేటాయించాలని బిసి సంక్షేమ సంఘం డిమాండ్ చేస్తుంది. ఈ సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి ముసిపట్ల లక్ష్మీనారాయణ మాట్లాడుతూ గతంలో వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో 2008 లో ప్రవేశపెట్టిన పూర్తి రీయింబర్స్మెంట్ పథకాన్ని రద్దు చేసి 2014 లో బిఆర్ ఎస్ ప్రభుత్వం సగం ఫీజులు ఇస్తూ విద్యార్థుల గొంతు కోసిందని విమర్శించారు. అప్పటినుంచి ఇప్పటివరకు పెద్దఎత్తున విద్యార్థులకు పూర్తి ఫీజులు ఇవ్వాలని ఎన్ని ధర్నాలు చేసినా గత ప్రభుత్వం స్పందించలేదని అన్నారు. కనీసం ఇప్పుడైనా కాంగ్రెస్ ప్రభుత్వం నాటి పథకాన్ని పునరుద్ధరించాలని ప్రభుత్వానికి విన్నవించారు. మరియు బిసి లకు సబ్సిడీ రుణాలను అందించాలని మరియు బిసి కులవృత్తుల వారిని ఆదుకొని వారికి ఉపాధి రుణాలను ఇప్పించాలని మరియు బిసి రాష్ట్రాలకే వెన్నెముక లాంటి వారని బిసి ల ఓట్లతో అధికారంలోకి వచ్చి బిసి లను విస్మరించి చిన్నచూపు చూసే పార్టీలకు రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరిస్తున్నాము. బిసి కార్పోరేషన్ ల నుండి బిసి లందరికి సబ్సిడీ రుణాలను అందించాలని డిమాండ్ చేస్తున్నాము. ఈ కార్యక్రమంలో బి.సి సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి ముసిపట్ల లక్ష్మీనారాయణ, బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి అలిశెట్టి ఈశ్వరయ్య, యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు కొక్కు గంగాధర్, బి.సి సంక్షేమ సంఘం జగిత్యాల నియోజకవర్గం అధ్యక్షులు తిరుపురం రాంచందర్, యువజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అనుమల్ల సంజయ్ సామ్రాట్, బిసి విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు జాజాల రమేష్, రాష్ట్ర కో ఆర్డినేటర్ ఋషికేష్ మరియు బి.సి నాయకులు తిరుపురం శ్రవణ్ కుమార్, బీసీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# పెండింగ్ స్కాలర్ షిప్స్, ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు విడుదల చేయాలి

## ధర్మపురిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలి

## ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి అక్రమ్ మాలిక్

జగిత్యాల ఫిబ్రవరి 08( ప్రజామంటలు):

అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఏఐఎస్ఎఫ్ కార్యాలయంలో గురువారము సమావేశం నిర్వహించారు. అనంతరం అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలలో పెండింగ్ స్కాలర్ షిప్స్, ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు విడుదల చేయాలని గత మూడు సంవత్సరాలుగా పెండింగ్లో గత ప్రభుత్వం అందించలేదు. నూతన ప్రభుత్వం విద్య రంగానికి అధిక బడ్జెట్ కేటాయించాలి అలాగే గురుకులలకు సంక్షేమ హాస్టళ్ల కు సొంత భవనాలు నిర్మించి మెస్ కాస్మొటిక్ ఛార్జీలు పెంచాలి. అదే విధంగా ధర్మపురి ఎమ్మెల్యే ప్రభుత్వ చీఫ్ విప్ లక్ష్మన్ కుమార్ ధర్మపురిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు పై హామీని నెరవేర్చి అసెంబ్లీలో ప్రస్తావించి విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి రాహుల్, నాయకులు నాగరాజ్ గర్ల్స్ కన్వీనర్ కో కన్వీనర్లు నాగరాణి, సౌమ్య, విద్యార్థులు రంజిత్, సోహైల్ తదితరులు పాల్గొన్నారు.



# గాంధీనగర్ వినాయక మండపం కూల్చివేత నిలుపుదలపై

## ఎమ్మెల్యే కడియం శ్రీహరిని కలిసిన గ్రామస్థులు

ధర్మసాగర్ ఫిబ్రవరి 08 (ప్రజామంటలు):



నారాయణగిరి గ్రామ బస్టాండ్ గాంధీనగర్ చౌరస్తా లో ఉన్నా వినాయక మండపం జోలికి వెల్లవద్దని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అధికారులకు సూచించారు. మంగళవారం గాంధీనగర్ వినాయక మండపం కూల్చివేతకు పంచాయతీ అధికారులు ప్రయత్నం చేయగా గురువారం గ్రామస్తులు అధిక సంఖ్యలో వెళ్లి ఎమ్మెల్యే కడియం శ్రీహరిని కలిసి గ్రామ సమస్యను వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి అధికారులపై మండిపడ్డారు. చేతనైతే గాంధీ చౌరస్తా నుండి గ్రామపంచాయతీ వరకు వెళ్లే రహదారి సీసీ రోడ్డుపై ఉన్న అక్రమ నిర్మాణాలను తొలగించి ఆ తర్వాత వినాయక మండపం జోలికి రావాలని హెచ్చరించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు గాంధీనగర్ బస్టాండ్ నుండి జీపీ కార్యాలయం వెళ్లే రహదారిపై అక్రమంగా నిర్మించిన కట్టడాలను తొలగించేందుకు కృషి చేయాలని ఎమ్మెల్యే కడియం శ్రీహరికి వినతిపత్రం అందజేశారు. ఈ వినతిపత్రాన్ని జిల్లా పంచాయతీ ఆఫీసర్ కి అందించి విచారణ చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు, గాంధీనగర్ వినాయక భక్త మండలి సభ్యులు పాల్గొన్నారు.

# గృహజ్యోతి దరఖాస్తు అనుసంధానం ప్రారంభం

## 35వ వార్డులో ప్రారంభం చేసిన వార్డు కౌన్సిలర్ జయశ్రీ రఘు, విద్యుత్ సిబ్బంది

జగిత్యాల ఫిబ్రవరి 08 (ప్రజామంటలు):



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొన్న 6 గ్యారంటిలలో ఒకటైన "గృహ జ్యోతి" పథకం కింద 200 యూనిట్ ల ఉచిత కరెంటు సంబంధించి 35 వ వార్డు లోని బ్రాహ్మణ వాడలో ఇంటింటికీ వెళ్లి సర్వీస్ నంబర్ కు ప్రజా పాలనలో ఇచ్చిన దరఖాస్తు నంబర్ తో అనుసంధానం చేసే కార్యక్రమం ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ హనుమండ్ల జయశ్రీ రఘు ఎలక్ట్రిసిటీ అధికారులు రాంజీ, ప్రకాష్ మరియు వారి సిబ్బంది పాల్గొనడం జరిగింది.

# నేటి నుంచి గాంధీలో సీపీఆర్ ట్రైనింగ్ క్యాంప్

సికింద్రాబాద్ ఫిబ్రవరి 08 (ప్రజామంటలు):



సడెన్ గా గుండెపోటు (కార్డియక్ అరెస్ట్) గురైన వ్యక్తి ప్రాణాలను కాపాడే కార్డియో పల్మనారీ రిస్యూటేషన్ (సీపీఆర్) పై అవగాహన కల్పించి, తగిన శిక్షణ ఇచ్చేందుకు ఈనెల 9, 10 వ తేదీల్లో గాంధీ అలుమ్ని ఎడ్యుకేషన్ సెంటర్ లో గాంధీ మెడికల్ కాలేజీ అలుమ్ని అసోసియేషన్, గాంధీ గ్లోబల్ అలయెన్స్ ఆధ్వర్యంలో ఉచిత సీపీఆర్ ట్రైనింగ్ క్యాంపును నిర్వహించనున్నారు. అకస్మాత్తుగా కార్డియక్ అరెస్ట్ అయి రోడ్డుపై కుప్పకూలిన అత్యవసర పరిస్థితుల్లో కేవలం మన చేతులను ఉపయోగించి బాధితుడి గుండెపై నొక్కినట్లయితే అతడి ప్రాణాలను కాపాడవచ్చని గాంధీ అలుమ్ని ప్రెసిడెంట్ డా.జీ.ఆర్. లింగమూర్తి, సెక్రటరీ డా. ఏవీ.రత్నం తెలిపారు. శుక్ర, శనివారాల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 వరకు నిర్వహించే సీపీఆర్ ట్రైనింగ్ క్యాంపుకు సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్క సిటిజన్ హాజరు కావాలని కోరారు. ఎమర్జెన్సీ పరిస్థితుల్లో ప్రతి ఒక్కరు ఓ డాక్టర్ గా ఎదుటి వారి ప్రాణాలను కాపాడవచ్చన్నారు.

# గృహజ్యోతి సమాచార ధ్రువీకరణకై ఇంటింటికి వస్తున్న విద్యుత్ సిబ్బంది

జగిత్యాల ఫిబ్రవరి 08 (ప్రజామంటలు):

నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్ పరిధిలోని విద్యుత్ వినియోగదారులకు తెలియ చేయునది ఏమనగా గృహజ్యోతి పథకం కోసం మీరు ప్రజా పాలనా కార్యక్రమంలో అందచేసిన సమాచార ధ్రువీకరణ కార్యక్రమం మా సిబ్బంది ద్వారా జరుగుతున్నది. కనుక మీరు దయచేసి ప్రజా పాలన దరఖాస్తు రసీదు , ఆహార భద్రత కార్డు (రేషన్ కార్డు) నెంబర్ మరియు ఆధార్ కార్డు నెంబర్ అందుబాటులో ఉంచుకోగలరు. ఒకవేళ ఏదైనా కారణం వల్ల మా సిబ్బంది వచ్చినపుడు మీరు అందుబాటులో లేనట్లయితే పైన తెలిపిన వివరాలను మీ దగ్గరలో గల విద్యుత్ సహాయ ఇంజనీర్ కార్యాలయంలో కాని , లేదా విద్యుత్ సహాయ గణక అధికారి కార్యాలయంలో కాని మీ వివరాలను ధ్రువీకరించుకోగలరని పర్యవేక్షక ఇంజనీర్ తెలిపారు.

# మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్‌కి ఘన సన్మానం

## రాష్ట్ర గౌడ సంఘ నాయకులు రాములు గౌడ్ ను అభినందించిన మంత్రి

చిగురుమామిడి ఫిబ్రవరి 08 (ప్రజామంటలు):

కరీంనగర్ ఉమ్మడి జిల్లా రామగుండం కు చెందిన రాష్ట్ర గౌడ్ సంఘం నాయకులు ముంజా బుగ్గ రాములు గౌడ్ ఆధ్వర్యంలో గురువారం రోజున హైదరాబాదులో అసెంబ్లీ లో మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ ను మర్యాద పూర్వకంగా కలిసి మంత్రిని రాములు గౌడ్ ఘనంగా సన్మానించారు అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ రాములు గౌడ్ నీ అభినందించారు. ఇదే క్రమంలో ఉమ్మడి జిల్లాకు చెందిన వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, చెన్నూరు ఎం.ఎల్.ఎ. వివేక్ వెంకటస్వామి ఇటివల ఎన్నికైన ఎమ్మెల్సీ బల్మూరు వెంకట్ లను వేరువేరుగా కలిసి శాలువాలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు వారితోపాటు జిల్లా గౌడ సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# రెగ్యులర్ డిఈఓ లను నియమించాలి

## ఎం.ఎల్.సి. టి. జీవన్ రెడ్డి కి ఎస్టియు జిల్లా శాఖ వినతి పత్రం

జగిత్యాల ఫిబ్రవరి 08 (ప్రజామంటలు):



రెగ్యులర్ డి.ఈ ఓ, ఎం.ఇ.ఓ లను నియమించాలని కోరుతూ స్టేట్ టీచర్స్ యూనియన్ ఎస్టియు జగిత్యాల జిల్లా శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మచ్చ శంకర్, బైరం హరికిరణ్ గురువారం ఎమ్మెల్సీ టి.జీవన్ రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎస్టీయు నాయకులు మాట్లాడుతూ రాష్ట్రం ఏర్పడి పది సంవత్సరాలు గడుస్తున్నా ఇంకా రాష్ట్రంలో 26 జిల్లాలకు రెగ్యులర్ డీఈవోలు, 590 మండలాలకు రెగ్యులర్ ఎంఈఓ లు లేక పాఠశాల విద్యాశాఖలో పలు సమస్యలు పరిష్కారం కావడం లేదని , పర్యవేక్షణ లోపిస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. హెడ్మాస్టర్ లే ఎం.ఇ.ఓ లుగా అదనపు బాధ్యతలు నిర్వర్తించడం వల్ల వారు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. అలాగే ప్రతి విద్యార్థికి పునాది లాంటి ప్రాథమిక విద్యాభ్యాసం బలోపేతానికి తరగతికి ఒక ఉపాధ్యాయుని నియమించాలని, అందులో ప్రత్యేకించి గణితం, తెలుగు, ఆంగ్లం, పిఈటి బోధించే ఉపాధ్యాయులు తప్పనిసరిగా ఉండేలా తగు చర్యలు తీసుకోవాలని కోరారు. టెట్ సమస్య పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపి నిలిచి పోయిన పదోన్నతుల ప్రక్రియ పూర్తి చేసి ఖాళీ పోస్టులు భర్తీ చేసేలా ప్రభుత్వంతో చర్చించాలని కోరారు. ప్రతి పాఠశాలకు ఒక స్కావెంజర్ ను నియమించాలని వినతి పత్రంలో కోరారు.

# ఉచిత విద్యుత్ పథకం సర్వే ప్రారంభం



కోరుట్ల ఫిబ్రవరి 08 (ప్రజామంటలు):

తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన రెండు వందల యూనిట్ల ఉచిత విద్యుత్ పథకం సర్వే కోరుట్ల పట్టణం లో ప్రారంభించారు. , ప్రతి ఇంట్లో కుటుంబ సభ్యుల రేషన్, ఆధార్ కార్డుతో సమాచారం సేకరిస్తూ కరెంటు మీటర్ సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకుంటున్నామని వినియోగదారులు కూడా సానుకూలంగా స్పందించి అడిగిన వివరాలను ఇచ్చారని అదే విధంగా ముందుగా ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకున్నవారి వివరాలు సేకరిస్తున్నామని ఇంకా ఎవరైనా ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకొని వారికి కూడా మరల దరఖాస్తు చేయిస్తున్నామని విద్యుత్ అధికారులు తెలిపారు. అధికారులు మాట్లాడుతూ. ఇంటి యజమాని తో పాటు అద్దెకు ఉన్న వారు కూడా ఈ పథకం కు అర్హులు అవుతారని వారి దగ్గరి నుండి రేషన్ కార్డు నెంబరు ఆధార కార్డు నెంబరు తీసుకొని దరఖాస్తు పూర్తి చేయడం జరుగుతుందని అన్నారు. ఈ సర్వేలో జగిత్యాల జిల్లా సూపరిండెంట్ ఇంజనీర్ సత్యనారాయణ, డిఈ తిరుపతి, ఏడి అంజన్ రావు, ఏవో వసంతరావు, జేవో ఉత్తం నాయక్, ఏఈ శ్యాం,లైన్ ఇన్స్పెక్టర్ ఆంజనేయులు మరియు లైనమెన్, కరెంటు సిబ్బంది పాల్గొన్నారు.

## జగదాలయ ఆధ్యాత్మిక బృందం ఆధ్వర్యంలో

# అంగరంగ వైభవంగా శ్రీ సీతారామ కళ్యాణము, పట్టాభిషేకము

జగిత్యాల ఫిబ్రవరి 08 ( ప్రజామంటలు):



జిల్లా కేంద్రంలో జగదాలయ ఆధ్యాత్మిక బృందం అధ్వర్యంలో అంగరంగ వైభవంగా శ్రీ సీతారామ కళ్యాణము, పట్టాభిషేకము జరిగింది ఈ సందర్భంగా అయోధ్య 'బాలరాముడు' ప్రాణ ప్రతిష్ఠ జరిగిన శుభసందర్భముగా జగిత్యాలలో మూడురోజుల పాటు వైభవంగా అఖండ హనుమాన్ చాలీసా ఆహోరాత్ర పారాయణం మహాయజ్ఞం, లక్ష తమలపాకులతో ఆంజనేయ స్వామి వారికి అర్చన నిర్వహించారు. గురువారం శ్రీ శృంగేరి శారదాపీఠ ఆస్థాన పౌరాణికులు, భారతీ తీర్థ పురస్కార గ్రహీత, డా.బాచంపల్లి సంతోష్ కుమార్ శాస్త్రి, మరియు నంబి వేణుగోపాల చారి కౌశిక గార్ల చే వాసవి గార్డెన్స్ లో ప్రత్యేకంగా అలంకరించిన మండపంలో శ్రీ సీతారామ కళ్యాణము పట్టాభిషేకము, వేద బ్రాహ్మణోత్తములచే నిర్వహించారు.

# మహాలక్ష్మి పథకంపై శిక్షణ కార్యక్రమం

వేలేర్ ఫిబ్రవరి 08 (ప్రజామంటలు):



వేలేర్ మండల కేంద్రంలోనీ ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో లక్ష్మీ ప్రసన్న ఆధ్వర్యం లో ప్రభుత్వ నూతన ప్రారంభ పథకం మహాలక్ష్మి లో భాగంగా కొందరు వారి గ్యాస్ కన్స్యూమర్ నెంబర్లను దరఖాస్తు ఫారంలలో తప్పుగా నమోదు చేయడం వల్ల అవి గ్యాస్ కంపెనీ డాటాతో సరిపోవడం లేదు. కావున వీటిని సరిచేసి పథకం అర్హులకు నష్టం వాటిల్లకుండా ప్రభుత్వం మండల స్థాయిలో ఎంపీడీవో పర్యవేక్షణలో గ్రామంలో పంచాయతీ కార్యదర్శి పర్యవేక్షణలో అంగన్వాడీలు, వివోఏలు ఆశాలు ఇతర గ్రామపంచాయతీ సిబ్బందితో వాటిని వెరిఫికేషన్ చేయాలని ఎంపీడీవో లక్ష్మీ ప్రసన్న అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ విమల గ్రామ కార్యదర్శిలు పాల్గొన్నారు.

# ఢిల్లీ సరిహద్దుల్లో మహాధర్నా..

న్యూఢిల్లీ: పంజాబ్ రైతులు ఫిబ్రవరి 13, మంగళవారం ఢిల్లీ సరిహద్దుల్లో తలపెట్టిన మహాధర్నా నిరసనని అపేందుకు కేంద్ర మంత్రులు పియూష్ గోయల్, అర్జున్, నిత్యానంద రాయ్ చండీగఢ్ తరలివెళ్లారు. అక్కడ రైతు నేతలతో పరిష్కారం కోసం చర్చలు జరుపుతారని సమాచారం. మూడేళ్ల క్రితం వ్యవసాయం చట్టాలను వ్యతిరేకిస్తూ.. పంజాబ్ రైతులు నెలల తరబరి చేసిన ధర్నా వల్ల మోదీ ప్రభుత్వం చాలా సమస్యలు ఎదుర్కోవాల్సి వచ్చింది. మరో మూడు నెలల్లో లోక్ సభ ఎన్నికల దృష్ట్యా మరోసారి అలాంటి ధర్నా జరగకుండా ఉండేందుకు బీజేపీ మంత్రులు.. రైతుల వద్దకు చర్చలు జరిపేందుకు పరుగులు తీశారు. కనీస మద్దతు ధర కోసం ప్రత్యేక చట్టం, పంట బీమా, రైతు బీమాలు ప్రకటించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. డిమాండ్లు కోసం ఢిల్లీ సరిహద్దులలో రైతులు ఫిబ్రవరి 13న రైతు ట్రాక్టర్ మార్చ్ నిరసన భారీ స్థాయిలో చేపట్టనున్నారు. అలాగే 2020లో వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా చేసిన ధర్నాలో రైతులపై పెట్టిన కేసులను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. మరోవైపు ఢిల్లీ-నోయిడా సరిహద్దులో రెండు రోజులుగా ఉత్తర ప్రదేశ్ రైతుల నిరసన జరుగుతోంది. ప్రభుత్వం తీసుకున్న తమ భూములకు బదులుగా పరిహారం పెంచాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

prajamantalau daily pages (09-02-24)_times of varha main (13-2).qxd 2/8/2024 10:21 PM Page 5



# ప్రజలకు పోలీసు శాఖ అండగా ఉంటుంది

### ఎస్పి కిరణ్ ఖరే

భూపాలపల్లి జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 08 (ప్రజామంటలు):



జిల్లా పోలీసు శాఖ నేతృత్వంలో జరిగిన మెగా వైద్య శిబిరం విజయవంతమైంది. జిల్లా పరిధిలోని పలిమెల, మహా ముత్తారం, భూపాలపల్లి, మండలాల్లో వివిధ వ్యాధులతో బాధపడుతున్న గొత్తికోయ గుంపుల నుంచి, అటవీ ప్రాంత గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ శిబిరానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్పి కిరణ్ ఖరే మాట్లాడుతూ అన్నింటి కన్నా ఆరోగ్యమే మహాభాగ్యమన్నారు. హైదరాబద్ మలక్ పేట యశోద ఆస్పత్రి సౌజన్యంతో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ సహకారంతో మెగా వైద్య శిబిరం నిర్వహించినట్లు ఎస్పి తెలిపారు. మారుమూల ప్రజల ఆరోగ్యం పట్ల పోలీసు శాఖ ప్రత్యేక శ్రద్ధ వహిస్తుందన్నారు. గురువారం మహాముత్తారం మండలం పెగడపల్లి గ్రామంలో ఉచిత మెడికల్ క్యాంపు కు దాదాపు 1000 మంది తరలివచ్చి అన్ని రకాల పరీక్షలు చేయించుకున్నారని, మెడిసిన్స్ ఉచితంగా పంపిణీ చేయడంతో పాటు, ఉచిత బోజన వసతి కల్పించామని, అలాగే చలి తీవ్రత ను తట్టుకోవడానికి 100 మంది గుత్తి కోయలకు దుప్పట్లు పంపిణీ చేశామని పేర్కొన్నారు. ఇంకా రాబోవు కాలంలో గుత్తి కోయల అభ్యున్నత్తికై అనేక కార్యక్రమాలు పోలీస్ డిపార్మెంట్ తరపున చేపడతామని ఎస్పి తెలిపారు. అటవీ ప్రాంత, గుత్తి కోయల కుటుంబాలకు అవసరమైన సాయం అందించాలని స్థానిక పోలీసులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి అదనపు ఎస్పీ నరేష్ కుమార్, కాటారం డిఎస్పీ జి రామ్మోహన్ రెడ్డి, డిఎంహెచ్వో మధుసూధన్, హైదరాబాద్ మలక్ పేట యశోద హాస్పిటల్స్ డాక్టర్స్ బృందం, ముత్తారం, ఎంపీడీవో జడ్పిటిసి, ఎంపీటీసీ, కాటారం, భూపాలపల్లి, మహాదేవ్ పూర్ సిఐలు అర్జున్ రావు, నరేష్ కుమార్, రాజేశ్వర్ రావు , భూపాలపల్లి డాక్టర్ లు కిరణ్, శ్రీనివాస్, కాటారం సబ్ డివిజన్ పరిధిలోని ఎస్ఐలు, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఇరాన్‌పై అమెరికా ప్రతీకార దాడులు

### దాడుల్లో హిజ్బుల్లా కమాండర్ హతం

**బాగ్దాద్** ముగ్గురు సైనికుల మరణం తర్వాత ఇరాన్ అనుకూల మిలీషియాపై అమెరికా రక్తపాత దాడులను కొనసాగిస్తోంది. తాజా దాడిలో, ఇరాక్ రాజధాని బాగ్దాద్‌లో డ్రోన్ దాడిలో కారులో ప్రయాణిస్తున్న ఇరాన్ అనుకూల ఖతైబ్ హిజ్బుల్లా టాప్ కమాండర్‌ను అమెరికా చంపేసింది. హిజ్బుల్లా కమాండర్‌పై ఈ దాడికి అమెరికా తన రహస్యహెల్‌ఫైర్ క్షిపణిని ఉపయోగించిందని సమాచారం. ఈ క్షిపణితో అమెరికా అల్‌ఖైదా నాయకుడు అమాన్ అల్ జవహిరిని హతమార్చింది. ఈ క్షిపణికి కత్తిలా కనిపించే బ్లేడ్‌ను అమర్చినట్లు సోషల్ మీడియాలో షేర్ చేసిన చిత్రాలు చూపిస్తున్నాయి. ఇరాక్‌లోని మిలిటెంట్ల స్థావరాలపై బుధవారం జరిపిన డ్రోన్ దాడిలో ఇరాన్ మద్దతున్న ఓ కీలక కమాండర్ హతమైనట్లు అమెరికా సైన్యం ప్రకటించింది. జోర్డాన్‌లో ఇటీవల ముగ్గురు అమెరికా సైనికుల మరణానికి ప్రతీకారంగానే తాము ఈ దాడి చేశామని వివరించింది. యూఎస్ దళాలపై దాడికి ప్రణాళిక, దాడికి కతైబ్ హిజ్బుల్లా కమాండర్ ప్రత్యక్ష బాధ్యత వహిస్తారని యూఎస్ మిలిటరీ ఒక ప్రకటన విడుదల చేసింది. ఈ దాడిలో పౌరులెవరూ చనిపోలేదని అమెరికా తెలిపింది. ఈ ఘటనలో సామాన్య పౌరులు మరణించిన ఆనవాళ్లు లేవని ఓ సైనికాధికారి వెల్లడించారు. కేవలం కారు మాత్రమే దగ్ధమైనట్లు చిత్రాల్లో స్పష్టంగా కనిపిస్తోందన్నారు. బహుశా ఆర్9ఎక్స్ అనే హెల్‌ఫైర్ రకం క్షిపణిని ఉపయోగించి ఉంటారని ఓ అమెరికా మాజీ సైనికాధికారి తెలిపారు. పేలుడు తీవ్రత ఇతర ప్రాంతాలకు విస్తరించకుండా జాగ్రత్తలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. 2020లో ఇరాన్ రెవల్యూషనరీ గార్డ్స్ కీలక కమాండర్ ఖాసీమ్ సులేమానీని సైతం అమెరికా ఇదే తరహాలో హతమార్చింది. రహస్య క్షిపణి గురించి అమెరికా చెప్పలేదు.. ది డ్రైవ్ నివేదిక ప్రకారం.. అమెరికా క్షిపణిని ఉపయోగించింది. దానికి బ్లేడ్లు జోడించబడ్డాయి. సరిగ్గా అలాంటి దాడుల కోసమే ఈ క్షిపణిని రూపొందించారు. అందులో అమర్చిన బ్లేడ్ కారులో లేదా ఇతర వాహనంలో కూర్చున్న లక్ష్యాన్ని చంపేస్తుంది. ఇది పరిసరాలకు చాలా తక్కువ నష్టం కలిగిస్తుంది. బరాక్ ఒబామా హయాంలో ఈ క్షిపణి తయారు చేయబడింది. ఈ క్షిపణి విషయంలో అమెరికా ఇంకా మౌనంగానే ఉంది. యూఎస్ మిలిటరీ అనేక ఇతర రకాల హెల్‌ఫైర్ క్షిపణుల ఉనికిని బహిరంగంగా అంగీకరించింది. ఈ క్షిపణులను డ్రోన్ల నుంచి మాత్రమే ప్రయోగిస్తారు. దీనిని అమెరికన్ స్పెషల్ ఆపరేషన్స్ ఫోర్స్ లేదా %జ×ూ% నిర్వహిస్తుంది. ఈ క్షిపణి సాయంతో అమెరికా ఇప్పటి వరకు అల్ ఖైదాతో పాటు పలువురు ఉగ్రవాదులను మట్టుబెట్టింది. నివేదిక ప్రకారం, 2022 సంవత్సరంలో, సీఐఏ ఈ క్షిపణి ద్వారా అల్ ఖైదా టాప్ కమాండర్ అమాన్ అల్ జవహిరిని చంపింది.

## కేంద్రంపై యుద్ధానికి ఏకమైన దక్షిణ భారతం

### సర్కారు వైఖరిపై నిరసనల వెల్లువ

న్యూఢిల్లీ :

నిధుల కేటాయింపులో వివక్ష, నిర్లక్ష్యంపై బీజేపీ నేతృత్వంలోని కేంద్రానికి వ్యతిరేకంగా కేరళ, తమిళనాడు తమ పొరుగు రాష్ట్రమైన కర్ణాటకతో కలిసి నిరసన వ్యక్తం చేశాయి. ఈ వ్యవహారానికి వ్యతిరేకంగా కేరళకు చెందిన లెఫ్ట్ ఫ్రంట్, తమిళనాడు డీఎంకే గురువారం ఢిల్లీలో నిరసనలు చేపట్టనున్నాయి. కేరళ లెఫ్ట్ ఫ్రంట్ ఆందోళనకు ముఖ్యమంత్రి పినరయి విజయన్ నాయకత్వం వహించనున్నారు. డీఎంకె అధినేత ఎంకె స్టాలిన్ మద్దతు ఇవ్వనున్నారు. దేశ రాజధానిలో ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే నిరసనలో లెఫ్ట్ ఫ్రంట్ మంత్రులు, పార్లమెంటేరియన్లు, శాసనసభ్యులు కూడా పాల్గొంటారు.

పన్నుల పంపిణీలో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతోందని ఆరోపిస్తూ బుధవారం కర్ణాటక కాంగ్రెస్ కురువృద్ధుడు, ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఆయన డిప్యూటీ డీకే శివకుమార్, ఇతర రాష్ట్ర మంత్రులతో కలిసి ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిరసన చేపట్టారు. రాష్ట్రానికి కేటాయించిన నిధులను విడుదల చేశారని ఆరోపిస్తూ కేంద్ర ప్రభుత్వంపై కేరళ ప్రభుత్వం చట్టపరమైన చర్యలకు పూర్తి మద్దతును అందజేస్తామని ఎంకే స్టాలిన్ మంగళవారం (ఫిబ్రవరి 6) పినరయి విజయన్‌కు లేఖ రాశారు. డీఎంకె ఆందోళనలో పాల్గొంటుందని, ఆ పార్టీ నేతలు నల్ల బట్టలు ధరించి ఉంటారని లేఖలో పేర్కొన్నారు.

కోఆపరేటివ్ ఫెడరలిజాన్ని స్థాపించి, రాష్ట్ర స్వయంప్రతిపత్తిని తిరిగి పొందే వరకు మా గొంతు విశ్రమించదని తమిళనాడు ముఖ్యమంత్రి అన్నారు. పార్లమెంట్ కాంప్లెక్స్‌లోని గాంధీ విగ్రహం దగ్గర సీనియర్ నేత టీఆర్ బాలు నేతృత్వంలో డీఎంకే 'నల్ల చొక్కా' ప్రదర్శన జరగనుంది. కేంద్ర ప్రభుత్వం "2024-25 మధ్యంతర బడ్జెట్‌లో తమిళనాడుకు అవసరమైన నిధులు కేటాయించకపోవడానికి" వ్యతిరేకంగా నిరసన జరగనుంది. డిసెంబరు 2023లో అపూర్వమైన వర్షాల కారణంగా వరదలు సంభవించిన తరువాత, దాదాపు రూ. 37,000 కోట్ల మేరకు సహాయం కోరుతూ తమిళనాడు ప్రాతినిధ్యంపై ఎటువంటి ప్రకటన చేయలేదని ఎంకే స్టాలిన్ పార్టీ పేర్కొంది. "అలాగే, తమిళనాడుకు నిధుల కేటాయింపుపై మధ్యంతర బడ్జెట్‌లో ఎటువంటి ప్రకటన లేదు. మదురైలో ఎయిమ్స్ ఏర్పాటుతో సహా అభివృద్ధి ప్రాజెక్టులు ప్రకటించలేదు" అని డీఎంకె పేర్కొంది. డీఎంకె ఎంపీ టీఆర్‌బాలు మాట్లాడుతూ.. కాంగ్రెస్‌తో సహా కూటమి పార్టీలకు చెందిన పార్టీ ఎంపీలు ఈరోజు ఢిల్లీలో ఆందోళనలో పాల్గొనాలని అభ్యర్థించారు.

## మహారాష్ట్ర కాంగ్రెస్‌కు వరుస షాకులు

### కాంగ్రెస్ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి మాజీ మంత్రి రాజీనామా

మహారాష్ట్ర,ఫిబ్రవరి8(ఆర్ఎన్ఎ): మహారాష్ట్ర కాంగ్రెస్‌కు వరుస షాకులు తగులుతున్నాయి. కేంద్రంలో వరుసగా పదేండ్లపాటు అధికారానికి దూరంగా ఉండడంతో పాటు సాధారణ ఎన్నికల్లో మళ్లీ గెలిచే అవకాశం లేకపోవడం, రాష్ట్రంలో బీజేపీ కూటమికి ఎదురులేకపోవడంతో పార్టీ సీనియర్ నాయకులు ఒక్కొక్కరిగా తమదారి తాము చూసుకుంటున్నారు. కొన్ని రోజుల క్రితం మాజీ మంత్రి మిలింద్ దేవరా కాంగ్రెస్‌కు గుడ్‌బై చెప్పగా.. మరో సీనియర్ నాయకుడు బాబా సిద్ధిక్ కాంగ్రెస్ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. 48 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీ సభ్యుడిగా ఉన్న ఆయన.. ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు గురువారం ప్రకటించారు. ఈ మేరకు ట్విట్టర్ వేదికగా ప్రకటించారు. "నేను యుక్తవయసులో భారత జాతీయ కాంగ్రెస్ పార్టీలో చేరాను ఇది 48 సంవత్సరాల సుదీర్ఘ ప్రయాణం. ఈ రోజు నేను భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి తక్షణమే రాజీనామా చేస్తాను. ఈ ప్రయాణంలో భాగమైన ప్రతి ఒక్కరికీ నేను కృతజ్ఞతలు తెలుపుతున్నాను." అని ట్విట్టర్‌లో ప్రకటించారు. మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ నేతృత్వంలోని పార్టీలో సిద్ధిక్ చేరతారని భావిస్తున్నట్లు నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్‌సిపి) నాయకులు చెప్పిన కొద్ది రోజులకే గురువారం నాటి పరిణామం జరిగింది.

# ఎస్సీ వర్గీకరణకు కేంద్రం మద్దతు

# వివక్షకు గురైన వర్గాలకు న్యాయం జరగాలి

### ఏకగ్రీవంగా సుప్రీంకోర్టుకు తెలిపిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు



**న్యూఢిల్లీ :** తమ విభేదాలను పక్కనబెట్టి, షెడ్యూల్డ్ కులాల కోటాలో రిజర్వేషన్లు నిరుపేదలు, అత్యంత బలహీన వర్గాలకు రిజర్వేషన్లలో ఎక్కువ వాటాను అందజేస్తాయని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బుధవారం ఏకగ్రీవంగా సుప్రీంకోర్టుకు తెలిపాయి. ఎస్సీ, ఎస్టీ వర్గాలకు కల్పించిన రిజర్వేషన్లను ఉపవర్గీకరించాల్సిన ఆవశ్యకత ఉందని కేంద్రం అభిప్రాయపడింది. సామాజిక స్థితిని మెరుగుపడిన వ్యక్తులు రిజర్వేషన్‌లో ఎక్కువ వాటా పొందకుండా నిరోధించబడతారని పేర్కొంది. ఎస్సీ, ఎస్టీ కోటా రిజర్వేషన్ల ఉపవర్గీకరించే అధికారం రాష్ట్రాలకు లేదన్న 2004 నాటి సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం తీర్పును సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై ఏడుగురు సభ్యుల విస్తృత ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ కేసును అటార్నీ జనరల్ ఆర్ వెంకటరమణి, సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్, సీనియర్ న్యాయవాదులు వాదించారు. కేంద్రం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు. ఎస్సీ, ఎస్టీ కోటా రిజర్వేషన్ల ఉపవర్గీకరణ రాజ్యాంగంలోని ఆర్టికల్ 14ను ఉల్లంఘించడమేనని చిన్నయ్య తీర్పు పేర్కొంది. ఆర్టికల్ 341 ప్రకారం ప్రెసిడెన్షియల్ లిస్ట్‌లో చేర్చిన ఎస్సీ, ఎస్టీ జాబితాల్లోని కులాల్లో మార్పులు, చేర్పులు చేసే అధికారం పార్లమెంటుకు మాత్రమే ఉందని చిన్నయ్య తీర్పు స్పష్టం చేసింది.

అయితే, 2004 తీర్పులో లోపాలున్నాయని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు. ఎస్సీ జాబితాలోని కులాల్లోనూ ఆర్థిక, సామాజిక, విద్యాపరమైన వ్యత్యాసాలు ఉన్నాయని వెల్లడించారు. వారిలోనూ బాగా వెనుకబడిన వారికి ప్రభుత్వ ఉద్యోగాలు, విద్యా సంసల్లో ప్రవేశాలు దక్కేలా రిజర్వేషన్లను సహేతుకంగా పునఃపంపిణీ చేయాల్సిన ఆవశ్యకత ఉందని తుషార్ మెహతా వివరించారు. విస్తృత ధర్మాసనంలో జస్టిస్ బి.ఆర్.గవాయి, జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ బేలా ఎం.త్రివేది, జస్టిస్ పంకజ్ మిత్తల్, జస్టిస్ మనోజ్ మిశ్ర, జస్టిస్ సతీశ్ చంద్ర మిశ్ర సభ్యులుగా ఉన్నారు. చిన్నయ్య తీర్పు షెడ్యూల్డ్ కులాల మధ్య తీవ్ర అసమానతలను విస్మరించిందని అటార్నీ జనరల్ ఆర్ వెంకటరమణి అన్నారు. కేంద్రం, పార్లమెంటు ఒక వర్గాన్ని ఎస్సీ జాబితాలో చేర్చిన తర్వాత, సమూహాల మధ్య కోటాను హేతుబద్ధీకరించడం ద్వారా ఈ వర్గాల మధ్య అసమానతలను తొలగించడానికి చర్యలు తీసుకునే స్వేచ్ఛను రాష్ట్రాలకు ఇవ్వాలని అటార్నీ జనరల్ అన్నారు. ఎస్సీ వర్గాల ఉప-వర్గీకరణకు కేంద్ర ప్రభుత్వం మద్దతు ఇవ్వడంపై సందిగ్ధతకు ఆస్కారం లేకుండా చేస్తూ, వందల ఏళ్లుగా వివక్షకు గురవుతున్న వారికి సమానత్వం కల్పించేందుకు వెనుకబడిన తరగతులకు రిజర్వేషన్‌ను కేంద్రం నిశ్చయాత్మక చర్యగా పరిగణిస్తోందని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా చెప్పారు. రిజర్వేషన్ విధానాన్ని ప్రకటించేందుకు కట్టుబడి ఉన్నామని కేంద్రం తరఫున తుషార్ మెహతా సుప్రీంకోర్టులో తెలిపారు. సామాజిక, ఆర్థిక, విద్య స్థాయిలను అనుసరించి ఎస్సీ, ఎస్టీ వర్గాల్లోని అన్ని కులాలు ఏకస్థితిని కలిగి ఉన్నాయని భావించలేమని సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం పేర్కొంది. ఓ ప్రత్యేక ప్రయోజనం కోసం రాజ్యాంగంలో ఈ రెండు వర్గాలు సజాతీయతను కలిగి ఉన్నాయని పేర్కొన్నారని.. అన్నింటిని దానికి వర్తింపజేయలేమని పేర్కొంది. ఈ కోణంలో 2004 తీర్పులోని అంశాలను పరిశీలించాల్సి ఉందని ధర్మాసనం వెల్లడించింది. రాష్ట్రాల తరఫున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ వాదనలు వినిపించారు. ఆయన కూడా అణచివేతకు గురైన ఎస్సీ, ఎస్టీ కేటగిరీల్లోని కులాల మధ్య కూడా సమానత్వానికి కృషి జరగాల్సిన అవసరం ఉందన్నారు. ఎస్సీల్లోని అన్ని సామాజిక వర్గాల స్థితిగతులు ఒకే తీరుగా ఉన్నాయని చెప్పలేమని తెలిపారు. ఈ విషయంపై ఇవాళ(గురువారం) కూడా సుప్రీంకోర్టులో విచారణ కొనసాగనుంది.

## ప్రెస్ టీమ్ అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నికైన గోవింద్ జైన్

### ఉపాధ్యక్షులుగా శుభాష్ గౌడ్, కమ్మరి సంతోష్

రేగోడు ఫిబ్రవరి 08 (ప్రజామంటలు):



రేగోడు మండల ప్రెస్ టీమ్ నూతన కార్యవర్గాన్ని సభ్యులందరూ కలిసి గురువారం ఎన్నికలు నిర్వహించారు. సభ్యులందరి ఆమోదం మేరకు ఏకగ్రీవంగా ప్రెస్ టీమ్ అధ్యక్షునిగా గోవింద్ జైన్ ను ఎన్నుకున్నారు. గౌరవ ఆధ్యక్షులుగా గున్న ప్రభాకర్ గుప్తా, ఉపాధ్యక్షులు సుభాష్ గౌడ్, కమ్మరి సంతోష్, ప్రధాన కార్యదర్శిగా వడ్ల సంతోష్ కుమార్, సమాచార కార్యదర్శిగా రమేష్ నాయక్, కోశాధికారిగా షాహేద్ అలీ, ఉపకార్యదర్శి గా ఎస్. సంగమేశ్వర్. సహాయ కార్యదర్శి గా భాస్కర్ రెడ్డి,రాజు సలహాదారులు రాధకిషన్, సంతోష్ రావు, కార్యనిర్వాహకులు రాజు, సాగర్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం ప్రెస్ టీమ్ అధ్యక్షులు గోవింద్ జైన్ మాట్లాడుతూ.... నాపై నమ్మకంతో రేగోడ్ మండల ప్రెస్ టీమ్ అధ్యక్షునిగా 21 మంది సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్న ప్రెస్ మిత్రులందరికి ధన్యవాదాలు తెలిపారు. అదేవిధంగా జర్నలిస్టుల సమస్యలను పరిష్కరిస్తానని అన్నారు. ప్రతి ఒక్కరికి అందుబాటులో ఉంటానని అన్నారు. జర్నలిస్టుల హక్కుల సాధన కోసం పోరాటం చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ టీమ్ సభ్యులు. ఎస్. సంగమేశ్వర్, నర్సింలు పాల్గొన్నారు.

## కోట కిషన్ ఆత్మీయ సమ్మేళనం



మెట్ పల్లి ఫిబ్రవరి 08 (ప్రజామంటలు):

మెట్ పల్లి పట్టణంలోని ఆర్.బి. ఫంక్షన్ హాల్ లో బుధవారం రాత్రి కోట కిషన్ ఆర్యవైశ్యుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కోట కిషన్ తనయుడు కోట సుమన్ నూతనంగా ఆర్యవైశ్య పట్టణ అధ్యక్షునిగా ఎన్నికైన మైలారపు రాంబాబు ని రాంబాబు నియమించిన వివిధ సంఘాల అధ్యక్ష కార్యదర్శులు కోశాధికారులను, సంయుక్త కార్యదర్శిలను, ఆర్గనైజింగ్ సెక్రెటరీ లను, గౌరవ అధ్యక్షులను, వాడకట్టు సంఘ అధ్యక్షులను, ఆర్యవైశ్య పాత్రికేయులను, కోట సపరివారానికి పురోహితులు మారుతి శర్మ, భాస్కర్ శర్మ, పూలదండలు శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం వివిధ సంఘాల సభ్యులు గౌరవ అధ్యక్షులు కోట సుమన్ ని కూడా పూలదండ శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గౌరవ అధ్యక్షులు మహజన్ నర్సింలు మాట్లాడుతూ సంఘ సభ్యులందరూ సంఘటితంగా ఉండి ముందుకెళ్తేనే సంఘ అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. ఆర్యవైశ్య సంఘ పట్టణ అధ్యక్షులు మైలారపు రాంబాబు మాట్లాడుతూ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయాన్ని ఆధునికరణ చేయడానికి అందరి సహకారంతో ముందుకెళ్తానని ఆర్యవైశ్య సంఘ అభివృద్ధికి ఎల్లవేళలా కృషి చేస్తానని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ గౌరవ అధ్యక్షులు మైలారపు లింబాద్రి, దొంతుల రాజకుమార్, సంఘ నాయకులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## ఢిల్లీలో ఆందోళన చేపట్టిన కేరళ ప్రభుత్వం

### మద్దతు తెలిపిన ఢిల్లీ ముఖ్యమంత్రి, పంజాబ్ సీఎం

### మోడీ ప్రభుత్వంపై ధ్వజమెత్తిన కేజ్రీవాల్

**న్యూఢిల్లీ :** కేంద్రం తీరుకు నిరసనగా ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు ఢిల్లీ వేదికగాఆందోళనకు దిగుతున్నాయి. జంతర్‌మంతర్ దగ్గర బుధవారం కాంగ్రెస్ ఆందోళన చేపట్టగా.. గురువారం కేరళ ప్రభుత్వం నిరసనకు దిగింది. నిధుల కేటాయింపు విషయంలో కేంద్రం అన్యాయం చేస్తోందంటూ కేరళ ఆరోపించింది. కేంద్రం తీరును నిరసిస్తూ కేరళ సర్కార్ ఢిల్లీలో ఆందోళన చేపట్టింది. దీనికి ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్, పంజాబ్ సీఎం భగవంత్ మాన్ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా కేజ్రీవాల్ మాట్లాడుతూ.. మోడీ ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌ను ఒక కొత్త ఆయుధంగా మార్చుకుందని ఆరోపించారు. కోట్లాది ప్రజలకు ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రతిపక్ష ప్రభుత్వాలపై కేంద్రం అస్త్రంగా ప్రయోగిస్తోందని మండిపడ్డారు. గతంలో నేరం రుజువైతే జైలుకు పంపేవారు. కానీ.. ప్రస్తుతం జైలుకు పంపాక వారిపై ఏ కేసు పెట్టాలా అని ఆలోచిస్తున్నారన్నారు. ఒకవేళ భవిష్యత్తులో ఆప్‌కి కేంద్రంలో అధికారంలోకి వస్తే మాత్రం ఇదే సీన్ రిపీట్ అవుతుందని హెచ్చరించారు. ఇప్పుడు బీజేపీ చేసినట్లుగానే మేముచేస్తామని పేర్కొన్నారు. జార?ండ్ మాజీ సీఎం హేమంత్ సోరెన్‌పై కేసు నమోదు చేయకముందే ఆయన్ను జైల్లో పెట్టారని ఆరోపించారు. కొద్ది కాలంలోనే తనతో సహా కేరళ సీఎం పినరయి విజయన్, తమిళనాడు సీఎం స్టాలిన్, కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను కూడా జైల్లో పెట్టి ఆయా ప్రభుత్వాలను పడగొట్టే అవకాశం లేకపోలేదని కేజ్రీవాల్ వ్యాఖ్యానించారు కేంద్ర నిధుల విషయంలో కేరళకు అన్యాయం జరుగుతోందని సీఎం పినరయి విజయన్ దేశ రాజధానిలో ఆందోళనకు దిగారు. ఈ నిరసనలో సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా, సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి సహా పలువురు ముఖ్య నేతలు పాల్గొన్నారు.

## జైలులో మహిళా ఖైదీలకు గర్భం

### తీవ్రమైన సమస్యన్న కలకత్తా హైకోర్టు

**కలకత్తా:** జైలులో ఉన్న మహిళా ఖైదీలు జైలులోనే గర్భం దాలుస్తున్నారని కలకత్తా హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం(పిల్) దాఖలైంది. కస్టడీలో ఉన్న సమయంలోనే మహిళా ఖైదీలు గర్భం దాల్చినట్లు కోర్టుకు సమాచారం అందినట్లు వార్తలు వస్తున్నాయి. ఈ సమస్య తీవ్రమైనదిగా పరిగణిస్తున్నట్లు కోర్టు వ్యాఖ్యానించింది. ఇప్పటి వరకు జైళ్లలో కనీసం 196 మంది శిశువులు జన్మించారని పిల్ దాఖలు చేసిన వ్యక్తి హైకోర్టుకు తెలియజేశారు. జైలు లోపల భద్రతను పర్యవేక్షించాలని కోర్టును కోరారు. మహిళా ఖైదీలు ఉండే ఎన్‌క్లోజర్లలో, కరెక్షన్ హోమ్స్‌లో పురుష ఉద్యోగులను పూర్తిగా నిషేధించాలని కోరారు. చీఫ్ జస్టిస్ టిఎస్ శివజ్ఞానం మరియు జస్టిస్ సుప్రతిమ్ భట్టాచార్యలతో కూడిన ధర్మాసనం ఈ అంశాన్ని 'తీవ్రమైన సమస్య'గా పేర్కొంది. ఈ విషయాన్నింటినీ క్రిమినల్ కేసులు విచారించే బెంచ్‌కి బదిలీ చేయడం సరైందని ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. జైలులో ఉన్న మహిళా ఖైదీలు గర్భం దాల్చడం ఇక్కడ చర్చనీయాంశంగా మారింది. ప్రస్తుతం పశ్చిమ బెంగాల్లోని వివిధ జైళ్లలో 196 మంది చిన్నారులు ఉన్నారని అమికస్ క్యూరీ హైకోర్టుకు తెలిపారు. ఇటీవల, తాను కరెక్షన్ హోమ్స్ ఇన్‌స్పెక్టర్ జనరల్(స్పెషల్), లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శితో మహిళా కరెక్షన్ హోమ్స్‌ని సందర్శించిన సమయంలో ఒక గర్భవతితో పాటు, 15 మంది ఇతర మహిళా ఖైదీలు వారి పిల్లలతో ఉన్నట్లు కనుగొన్నానని, వారంతా జైలులో జన్మించారని కోర్టుకు వెల్లడించారు. దీనిపై సోమవారం మరోసారి విచారణ జరిగే అవకాశం ఉంది.

prajamantalau daily pages (09-02-24)_times of varha main (13-2).qxd 2/8/2024 10:21 PM Page 6



## అనసూయ సినిమా అరి కి డిమాండ్



సినిమాలో కంటెంట్ ఉంటే చాలు.. అది తక్కువ బడ్జెట్ చిత్రమైనా కూడా దానిని రీమేక్ చేయడానికి ఇతర భాషల స్టార్లు ముందుకు వస్తారు. ప్రస్తుతం అనసూయ లీడ్ రోల్‌లో నటిస్తున్న మూవీకి కూడా అదే పరిస్థితి ఏర్పడింది. యాంకర్ నుండి యాక్టర్‌గా మారిన అనసూయ చేతిలో పలు సినిమాలు ఉండగా.. అందులో 'అరి' కూడా ఒకటి. ఈ సినిమా ఇంకా ప్రేక్షకుల ముందుకు రాకముందే కోలీవుడ్, బాలీవుడ్ నుండి దీని రీమేక్ కోసం పోటీ మొదలయ్యిందని వార్తలు వైరల్ అవుతున్నాయి. ఇప్పటికే దీని రీమేక్ రైట్స్ కోసం ఒక బాలీవుడ్ స్టార్ లైన్‌లో ఉండగా.. తాజాగా ఒక కోలీవుడ్ హీరో కూడా ఇందులో యాడ్ అయ్యాడని సమాచారం. ద్రుచులు, అరిషడ్వర్గాలు అనే కొత్త రకం కాన్సెప్ట్‌తో 'అరి' తెరకెక్కింది. ఈ సినిమాలో వినోద్ వర్మ లీడ్ రోల్‌లో నటిస్తున్నాడు. మనుషుల్లో ఉండే లోతైన కోరికలను తీర్చే పాత్రలో వినోద్ వర్మ కనిపించనున్నాడు. ఇక కోరికలు తీరాలి అనుకునేవారు ఒక్కొక్కరుగా వచ్చి తనకు చెప్పుకుంటారు. అదే సమయంలో వారందరి చేత నేరాలకు పాల్పడేలా చేస్తాడు వినోద్ వర్మ. ఆ తర్వాత వారి జీవితాల్లో ఎలాంటి మార్పులు వస్తాయి, ఎలా మలుపులు తిరుగుతాయి అనేది మిగిలిన కథ. అలా కోరిక తీరడం కోసం తన వద్దకు వచ్చే ఒక పాత్రలో అనసూయ భరద్వాజ్ కనిపించనుంది. ఇప్పటికే ఈ సినిమా ట్రైలర్ విడుదల అవ్వగా.. మూవీ రిలీజ్‌కు మాత్రం సమయం పడుతుంది. ఇంతలోనే 'అరి' రీమేక్ గురించి టాలీవుడ్‌లో చర్చలు మొదలయ్యాయి.

## మార్పు తీసుకొచ్చే నాయకుడికి మద్దతు

### విజయ్ పొలిటికల్ ఎంట్రీపై ఉపాసన



తన పనులు, కుటుంబ బాధ్యతలతో బిజీగా ఉండే మెగా కోడలు ఉపాసన సోషల్ మీడియాలోనూ చురుగ్గా ఉంటారు. తన యాక్టివిటీస్‌ను ఎప్పటికప్పుడు సోషల్ మీడియా వేదికగా పంచుకుంటారు. తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో తన వ్యక్తిగత విషయాలతోపాటు రాజకీయం గురించి కూడా మాట్లాడారు. తాను మాత్రం రాజకీయాల్లోకి రానని స్పష్టం చేశారు. మార్పు తీసుకువచ్చే నాయకుడికి మద్దతు ఇస్తానని పేర్కొన్నారు. తమిళనాడులో విజయ్ రాజకీయ రంగ ప్రవేశంపై ఆమె స్పందించారు. 'సినీ పరిశ్రమకు చెందిన చాలా మంది రాజకీయాల్లో రాణించారు. ముఖ్యమంత్రులుగా సేవలందించారు. విజయ్ నటుడిగా ఎంతో మంది హృదయాలను గెలుచుకున్నారు. ఆయనకు ఫ్యాన్ ఫాలోయింగ్ ఎక్కువ. ఇప్పుడు ప్రజా సేవ చేసేందుకు రాజకీయాల్లోకి వచ్చారంటే అది గొప్ప విషయం. సమాజంలో మార్పు రావాలని కోరుకునే లీడర్ ఎవరైనా సపోర్ట్ చేయాలనేది నా అభిప్రాయం. ఒకవేళ అలాంటి వాళ్లకు సపోర్ట్ చేయకపోయినా.. వెనక్కి మాత్రం లాగకూడదు. విజయ్ గొప్ప రాజకీయనాయకుడు అవుతారని భావిస్తున్నానని అన్నారు. అయితే ఇప్పటి దాకా ఉపాసన తన చిన్న మావయ్య పవన్ కల్యాణ్, జనసేన పార్టీ గురించి ఎక్కడా మాట్లాడలేదు. కానీ ఇప్పుడు విజయ్ రాజకీయరంగ ప్రవేశం గురించి మాట్లాడటం ఆసక్తి రేకెత్తిస్తోంది. ఆమె మాటల్ని దాన్ని బట్టి చూస్తే పవన్ కళ్యాణ్ కు కూడా సపోర్ట్‌గా నిలిచే అవకాశం ఉన్నట్లు కనిపిస్తోంది. సినిమాల గురించి చెబుతూ 'నేను తెలుగు, తమిళ సినిమాలను సబ్ టైటిల్స్‌తో చూస్తాను. ఈ మధ్య అలా చాలా చిత్రాలను చూసి ఎంజాయ్ చేశా. ఈ ఏడాది రానున్న 'గేమ్ ఛేంజర్', 'ఇండియన్ 2' కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నా. 'గేమ్ ఛేంజర్' షూటింగ్ సమయంలోనే మాకు పాప పుట్టింది. అందుకే ఆ చిత్రం మాకు ప్రత్యేకం. చరణ్ నటించిన 'ఆర్ఆర్ఆర్'కు ఆస్కార్ వచ్చిన తర్వాత గేమ్ ఛేంజర్ షూటింగ్‌కి వెళితే.. అక్కడ అందరూ నాటునాటు స్టెప్ వేసి అలరించారు. అది చూసి చాలా ఆనందమేసిందని తెలిపారు. పొలిటికల్ యాక్షన్ థ్రిల్లర్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్రానికి శంకర్ దర్శకత్వం వహిస్తున్నారు. కియారా కథానాయిక.

## ఖచ్చితత్వం పాటిస్తున్న నిర్మాతలు

### ఖర్చులు తడిసిమోపెడయితే సినిమాలకు ఫుల్‌స్టాప్

అక్కడ ఉన్నది స్టార్ హీరో అయినా.. మీడియం రేంజ్ హీరో అయినా.. ఎవరైనా కూడా తమకు వర్కౌట్ కాదు అంటే నిర్మొహమాటంగా సినిమాలను ఆపేస్తున్నారు. ఈ మధ్య కాలంలో ఇలాంటి ట్రెండ్ తెలుగు ఇండస్ట్రీలో ఎక్కువగా కనిపిస్తోంది. సాయి ధరమ్ తేజ్, సంపత్ నంది కాంబినేషన్‌లో రావాల్సిన గాంజా శంకర్ సినిమాను ఆదిలోనే ఆపేశారు సితార ఎంట్టంల్గ÷న్మెంట్స్. దీనికి కారణం ఆ సినిమా బ్జడెట్ ఇష్యూస్ అని తెలుస్తోంది. సాయి ధరమ్ తేజ్ ఈ సినిమా కోసం దాదాపు 15 కోట్ల రెమ్యూనరేషన్ అడిగినట్టు తెలుస్తుంది. అలాగే ఫైనల్ బ్జడెట్ పేపర్ మీదే 60 కోట్ల వరకు పెరగడంతో.. నిర్మాతలు ముందుగానే జాగ్రత్త పడి ఆపేసినట్టు తెలుస్తోంది. లాంటి విషయమే గోపీచంద్ మలినేని, రవితేజ సినిమాకు కూడా జరిగింది. 3 హిట్స్ ఇచ్చిన కాంబినేషన్ అయినా కూడా బ్జడెట్ వర్కవుట్ కాకపోవడంతో.. ఈ సినిమాను పూజా కార్యక్రమాలతోనే ఆపేశారు మైత్రి మూవీ మేకర్స్. ఇదే సినిమాను అజిత్ హీరోగా లాన్ చేస్తున్నాడు గోపీచంద్. ఇక నాని, తమిళ దర్శకుడు శిబి చక్రవర్తి కాంబినేషన్ లో రావాల్సిన సినిమాను కూడా నిర్మాత శ్రీనివాసా చిట్టూరి బ్జడెట్ కారణంగానే ఆపేశాడు. ఈ సినిమాకు 100 కోట్లు అవుతుందని దర్శకుడు చెప్పడంతో.. నాని మీద అది వర్కౌట్ అవ్వదని వెనక్కి తగ్గాడు నిర్మాత. కేవలం ఇవి మాత్రమే కాదు.. ఇంకా చాలా సినిమాలు బయటికి రాకుండా ఆగిపోవడానికి కారణం బడ్జెట్ మాత్రమే. విజువల్ వండర్స్ అయితే ఎన్ని వందల కోట్లు పెట్టడానికైనా నిర్మాతలు రెడీగా ఉంటారు. కానీ రొటీన్ కమర్షియల్ సినిమాల కోసం కూడా 60 నుంచి 100 కోట్లు పెట్టాలి అంటే రిస్క్ తో కూడుకున్న వ్యవహారమే. అందుకే నిర్మొహమాటంగా ఆ సినిమాలను ఆపేస్తున్నారు. ఇది కూడా ఒకందుకు మంచిదే అంటున్నారు విశ్లేషకులు. దీని వల్ల దర్శకులు ఒకటికి పది సార్లు ఆలోచించుకుని బ్జడెట్ లెక్కలు చెప్తారు.

# అఖండ-2 నిర్మాతగా అల్లు ?






'అఖండ' విజయం తర్వాత ఈ సినిమాకు బోయపాటి సీక్వెల్ ప్లాన్ చేస్తున్న విషయం తెలిసిందే. అయితే 'అఖండ 2' సినిమాకు సంబంధించి ఒక సాలిడ్ న్యూస్ సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతుంది. ఇంతకీ ఆ వార్త ఏంటి అంటే.. బోయపాటి త్వరలోనే బాలకృష్ణతో 'అఖండ 2' ఎ÷-లాన్ చేస్తున్నట్లు ఈ సినిమాకు అల్లు అరవింద్ నిర్మాతగా వ్యవహరించనున్నట్లు తెలుస్తుంది. ఈ ఏడాది చివర్లో జరగనున్న ఏపీ అసెంబ్లీ ఎన్నికల రాజకీయ ప్రచారానికి విరామం తీసుకోనున్నారు బాలకృష్ణ. ఇక ఎన్నికల అనంతరం బాలయ్య 'అఖండ 2' షూటింగ్‌ను ప్రారంభించనున్నట్లు సమాచారం. కాగా దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉ ంది. టాలీవుడ్ మాస్ కమర్షియల్ మాస్ బ్లాక్‌బస్టర్స్ దర్శకుడు బోయపాటి శ్రీను, అగ్ర నిర్మాత ఏస్ ప్రొడ్యూసర్ అల్లు అరవింద్‌లు త్వరలో ఓ సినిమాకు చేతులు కలపనున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. వీరిద్దరి కాంబినేషన్‌లో ఇంతకుముందు సరైనోడు సినిమా రాగా ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద బ్లాక్ బస్టర్ అందుకోవడమే కాకుండా అల్లు అర్జున్‌కు మాస్ ఇమేజ్ తెచ్చిపెట్టింది. ఇక 2016 తర్వాత అల్లు అరవింద్, బోయపాటి చేతులు కలుపుతుండడంతో ఈ ప్రాజెక్ట్‌పై భారీ అంచనాలు నెలకొన్నాయి. అయితే ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించి మొదట అల్లు అర్జున్‌తో ఈ సినిమా ఉ ండబోతుందని అందరూ అందరూ అనుకున్నారు. కానీ అనుహ్యంగా ఈ ప్రాజెక్ట్‌లోకి బాలకృష్ణ వచ్చి చేరాడు.

## డబ్బు కోసం పెళ్లిపేరుతో మోసం

# మహిళా నిర్మాతపై కేసు నమోదు

డబ్బు కోసం పెళ్లి పేరుతో మోసం చేయడంతోపాటు వేధింపులకు పాల్పడుతున్న మహిళా నిర్మాతపై జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్లో కేసు నమోదైంది. గతంలో జరిగిన పెళ్లిళ్ల విషయాన్ని దాచి పెట్టి ఓ మహిళ ప్రేమ పేరుతో యువకుడిని పెళ్లి చేసుకుంది. అతని వద్ద నుంచి అందినకాడికి డబ్బు దండుకుంది. తీరా ఆమె గురించి ఆరా తీయగా విస్తుపోయే నిజాలు బయటపడ్డాయి. దాంతో తాను మోసపోయాయని ఆ యువకుడు పోలీసులను ఆశ్రయించాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు వెంకటగిరి ప్రాంతానికి చెందిన పుల్లంశెట్టి నాగార్జున బాబు (35) సినీ ఇండస్ట్రీలో కెమెరా అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. 'బైరవపురం' సినిమా షూటింగ్ సమయంలో చిత్ర నిర్మాతగా వ్యవహరించిన గుడివాడ ఆశా మల్లికతో పరిచయం ఏర్పడింది. సినిమా షూటింగ్ పూర్తయిన తర్వాత ఆ మహిళ నిర్మాత నాగార్జున బాబుకి ఫోన్ చేసి డిన్నర్‌కు ఆహ్వానించింది. డిన్నర్ తర్వాత వారిద్దరి మధ్య శారీరక సంబంధం ఏర్పడింది. కొన్నాళ్ల తర్వాత తాను గర్భం దాల్చానని నాగార్జునకు చెప్పింది. అంతకుముందే తనకు పెళ్లి అయిందనే విషయాన్ని చెప్పి భర్తకు విడాకులు ఇచ్చి పెళ్ళి చేసుకుందామని ఆశా మల్లిక నాగార్జున బాబుకు చెప్పింది. దీనికి కూడా అతను ఒప్పుకోవడంతో ఇద్దరు చిలుకూరి బాలాజీ దేవాలయంలో పెళ్లి చేసుకున్నారు. అనంతరం ఆమె అతని నుంచి రూ. 18,50,000లను నేరుగా, మరో రూ. 10 లక్షలనును ఆమె బ్యాంక్ అకౌంట్‌లోకి జమ చేయించుకుంది. డబ్బు అందాక ఆమె ప్రవర్తనలో మార్పు గమనించాడు నాగార్జున. తరచూ గొడవలు పడుతుండటంతో ఆమెపై అనుమానంతో వచ్చిన నాగార్జునబాబు ఆరా తీయగా అప్పటికే ఆమెకు రెండు వివాహాలు అయ్యాయని, ముగ్గురు పిల్లలు ఉన్నారని తెలిసింది. కానీ తనకు ఒక వివాహం అయ్యిందని, పిల్లలు లేరని చెప్పి తనను మోసం చేసి పెళ్లి చేసుకుని డబ్బులు కాజేసిందని గ్రహించాడు. గతంలోనూ ఆమె పలువురిపై పోలీస్ స్టేషన్లలో కేసులు పెట్టి వారిని ఇబ్బందులకు గురిచేసినట్లు తెలిసింది. వైజాగ్ గాజువాక పోలీస్ స్టేషన్ లో భరత్ అనే వ్యక్తిపై, కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్లో శ్రీనివాస్ అనే వ్యక్తిపై, నార్సింగ్ ఠాణాలో కార్తికేయ అనే వ్యక్తులపై కేసులు నమోదు చేసింది. తనను కూడా బ్లాక్‌మెయిల్ చేసి ఇబ్బందులకు గురిచేస్తుందంటూ నాగార్జున జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. ఆశా మల్లికకు సంబంధించిన మోసాల చిట్టాను పోలీసుల ముందు ఉంచాడు. తాను నమోదు చేయించిన కేసును రాజీ చేసుకోవాలంటే ఆస్తిలో వాటా ఇవ్వాలని బెదిరిస్తోందని నాగార్జునబాబు పోలీసులకు తెలిపారు. ఆశా మల్లికపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# అడ్వెంచర్ మూవీ ఊరు పేరు భైరవకోన






యంగ్ ట్యాలెంటెడ్ సందీప్ కిషన్ మ్యాజికల్ ఫాంటసీ అడ్వెంచర్ మూవీ 'ఊరు పేరు భైరవ కోనస విఐ ఆనంద్ దర్శకత్వం వహిస్తున్నారు. కావ్య థాపర్ , వర్ష బొల్లమ్మ కథానాయికలుగా నటించారు. హాస్య మూవీస్ బ్యానర్‌పై రాజేష్ దండా లావిష్ స్కేల్ లో నిర్మించారు. ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్‌పై అనిల్ సుంకర సగర్వంగా సమర్పిస్తున్నారు. బాలాజీ గుత్తా ఈ చిత్రానికి సహ నిర్మాత. ఇప్పటికే విడుదలైన ఈ చిత్రం ప్రమోషనల్ కంటెంట్ ప్రేక్షకులలో హ్యూజ్ బజ్‌ను క్రియేట్ చేశాయి. ఈ చిత్రం ఫిబ్రవరి16న ప్రపంచ వ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ నేపథ్యంలో హీరోయిన్ వర్ష బొల్లమ్మ'ఊరు పేరు భైరవకోన' విశేషాలని విలేకరుల సమావేశంలో పంచుకున్నారు. చిత్రకత చాలా కొత్తగా, అద్భుతంగా అనిపించింది. అసలు ఇలాంటి కథ ఎలా అలోచించగలిగారో అనిపించింది. ఇలాంటి పాత్ర గతంలో ఎప్పుడూ చేయలేదు. చేయగలనా? లేదా? అని ఆలోచించుకోవడానికి కొంత సమయం అడిగాను. తర్వాత ఆనంద్ కంప్లీట్ నేరేషన్ ఇచ్చారు. అది వినగానే చాలా ఆనందంగా అనిపించింది. చేయగలననే నమ్మకం కుదిరింది. ఇందులో భూమి అనే పాత్రలో కనిపిస్తాను. భూమి ట్రైబల్ గర్ల్. తన ఊర్లో తనొక్కరే చదువుకున్న అమ్మాయి. చూడటానికి అందంగా అమాయకంగా కనిపిస్తుంది. తప్పుని నిలదీసే ధైర్యం వున్న అమ్మాయి. ఆ పాత్ర బలం సినిమా చూస్తున్నప్పుడు ప్రేక్షకులకు అర్థమౌతుంది. స్వాతిముత్యం, మిడిల్ క్లాస్ మేలోడీస్ చిత్రాల్లో గర్ల్ నెక్ట్స్ డోర్ పాత్రల్లో కనిపించాను. ఇందులో మాత్రం గర్ల్ నెక్ట్స్ ఫారెస్ట్ పాత్ర అనాలి ట్రైలర్ లో చూస్తే నాకు ఒక యాక్షన్ సీన్ ఉంటుంది. భూమి పాత్రలో చాలా పవర్ వుంది. నేను హిల్ స్టేషన్(కూర్గ్) నుంచి వచ్చాను. పక్రుతి జీవితంలో ఒక భాగం. నిజ జీవితంలో కూడా మేము చెట్లు, నదులు, కొండలు, జంతువులని ఆరాధిస్తాం. ఆ రకంగా భూమి పాత్ర నేను రిలేట్ చేసుకునే విధంగా వుందని వివరించారు.

## గుండెపోటుతో 8వ తరగతి విద్యార్థిని మృతి

**సిద్ధిపేట:** గుండెపోటుకు సంబంధించిన విస్మయం కలిగిస్తున్నాయి. ఒకప్పుడు వయసు మళ్లిన వారిలోనే గుండె పోటు సంబంధిత సమస్యలు వచ్చేవి. కానీ ప్రస్తుతం పట్టుమని పాతికేళ్లు కూడా నిండకుండానే గుండెపోటు కారణంగా మరణిస్తున్నారు. ఇలాంటి దారుణ సంఘటనలు దేశవ్యాప్తంగా ఎక్కడో ఒక చోట జరుగుతూనే ఉన్నాయి. ఇక ఇటీవల పాఠశాల విద్యార్థులు సైతం గుండెపోటు బారినపడుతుండడం, ఆందోళన కలిగిస్తుంది. చిన్నారుల్లో గుండె పోటు రావడం ఏంటని అటు నిపుణులు సైతం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరీ ముఖ్యంగా కరోనా మహమ్మారి తర్వాత గుండెపోటు సమస్యలు ఎక్కువవుతున్నాయి. గుండెపోటు బారిన పడుతోన్న వారిలో భారతీయులే అత్యధికులు కావడం కూడా చర్చనీయాంశంగా మారుతోంది. ఇదిలా ఉంటే తాజాగా తెలంగాణలోని సిద్ధిపేటలో ఓ చిన్నారి గుండెపోటుతో మరణించడం స్థానికంగా ఆందోళన కలిగించింది. వివరాల్లోకి వెళితే.. సిద్ధిపేటకు సమీపంలో ఉన్న తడ్కపల్లి గ్రామానికి చెందిన అంబటి లక్షణ్య అనే 13 ఏళ్ల చిన్నారికి మంగళవారం నుంచి జ్వరంతో బాధపడుతోంది. ఇదే సమయంలో డాక్టర్ రాసిచ్చిన మందులను ఉపయోగించింది. అయితే బుధవారం బాత్ రూమ్‌లో స్నానం చేస్తుండగా ఒక్కసారిగా కుప్పకూలిపోయింది. వెంటనే అలర్ట్ అయిన కుటుంబ సభ్యులు చిన్నారిని ఆసుపత్రికి తీసుకెళ్లారు. అయితే ఆ చిన్నారి అప్పటికే మరణించినట్లు వైద్యులు నిర్ధారించారు.

## ఢిల్లీ మెట్రో స్టేషన్‌లో ప్రమాదం

### కూలిన ప్లాట్‌ఫారమ్ సైడ్ వాల్

**న్యూఢిల్లీ:** ఢిల్లీ మెట్రో గోకుల్‌పురి స్టేషన్‌లో గురువారం ఘోర ప్రమాదం జరిగింది. గోకుల్‌పురి మెట్రో పింక్‌లైన్ స్టేషన్‌లో ప్లాట్‌ఫారమ్ సైడ్ వాల్‌లో కొంత భాగం కూలిపోయి రోడ్డుపై పడింది. ఉదయం సమయం కావడంతో మెట్రో స్టేషన్ దిగువన వెళ్లే రోడ్డుపై జనం రాకపోకలు సాగిస్తున్నారు. దీంతో ఒక్కసారిగా ప్లాట్ పారమ్ సైడ్ వాల్ కూలిపోవడంతో భయాందోళనకు గురి అయ్యారు. శిథిలాలలో ఒకరు చిక్కుకోగా, 3 నుంచి 4 మందికి గాయాలైనట్లు వార్తలు కూడా వస్తున్నాయి. ఘటనా సమయంలో స్కూటర్‌పై వెళుతున్న వ్యక్తి శిథిలాల కింద చిక్కుకున్నారు. కొందరి సహాయంతో పోలీసులు బయటకు తీశారు. క్షతగాత్రులను జీటీబీ ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రులను గుర్తించేందుకు చర్యలు చేపట్టి మరింత సమాచారం సేకరిస్తున్నారు. ఘటన జరిగిన వెంటనే జేసీబీ, క్రేన్ సహాయంతో శిథిలాలను తొలగించారు. ఈ ఘటనపై సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదు చేసి తదుపరి దర్యాప్తు జరుపుతున్నామని ఉత్తర ఢిల్లీ డీసీపీ తెలిపారు. అదే సమయంలో, ఈ ప్రమాదం తర్వాత, మెట్రో యొక్క కొత్త మార్గాలలో పింక్ రూట్ ఒకటి కాబట్టి నిర్మాణ పనుల నాణ్యతపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి.


prajamantalau daily pages (09-02-24)_times of varha main (13-2).qxd 2/8/2024 10:21 PM Page 7



## కరోనా వలలో చిక్కుకున్న క్రికెటర్లు

క్రికెటర్లను కరోనా నిద్రపోనివ్వడం లేదు. ఎన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నా ఈ వైరస్ బారిన పడుతూనే ఉన్నారు ప్లేయర్లు. ఇప్పటికే న్యూజిలాండ్, ఆస్ట్రేలియా జట్లలోని పలువురు స్టార్ క్రికెటర్లు ఈ మహమ్మారి వలలో చిక్కుకున్నారు. తాజాగా ఆస్ట్రేలియాకు చెందిన స్టార్ ఆల్ రౌండర్‌కు కరోనా సోకింది. వెస్టిండీస్ ప్రస్తుతం ఆస్ట్రేలియాలో ఆతిథ్య జట్టుతో మూడు మ్యాచ్‌ల సిరీస్ ఆడుతోంది. ఇప్పటికే ఇరు జట్ల మధ్య టెస్టు, వన్డే సిరీస్‌లు ముగియగా టీ20 సిరీస్ మాత్రమే మిగిలి ఉంది. ఇరు జట్ల మధ్య 2 మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్ 1-1తో డ్రాగా ముగిసింది. ఆ తర్వాత జరిగిన మూడు వన్డేల సిరీస్‌లో ఆతిథ్య ఆస్ట్రేలియా ఏకపక్షంగా వన్డే సిరీస్‌ను కైవసం చేసుకుంది. ఇప్పుడు ఆస్ట్రేలియా, వెస్టిండీస్ జట్ల మధ్య టీ20 సిరీస్ ఫిబ్రవరి 9 నుంచి అంటే శుక్రవారం నుంచి ప్రారంభం కానుంది. తొలి మ్యాచ్ హెూబర్ట్‌లో జరగనుండగా, మధ్యాహ్నం 1.30 గంటలకు మ్యాచ్‌లు ప్రారంభం కానున్నాయి. అయితే అంతలోనే ఆసీస్ శిబిరానికి షాక్ తగిలింది. ఆస్ట్రేలియా టీ20 కెప్టెన్ మిచెల్ మార్ష్‌కు కరోనా సోకింది. దీంతో అతడు టీ20 సిరీస్‌లో ఆడడంపై సందేహం నెలకొంది. నిజానికి, ఆసీస్ ఆటగాడు కెమరూన్ గ్రీన్‌కు అంతకుముందు కూడా వ్యాధి సోకింది. అయితే అతను టెస్టు సిరీస్ ఆడాడు. అందువల్ల మార్ష్‌కు కరోనా పాజిటివ్‌గా ఉన్నప్పటికీ టీ20 సిరీస్‌లో ఆడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. అయితే క్రికెట్ ఆస్ట్రేలియా ప్రోటోకాల్ ప్రకారం, కరోనా సోకిన మిచెల్ మార్ష్ కొన్ని నియమాలు, నిబంధనలను పాటించాలి. ఉదాహరణకు మిచెల్ మార్ష్ జట్టు సభ్యులతో డ్రెస్సింగ్ రూమ్‌ను పంచుకోలేడు. వారి కోసం ప్రత్యేక ఏర్పాటు చేస్తారు. అలాగే మైదానంలో ఇతర ఆటగాళ్లకు మార్ష్ దూరం పాటించాలి. అలాగే, మైదానంలో జట్టు వేడుకల సమయంలో, మీరు ఇతర ఆటగాళ్ల దగ్గరికి రాలేరు. టెస్టు మ్యాచ్‌లో కరోనా సోకిన కామెరాన్ గ్రీన్‌కు కూడా ఇలాంటి సూచనలే అమలు చేశారు. దీని ప్రకారం, మ్యాచ్ మధ్యలో వికెట్లు పడినప్పుడు ఆటగాళ్లతో గ్రీన్ సెలబ్రేషన్స్ లో పాల్గొనలేదు. అతను ఇతర ఆటగాళ్లకు దూరంగా ఉన్నాడు. ఇప్పుడు మార్ష్ కూడా ఆ నిబంధనలను పాటించాల్సిందే. ఫిబ్రవరి 9న హెూబర్ట్‌లో ఆస్ట్రేలియా, వెస్టిండీస్ మధ్య తొలి టీ20, ఫిబ్రవరి 11న అడిలైడ్‌లో, ఫిబ్రవరి 13న పెర్త్‌లో రెండు మ్యాచ్‌లు జరగనున్నాయి. అంతకుముందు ఇరు జట్ల మధ్య జరిగిన టెస్టు సిరీస్ 1-1తో డ్రాగా ముగియగా, వన్డే సిరీస్‌ను ఆస్ట్రేలియా క్లీన్ స్వీప్ చేసింది.

## ఎవరు బెస్ట్ అనే చర్చకు మహ్మద్ షమీ ఫుల్ స్టాప్ పెట్టాడు



విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ ఎవరు బెస్ట్? ఈ ప్రశ్న తరచుగా వినిపిస్తుంది. ఈ ప్రశ్నకు కొందరు కింగ్ కోహ్లీ అని, మరికొందరు హిట్ మ్యాన్ అని సమాధానమిసస్తారు. అయితే ఇదే ప్రశ్నను టీమ్ ఇండియా పేసర్ మహమ్మద్ షమీని అడగ్గా తెలివైన సమాధానం చెప్పాడు. ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న మహమ్మద్ షమీకి విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ. వీరిలో అత్యుత్తమ బ్యాట్స్‌మెన్ ఎవరు అని ప్రశ్నించారు. ఇద్దరినీ దగ్గరుండి చూసిన షమీకి ఒకరిని ఎంచుకోవడం కష్టమైంది. అందుకే తెలివిగా సమాధానాలు ఇస్తూ ఇద్దరినీ మెచ్చుకున్నాడు షమీ. ఈ ప్రశ్నకు షమీ సమాధానమిస్తూ, విరాట్ కోహ్లీ ప్రపంచంలోనే అత్యుత్తమ బ్యాటర్. ఇప్పటికే ఎన్నో రికార్డులను బద్దలు కొట్టాడు. అందుకే నేను విరాట్ కోహ్లీని ప్రపంచంలోనే అత్యుత్తమ బ్యాటర్ అని పిలుస్తాను' అని షమీ బదులిచ్చాడు. అదే సమయంలో రోహిత్ శర్మ ప్రపంచంలోనే అత్యంత ప్రమాదకరమైన బ్యాటర్. కాబట్టి నా అభిప్రాయం ప్రకారం, విరాట్ కోహ్లీ ప్రపంచంలోనే అత్యుత్తమ బ్యాటర్, రోహిత్ శర్మ ప్రపంచంలోనే అత్యంత ప్రమాదకరమైన బ్యాటర్ ' అని మహ్మద్ షమీ సమాధానమిచ్చాడు. తన తెలివైన సమాధానంతో కింగ్ కోహ్లీ, హిట్‌మ్యాన్‌లలో ఎవరు బెస్ట్ అనే చర్చకు మహ్మద్ షమీ ఫుల్ స్టాప్ పెట్టాడు. ఇప్పుడు షమీ తెలివైన సమాధానానికి విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ అభిమానుల నుండి కూడా భారీ ప్రశంసలు లభిస్తున్నాయి. చీలమండ గాయం కారణంగా ఇంగ్లండ్‌తో జరుగుతున్న టెస్టు సిరీస్‌కు మహ్మద్ షమీ దూరమయ్యాడు. వన్డే ప్రపంచకప్ సందర్భంగా షమీ కాలికి గాయమైంది. అయితే ప్రపంచకప్‌లో పెయిన్‌కిల్లర్స్‌తో బరిలోకి దిగాడు. ఇప్పుడు పాదాల నొప్పుల సమస్య తీవ్రంగా ఉండడంతో చికిత్స తీసుకుంటున్నాడు. దీంతో ఇంగ్లండ్‌తో జరిగిన తొలి రెండు టెస్టు మ్యాచ్‌లకు మహ్మద్ షమీ అందుబాటులో లేడు. అతను పూర్తిగా కోలుకోకపోవడంతో మూడో టెస్టు మ్యాచ్‌లో ఆడడం అనుమానమే. కాబట్టి షమీ పునరాగమనం కోసం మరికొద్ది రోజులు వేచి చూడక తప్పదు. ఇదిలా ఉంటే షమీ జీవితం ఆధారంగా ఓ రాబోతోందనే వినిపిస్తున్నాయి. అయితే ఆ పాత్రలో ఎవరు నటిస్తారనేది మాత్రం ఈ స్టార్ పేసర్ వెల్లడించలేదు.

## జోబర్గ్ సూపర్ కింగ్స్ క్వాలిఫియర్-2కు నేరుగా అర్హత

సౌతాఫ్రికా టీ20 క్రికెట్ లీగ్-2024లో జోబర్గ్ సూపర్ కింగ్స్ క్వాలిఫియర్-2కు నేరుగా అర్హత సాధించింది. ఈ లీగ్‌లో భాగంగా బుధవారం నాడు పార్ల్ రాయల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో 9 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. దీంతో క్వాలిఫియర్-2 బెర్త్‌ను ఖారారు చేసుకుంది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన పార్ల్ రాయల్స్ నిర్ణీత 20 ఓవర్లలో 138 పరుగులకే ఆలౌట్ అయింది. అయితే, జో బర్గ్ బౌలర్లలో సామ్ కుక్ నాలుగు వికెట్లు తీసుకుని రాయల్స్ పతనాన్ని శాసించాగా.. నంద్రే బర్గర్ 3, తహీర్ రెండు వికెట్లు తీసుకుని సత్తాచాటారు. ఇక, రాయల్స్ బ్యాటర్లలో డేవిడ్ మిల్లర్(47) ఒక్కడే టాప్ స్కోరర్‌గా నిలిచాడు. అనంతరం క్రీజులోకి వచ్చిన సూపర్ కింగ్స్ ఒక్క వికెట్ నష్టపోయి కేవలం 13.2 ఓవర్లలో 139 పరుగుల లక్ష్యాన్ని ఛేదించింది. అయితే, సూపర్ కింగ్స్ ఓపెనర్లు లీస్ డుప్లే, ఫాఫ్ డుప్లెసిస్ హాఫ్ సెంచరీలతో రెచ్చిపోయారు. డుప్లె 43 బంతుల్లో 7 ఫోర్లు, 2 సిక్సలతో 68 రన్స్ చేయగా.. డుప్లెసిస్ 34 బంతుల్లో 3 ఫోర్లు, 3 సిక్సలతో 55 పరుగులు రాబట్టాడు. ఫిబ్రవరి 8న జోబర్గ్ సూపర్ కింగ్స్ క్వాలిఫియర్-2లో డర్బన్ సూపర్ జెయింట్స్‌తో పోటీ పడబోతుంది.

# బరోడా స్టేడియంలో ప్రాక్టీస్ చేస్తున్న ఇషాన్

టీమిండియా యంగ్ వికెట్ కీపర్ ఇషాన్ కిషన్ ఫ్యాన్స్ కు శుభవార్త.. దాదాపు మూడు నెలలుగా ఆటకు దూరమైన ఈ డాషింగ్ ఓపెనర్ మళ్లీ గ్రౌండ్ లోకి దిగాడు. మానసిక ఆరోగ్యంపై దృష్టి పెట్టిన అతడు వికెట్ కీపింగ్ ప్రాక్టీస్ మొదలు పెట్టాడు. వరల్డ్ కప్ తర్వాత దేశవాళీ క్రికెట్ తో పాటు ఇంగ్లండ్ సిరీస్‌కు దూరమైన ఇషాన్ బరోడా స్టేడియంలో ప్రాక్టీస్ చేస్తున్నాడు. అక్కడి కిరణ్ మోరే అకాడమీలో ప్రాక్టీస్ చేస్తున్నాడు. ఇక, టీమిండియా ఆల్‌రౌండర్లు హార్దిక్ పాండ్యా, కృనాల్ పాండ్యాలతో కలిసి ఇషాన్ కిషన్ ప్రాక్టీస్ చేస్తున్నాడు. కొన్నిరోజులు విశ్రాంతి తీసుకున్న అతడు ఆటపై దృష్టి పెడుతున్నాడు అనే ఈ విషయాన్ని తాజాగా మాజీ క్రికెటర్ కిరణ్‌మోరె తెలిపారు. అయితే.. ఇషాన్ మళ్లీ అంతర్జాతీయ క్రికెట్ ఎప్పుడు ఆడుతాడు? అనేది మాత్రం ఇప్పటి వరకు తెలియరాలేదు. ఇక, ఐపీఎల్‌లో ధనాధన్ ఇన్నింగ్స్‌ల ఆడిన ఇషాన్.. టీమిండియా ఓపెనర్‌గానూ గుర్తింపు తెచ్చుకున్నాడు. వెస్టిండీస్ పర్యటనలో వరుసగా నాలుగు హాఫ్ సెంచరీలతో రాణించాడు. కానీ, వరల్డ్ కప్ 2023 స్క్వాడ్‌లో ఈయంగ్ ప్లేయర్ కు అవకాశం దక్కినా.. శుభ్‌మన్ గిల్ ఎంట్రీ ఇవ్వడంతో బెంచ్‌కే ఫిక్స్ అయ్యాడు. ఆ తర్వాత సౌతాఫ్రికా టూర్ కు ఎంపికైనా సిరీస్ మధ్యలోనే స్వదేశం వచ్చేశాడు. అయితే, ఇంగ్లండ్‌తో టెస్టు సిరీస్ స్క్వాడ్‌కు సెలెక్టర్లు ఇషాన్ కిషన్ ను పట్టించుకోలేదు.. దీంతో ధ్యానం చేస్తున్న వీడియోను ట్విట్టర్ (ఎక్స్)లో పోస్ట్ చేసి సరిపెట్టుకున్నాడు. దాంతో అతడు మళ్లీ జట్టులోకి ఎప్పుడు వస్తాడు? అని ఫ్యాన్స్ ఆందోళన చెందుతున్నారు. ఇదే విషయంపై టీమిండియా హెడ్‌కోచ్ రాహుల్ ద్రవిడ్ స్పందిస్తూ.. ఇషాన్ ఎప్పుడు వచ్చినా జట్టులోకి తీసుకుంటాం.. కాకపోతే అతడు కొన్ని ప్రాక్టీస్ మ్యాచ్‌లు ఆడాల్సి ఉందన్నారు. వచ్చే నెలలో ఐపీఎల్ 17వ సీజన్ ఉన్నందున ఆ లోపు ఇషాన్ కమ్ బ్యాక్ చేస్తాడని ఫ్యాన్స్ ఎదురు చూస్తున్నారు.



# క్రికెట్ మ్యాచ్‌లో అపశ్రుతి..

బంతి తగిలి ఆటగాడికి ధారలా కారిన రక్తం




జెంటిల్మెన్ గేమ్ గా చెప్పుకునే క్రికెట్ లో అప్పుడప్పుడూ కొన్ని ప్రమాదాలు జరుగుతుంటాయి. ఒక్కోసారి ఈ ప్రమాదాల తీవ్రత మరీ ఎక్కువగా ఉంటుంది. ఆటగాళ్ల ప్రాణాల మీదకు తీసుకొస్తుంది. ఆస్ట్రేలియా క్రికెటర్ ఫిల్ హ్యూస్ మరణం ఇప్పటికీ క్రికెట్ అభిమానులను వెంటాడుతోంది. తాజాగా అలాంటిదే మరొక ఘటన చోటు చేసుకుంది. ఆస్ట్రేలియాలో జరుగుతున్న దేశవాళీ క్రికెట్ లో ఒక క్రికెటర్ తీవ్రంగా గాయపడ్డాడు. ఫీల్డింగ్ లో పొరపాటుగా బంతి ముఖానికి తగడడంతో గ్రౌండ్ లోనే రక్తపు వాంతులు చేసుకుంటూ కూలబడిపోయాడు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో వైరలవుతున్నాయి. మార్ష్ కప్‌లో సౌత్ ఆస్ట్రేలియా, విక్టోరియా మధ్య మ్యాచ్ జరిగింది. %వాణ×% ఫార్మాట్‌లో జరుగుతున్న ఈ మ్యాచ్‌లో, దక్షిణ ఆస్ట్రేలియా మొదట బ్యాటింగ్ చేసింది, ఆ తర్వాత లక్ష్యాన్ని ఛేదించే విక్టోరియా ఇన్నింగ్స్ సాగుతున్న సమయంలో ఈ సంఘటన చోటు చేసుకుంది. 25 ఓవర్ లో రెండో బంతికి విక్టోరియన్ బ్యాటర్ థామస్ రోజర్స్ షాట్ ఆడాడు. బంతి బుల్లెట్ వేగంతో గాల్లోకి లేచింది. సౌత్ ఆస్ట్రేలియా ఫీల్డర్ హెన్రీ హంట్ క్యాచ్ ను అందుకునేందుకు రెడీ అయ్యాడు. అయితే పట్టు తప్పడంతో బంతి నేరుగా ముఖానికి తగిలింది. దీంతో అతని ముఖం పగిలిపోయింది. రక్తం కూడా ధారలా కారింది. తలను పట్టుకుని అలాగే నేలపై కూలబడిపోయాడు. దీంతో జట్టు ఫిజియో, డాక్టర్లు వెంటనే గ్రౌండ్ లోకి పరిగెత్తుకుంటూ వచ్చారు. ప్రాథమిక చికిత్స చేశారు. అయితే పరిస్థితి విషమంగా ఉండడతో వెంటనే గ్రౌండ్ నుంచి బయటకు తీసుకెళ్లారు. హెన్రీని చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారని తెలుస్తోంది. బంతి గట్టిగా తగడంతో ముఖం, ముక్కుకు తీవ్ర గాయాలయ్యాయని అందుకే రక్తం ధారలా కారిపోయిందని ఫిజియో అంటున్నారు. సంఘటన జరిగినప్పుడు, విక్టోరియా బ్యాటర్ థామస్ రోజర్స్ 63 పరుగులతో ఆడుతున్నాడు. అయితే ఈ ప్రమాదం తర్వాత బ్యాటింగ్ పై దృష్టి కోల్పోయాడు రోజర్స్. కేవలం 4 పరుగులు జోడించి అవుటయ్యాడు. ఇక మ్యాచ్ ఫలితాల విషయానికి వస్తే విక్టోరియా 3 వికెట్ల తేడాతో విజయం సాధించింది. సౌత్ ఆస్ట్రేలియా నిర్దేశించిన 232 పరుగుల లక్ష్యాన్ని 35 బంతులు మిగిలి ఉండగానే ఛేదించింది.

## మరోసారి పాకిస్తాన్ జట్టు పగ్గాలు బాబర్ ఆజంకే



పాక్ క్రికెట్ బోర్డు కొత్త చైర్మెన్‌గా మొహ్సిన్ నఖ్వీ ఎంపికయ్యారు. గత నెలలో పీసీబీ అధ్యక్ష బాధ్యతల నుంచి తప్పుకొవడంతో జకా అష్రఫ్ స్థానాన్ని మొహ్సిన్ నఖ్వీ భర్తీ చేశాడు. అతడు మూడేళ్ల పాటు ఈ పదవిలో కొనసాగుతాడు. అయితే పీసీబీ చీఫ్‌గా బాధ్యతలు చేపట్టిన నఖ్వీ.. ఓ సంచలన నిర్ణయం దిశగా అడుగులు వేస్తున్నాట్లు టాక్. మరోసారి పాకిస్తాన్ జట్టు పగ్గాలని తిరిగి బాబర్ ఆజంకు అప్పజెప్పాలని నఖ్వీ చూస్తున్నట్లు సమాచారం. కాగా, వన్డే వరల్డ్‌కప్-2023లో ఘోర ప్రదర్శనకు నైతిక బాధ్యత వహిస్తూ బాబర్ ఆజం అన్ని ఫార్మాట్లలో కెప్టెన్సీకి గుడ్‌బై చెప్పాడు. ఈ క్రమంలో అప్పటి పీసీబీ ప్రెసిడెంట్ జకా అష్రఫ్.. పాక్ టెస్టు కెప్టెన్‌గా షాన్ మసూద్, టీ20 కెప్టెన్‌గా షాహీన్ అఫ్రిదికి బాధ్యతలు అప్పగించాడు. అయితే, కెప్టెన్సీలో మార్పులు చోటు చేసుకున్నాక పాకిస్తాన్ టీమ్ పరిస్థితి మరింత దారుణంగా మారింది. కొత్త కెప్టెన్‌లతో ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ పర్యటనలకు వెళ్లిన పాక్.. అక్కడ ఘోర ప్రదర్శన కనబరిచింది. మసూద్ నాయకత్వంలో పాక్.. ఆస్ట్రేలియా చేతిలో వైట్‌వాష్(3 టెస్టులు) కాగా, అఫ్రిది కెప్టెన్సీలో న్యూజిలాండ్‌తో జరిగిన ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌ను 1-4 తేడాతో చేజార్చుకుంది. దీంతో పాక్ క్రికెట్‌ను తిరిగి గాడిలో పెట్టేందుకు జట్టు సారథ్య బాధ్యతలను మళ్లీ బాబర్ ఆజంకే అప్పజెప్పాలని నఖ్వీ ఆలోచిస్తున్నట్లు పాక్ క్రికెట్ వర్గాలు తెలియజేస్తున్నాయి. ఫిబ్రవరి 17 నుంచి జరగనున్న పాకిస్తాన్ సూపర్ లీగ్ స్టార్ట్ కానుంది. ఈ లీగ్ తర్వాత పాకిస్థాన్ జట్టు స్వదేశంలో ఇంగ్లండ్‌తో నాలుగు మ్యాచ్‌ల టీ20 సిరీస్ ఆడబోతుంది. ఈ సిరీస్ నుంచే తిరిగి పాకిస్తాన్ జట్టుకు కెప్టెన్ గా బాబర్ బాధ్యతలు చేపడతాడని పలు రిపోర్ట్‌లు పేర్కొంటున్నాయి.

## యూపీఏ వైఫల్యాలపై "శ్వేతపత్రం'

### పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన నిర్మలా సీతారామన్

**న్యూఢిల్లీ:** అధికార బీజేపీ, కాంగ్రెస్ పార్టీపై తీవ్ర విమర్శలు చేస్తోంది. ఇప్పటికే లోక్‌సభ, రాజ్యసభల్లో ప్రధాని మోడీ కాంగ్రెస్ తీరుపై సంచలన విమర్శలు చేశారు. తాజాగా గురువారం కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ భారత ఆర్థిక వ్యవస్థపై శ్వేతపత్రం ప్రవేశపెట్టారు. యూపీఏ ప్రభుత్వం, ఎన్డీయే ప్రభుత్వ పనితీరును పోల్చారు. 2004లో ఆరోగ్యకరమైన ఆర్థిక వ్యవస్థ వారసత్వంగా యూపీఏ ప్రభుత్వానికి వచ్చిందని, 2014లో తాము అధికారం చేపట్టిన తర్వాత ఎదురైన సంక్షోభాలను డాక్యుమెంట్‌లో ఆమె ప్రస్తావించారు. 2014లో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన సమయంలో దేశ ఆర్థిక వ్యవస్థ దుర్బలమైన స్థితిలో ఉందని, ప్రభుత్వం ఆర్థిక పరిస్థితి అధ్వానంగా ఉందని, ఆర్థిక దుర్వినియోగం, ఆర్థిక క్రమశిక్షణారాహిత్యం ఉందని, ఇది సంక్షోభ పరిస్థితి అని శ్వేతపత్రంలో పేర్కొన్నారు. మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి వేసిన బలమైన ఆర్థిక పునాదులను, సంస్కరణల వేగాన్ని వినియోగించుకోవడంలో కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ విఫలమైందని, దశాబ్ధ కాలాన్ని ఉపయోగించుకోలేదని ఆరోపించింది. యూపీఏ ప్రభుత్వంలో నాయకత్వ సంక్షోభం ఉందని, ప్రభుత్వం జారీ చేసిన ఆర్డినెన్స్‌ని చింపివేయడం సిగ్గుచేటని శ్వేతపత్రం ఆరోపించింది. యూపీఏ అధికారం చేపట్టినప్పుడు భారత్ వృద్ధి రేటు 8 శాతం ఉందని, 1991 ఆర్థిక సంస్కరణల క్రెడిట్ తీసుకోవడంలో విఫలమైన యూపీఏ నాయకత్వం, 2004లో వాటిని పూర్తిగా విడిచిపెట్టిందని శ్వేతపత్రంలో బీజేపీ ఆరోపించింది. యూపీఏ ప్రభుత్వ హయాంలో రెండంకెల ద్రవ్యోల్బణం, ప్రభుత్వ ఆర్థిక నిర్వహణా లోపాలను, విదేశీ మారకద్రవ్య సంక్షోభాలతో పాటు ఇతర వైఫల్యాలను శ్వేతపత్రం హైలెట్ చేసింది. 2004-2014 మధ్య సగటు వార్షిక ద్రవ్యోల్బణం రేటు దాదాపు 8.2% అని శ్వేతపత్రం పేర్కొంది, అధిక ద్రవ్యోల్బణాన్ని నియంత్రించడానికి %ఖూూ% ఏమీ చేయలేదని ఆరోపించింది. యూపీఏ హయాంలో కామన్వెల్త్, 2జీ కుంభకోణాలను కలిగి ఉందని, ఎన్డీయే ప్రభుత్వం 4 జీ ద్వారా ప్రజలు విస్తృత కవరేజీ అందిస్తోందని, జీ20 వంటి సమావేశాలను అత్యుత్తమంగా నిర్వహించినట్లు స్వేతపత్రంలతో పేర్కొన్నారు. ప్రస్తుతం భారత్ 5వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉందని, త్వరలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరిస్తుందని చెప్పింది. ఇండియా వద్ద రికార్డు స్థాయిలో 620 బిలియన్ డాలర్ల విదేశీ మారక నిల్వలు ఉన్నాయని తెలిపింది.

## కవితను పూలే ఇప్పుడు గుర్తుకు వచ్చాడా?

### బీసీలను ఇన్నిరోజులు ఎందుకు పట్టించుకోలేదు

### మాజీ ఎమ్మెల్యే రఘునందన్ రావు

**హైదరాబాద్:** అధికారంలో ఉన్నప్పుడు బీఆర్ఎస్‌కు బడుగులు, బలహీనులు, దళితులు గుర్తుకు రాలేదన్నారు మాజీ ఎమ్మెల్యే రఘునందన్ రావు. ఇవాళ ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కవితను పూలే ఇప్పుడు గుర్తుకు వచ్చాడా? బీసీలను ఇన్నిరోజులు ఎందుకు పట్టించుకోలేదన్నారు. కవితను ఒక విషయంపై ప్రశ్నిస్తున్నానని ఆయన వ్యాఖ్యానించారు. మనకు ఒక ఎంపీ సీటు వస్తుంది అని ఫామ్ హౌజ్ కి వెళ్లి మీ నాన్నకు చెప్పు అని ఆయన అన్నారు. శంకరమ్మకు రాజ్యసభ సీటు ఇవ్వమని అడగండని ఆయన అన్నారు.

PRINTED AND PUBLISHED BY V.NARSINGAM, ON BEHALF OF CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI SHARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI T.C. TELTEL 2021/81092, PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com